www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ *
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 301
గురువారం | 15-2-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: షష్టి ఉ. 10.14 తదుపరి సప్తమి; నక్షత్రం:అశ్విని ఉ. 9.27 తదుపరి భరణి; వర్జ్యం: శేషం ఉ.7.10, రా.6.47-8.20, దుర్ముహూర్తం: ఉ.10.35-11.21, మ.3.10-3.56; అమృతఘడియలు: తె.4.07-5.41, రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పదేళ్లు నేనే సీఎం

ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లపాటు ఇందిరమ్మ రాజ్యం

కంచర గాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని తెచ్చారు!

కేసీఆర్.. పదేళ్లుంటా.. నీకు చేతనైతే వెంట్రుక పీకి చూడు

వెంటనే వస్తానని అంటున్నాడు.. రా.. బిడ్డ ఎట్ల వస్తవో..?

ఆయన పని ఖతం.. మళ్లీ అధికారంలోకి రావడం కల్ల

కేసీఆర్ రావాలనుకున్నా.. ఈ పోలీసు పిల్లలు రానివ్వరు

ఉత్తపుడు బాగానే నడుస్తుండు.. మీటింగ్‌లోనే వీల్ చైర్‌లో

ఏ దారీ లేక నీళ్ల దారి పట్టిండు.. ఢిల్లీ పోదామంటే రాదు

యువతా.. అధైర్యపడొద్దు.. మీ అన్నగా అండగా ఉంటా

కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్

ఎల్బీ స్టేడియంలో 13,445 మంది అభ్యర్థులకు పత్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వచ్చే పదేళ్ల తానే ముఖ్యమంత్రిగా ఉంటానని, ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్ల పాటు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు సూటిగా సవాలు విసురుతున్నానని, చేతనైతే ఒక్క వెంట్రుక పీకి చూడాలని సవాల్ విసిరారు. ఆయన వెంటనే అధికారంలోకి వస్తా అంటున్నాడని.. రా.. బిడ్డ ఎట్ల వస్తవో..? ఇక్కడే ఉంటా.. నీ సంగతేందో చూస్తానని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రావడానికి అయితలేదు కానీ.. కేసీఆర్ నల్లగొండకు పోయిండని ఆయన మాటల మాయలో పడొద్దని సూచించారు. పోలీసు శాఖలో శిక్షణకు ఎంపికైన 13,445 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాలిచ్చే బర్రెను కాదని దున్నపోతును

మిగతా 13వ పేజీలో...



ఎల్బీ స్టేడియంలో ఓ అభ్యర్థినికి కానిస్టేబుల్ నియామక పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్, చిత్రంలో మంత్రులు

కేసీఆర్.. ప్రజలు నీ ప్యాంట్ ఊడబెరికారు
మేం అంగీనీ ఊడదీస్తాం

సీఎంను.. ఏం పీకడానికి పోయిండ్రు అంటావా?

సీఎం, కేంద్ర మంత్రిగా చేసినోడు ఇట్లేనా మాట్లాడేది?

నల్లగొండ సభలో కేసీఆర్ వాడిన భాష పై చర్చిద్దామా?

చచ్చిన పామును ఎవరైనా చంపుతారా?

కేసీఆర్, హరీశ్‌లకే పెత్తనమిస్తాం.. మేడిగడ్డ నింపండి

గోదారి జలాలపై చర్చకు సిద్ధం.. కేసీఆర్‌ను రమ్మనండి

వీల్‌చైర్‌లో వీధి నాటకాలు: అసెంబ్లీలో రేవంత్ ధ్వజం

12

సచివాలయం ఎదురుగా
రాజీవ్ విగ్రహం

శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

13



అసెంబ్లీ ఆవరణలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కంచెల రాజ్యం.. పోలీస్ రాజ్యం

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన, ఉద్రిక్తత

మీడియా పాయింట్‌లో మాట్లాడనివ్వలేదని ఆగ్రహం

చీఫ్ మార్షల్‌తో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ వాగ్వాదం

స్పీకర్‌తో మాట్లాడి వస్తానని వెళ్లి తిరిగిరాని మార్షల్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. కంచెల రాజ్యం, పోలీసు రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బుధవారం సభ నుంచి వాకౌట్ చేసి మాట్లాడేందుకు మీడియా పాయింట్‌కు రాగా.. పోలీసులు, మార్షల్స్ బారికేడ్లు అడ్డుపెట్టారు. సభ జరుగుతుండగా ఇక్కడ మాట్లాడొద్దనే నిబంధన ఉందని చెప్పారు. దీంతో విపక్ష ఎమ్మెల్యేలంతా అక్కడే బైఠాయించారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని

మిగతా 12వ పేజీలో...

రేవంత్.. చేతకాకుంటే రాజీనామా చెయ్!

నేను ముఖ్యమంత్రినై.. సమస్యను వెంటనే పరిష్కరిస్తా

కాళేశ్వరాన్ని బద్నాం చేసేందుకు దుష్ట పన్నాగం: హరీశ్

13

రేణుక, అనిల్‌కుమార్ రాజ్యసభకు



అనిల్‌కుమార్



రేణుకాచౌదరి

కమ్మ, యాదవ సామాజిక వర్గాలకు అవకాశం

నేడు నామినేషన్ దాఖలు చేయనున్న అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల ముంగిట వ్యూహాత్మక ఎంపిక

ఇప్పటికే ఎమ్మెల్సీలుగా బల్మూరి వెంకట్, మహేశ్‌గౌడ్

ఏఐసీసీ కోటా సీటునూ వదులుకున్న అధిష్ఠానం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. వీరిద్దరూ గురువారం నామినేషన్లను దాఖలు చేయనున్నారు. తెలంగాణలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా.. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలం మేరకు రెండు సీట్లు దక్కుతాయి. దీంట్లో ఒక దానిని ఏఐసీసీ కోటాలో ఉంచారు. మరో సీటుకు పార్టీ సీనియర్ నేతలు చిన్నారెడ్డి, వి.హన్మంతరావు లాంటి వారు పోటీపడ్డారు. అయితే.. లోక్‌సభ ఎన్నికల ముంగిట సామాజిక సమతూకాన్ని పాటించాలని అధిష్ఠానం నిర్ణయించింది. దాంతో కమ్మ సామాజిక వర్గం నుంచి రేణుకాచౌదరిని, యాదవ కమ్యూనిటీ

మిగతా 14వ పేజీలో...

బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర

సోనియా నామినేషన్

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు

కర్ణాటక నుంచి మాకెన్

గుజరాత్ నుంచి జేపీ నడ్డా

మహారాష్ట్ర నుంచి చవాన్

అశ్వినీ వైష్ణవ్(బీజేపీ) అభ్యర్థిత్వానికి బీజేడీ మద్దతు

2



పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు వద్ద రెండో రోజూ నిరసన తెలుపుతున్న రైతులు

రైతులపై సోనిక్ అస్త్రం

చెవులకు చిల్లులు పడేలా భారీ శబ్దాలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఎల్ఆర్ఏడీ వినియోగం

డ్రోన్ల ద్వారా బాష్పవాయువు ప్రయోగం.. డ్రోన్లను అడ్డుకునేందుకు పతంగులను ఎగురవేసిన రైతులు

రెండో రోజు కొనసాగిన రైతుల నిరసన.. పోలీసుల రబ్బర్ బుల్లెట్లతో 40 మందికి గాయాలు

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందేనన్న రైతు సంఘాలు.. చర్చలకు ఆహ్వానించిన కేంద్రం

పలు డిమాండ్లకు ఓకే చెప్పిన కేంద్ర మంత్రులు.. ఎమ్మెస్పీకి వెంటనే చట్టబద్ధత కల్పించలేమని వెల్లడి

2

మా హృదయాల్ని గెలిచారు

స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణంలో అందరికన్నా గొప్ప పాత్ర మీదే

యూఏఈ అధ్యక్షుడికి మోదీ ప్రశంసలు

భారతీయుల ప్రత్యేకత భిన్నత్వమే

విశ్వాసాలకూ ఇది అమృతకాలం

ఆలయాన్ని ప్రారంభించిన ప్రధాని

ప్రజల జీవితాల్లో ప్రభుత్వాలు వీలైనంత తక్కువ జోక్యం చేసుకోవాలి

అవినీతికి దూరంగా ఉండాలి..

అందరినీ కలుపుకొని పోవాలి

భారత్‌లో ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం

మా ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది

'ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని నరేంద్ర మోదీ



అబుధాబిలోని ఆలయ ప్రారంభంలో మోదీ, యూఏఈ మంత్రి

అబుధాబి, దుబాయి, ఫిబ్రవరి 14: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుధాబిలో తొలి హిందూ ఆలయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. మత సహనానికి, ప్రపంచ ఐక్యతకు ఈ ఆలయం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. మానవాళి చరిత్రలో ఒక నూతన సువర్ణాధ్యాయాన్ని లిఖించిన యూఏఈకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని

మిగతా 2వ పేజీలో...



కడియం 7 రాజగోపాల్‌రెడ్డి

అసెంబ్లీలో నేతల మధ్య మాటల యుద్ధం

రాజయ్యను మోసం చేశావ్: రాజగోపాల్

కాంగ్రెస్‌కు పట్టిన చీడ నువ్వు: కడియం



12



(ఫైల్)

చేతిలో చేయి వేసి..

ఒకరినొకరు చూసుకుంటూ..

డచ్ మాజీ ప్రధాని డ్రైస్ వాన్ దంపతుల కారుణ్య మరణం

93 ఏళ్ల వయసులో

70 ఏళ్ల ప్రేమకు ముగింపు

2

రాష్ట్రంలో 2 లక్షల మందికి
ముఫ్త్ బిజిలీ!



300 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు

2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు 60 వేల సబ్సిడీ, 3 కిలోవాట్లకు రూ.78 వేలు

ఉత్పత్తయ్యే విద్యుత్తును సొంతంగా వాడుకోవచ్చు, డిస్కంలకు విక్రయించవచ్చు

రాష్ట్ర ప్రభుత్వ 'గృహలక్ష్మి'పై తగ్గనున్న భారం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తాజాగా ప్రకటించిన 'ప్రధానమంత్రి-సూర్యఘర్: ముఫ్త్ బిజిలీ యోజన' రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు వర్తించే అవకాశం ఉంది. ఈ పథకం కింద సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించి, దేశంలో కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకూ ఉచితంగా కరెంటును అందిస్తామని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ పథకం రాష్ట్రంలో ఎంతమందికి వర్తించవచ్చన్నది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో 300 యూనిట్లలోపు కరెంటును వినియోగించే గృహ వినియోగదారులు 1,31,83,273 మంది ఉన్నారు. కాగా, 200 యూనిట్ల వరకూ ఉచితంగా కరెంటు ఇస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గృహజ్యోతి పేరిట హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 200 యూనిట్ల వరకూ కరెంటును వినియోగించుకునే వారి సంఖ్య 95,23,433 మంది. వీరిలో

మిగతా 7వ పేజీలో...



తోరణాలు కడుతున్న పూజారులు

మేడారానికి రక్షాతోరణం

ఘనంగా మండమెలిగే పండుగ

నేటి నుంచి పెరగనున్న భక్తుల రద్దీ

21 నుంచి 4 రోజుల పాటు మహాజాతర

3



వనదేవతల గద్దెల వద్ద భక్తుల కోలాహలం

కేసీఆర్ సర్కారు విద్యను విస్మరించింది

కాంగ్రెస్సైనా పట్టించుకోవాలి.. ఆర్థికమంత్రి భట్టి లెక్కల్లో తేడా

రైతు భరోసా కౌలురైతుకు వర్తిస్తుందా?.. శాసనసభలో అక్బరుద్దీన్

12



బీజేపీ శాసనసభాపక్ష నేతగా

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పాయల్ శంకర్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామోద్దీపన మాత్రలు వేసుకుని శృంగారం

- తొలి రాత్రి భార్యపై భర్త ఆటవిక చర్య
- గాయాలు, ఇన్ఫెక్షన్‌తో బాధితురాలి మృతి
- ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో దారుణం
- ఇంటికి తాళం వేసి పరారైన నిందితుడు

2

రోబో సర్జరీ.. క్యాన్సర్ రోగి బలి!

- శస్త్రచికిత్స సమయంలో ఇతర అవయవాలకు రంధ్రాలు
- రోబో తయారీ సంస్థపై 75వేల డాలర్లకు దావా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: క్యాన్సర్ చికిత్సలో సర్జికల్ రోబోని నమ్ముకుంటే.. అది శస్త్రచికిత్సతోపాటు శరీరంలోని ఇతర అవయవాలకు రంధ్రాలు చేసింది. దీంతో బాధిత మహిళ శస్త్రచికిత్స పూర్తయిన కొద్ది నెలల్లోనే చనిపోయింది. సర్జికల్ రోబో శరీరంలోని ఇతర అవయవాలకు చేసిన రంధ్రాల కారణంగానే తన భార్య చనిపోయిందంటూ మృతురాలి భర్త కోర్టులో దావా వేశారు. అమెరికాలో జరిగిన ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. హార్వే సల్ట్జర్ భార్య శాండ్రా సల్ట్జర్ కొన్నాళ్లుగా పెద్దపేగు కేన్సర్‌తో బాధపడుతూ.. బాప్టిస్ట్ హెల్త్ బోకా రాటన్ రీజినల్ హాస్పటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. వైద్యులు ఆమెకు అనేక చేతులు ఉండి, రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే అధునాతన డావిన్సీ రోబోతో సర్జరీ చేయాలని నిర్ణయించారు. 2021 సెప్టెంబరులో ఆమెకు రోబోటిక్ సర్జరీ నిర్వహించారు. ఆ తర్వాత క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకోవాల్సిన ఆమె 2022 ఫిబ్రవరిలోనే మరణించింది. ఆపరేషన్ సమయంలో ఇతర అవయవాలకు రోబో చేసిన గాయాల కారణంగానే తన భార్య చనిపోయిందని సల్ట్జర్ ఆరోపించారు. ఈ రోబోకు సాంకేతిక సమస్యలున్నాయని అనేక ఫిర్యాదులు అందినప్పటికీ దాని తయారీ సంస్థ ఇంట్యూటివ్ సర్జికల్స్ వాటిని సరిచేయకుండా కప్పిపుచ్చిందని ఆరోపించారు. రోబో వినియోగంపై ఆ సంస్థ వైద్యులకు తగిన శిక్షణ ఇవ్వలేదన్నారు. వైద్యంలో నిర్లక్ష్యం, డిజైన్ లోపం తదితర అంశాలు తన భార్య మరణానికి కారణమయ్యాయని, దీనికోసం తనకు 75వేల డాలర్లు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆ సంస్థపై సల్ట్జర్ దావా వేశారు.

చికున్ గున్యాను లైట్ తీసుకోవద్దు..!

- వైరస్ దశ ముగిసిన మూడు నెలల వరకూ మరణ ముప్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: చికున్ గున్యాను లైట్ తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్ఫెక్షన్ సోకిన మూడు నెలల వరకు మరణించే ప్రమాదం ఉందని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఆ వివరాలను 'ది లాన్సెట్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' జర్నల్‌లో ప్రచురించారు. చికున్ గున్యా అనేది దోమల ద్వారా మనుషులకు వ్యాపించే వైరల్ వ్యాధి. దీని బారినపడి పూర్తిగా కోలుకున్నప్పటికీ.. చాలామందికి ఇది ప్రాణాంతకం కావొచ్చని అధ్యయనంలో పరిశోధకులు కనుగొన్నారు. సాధారణంగా చికున్ గున్యా తీవ్రత వైరస్ సోకిన తర్వాత 14 రోజులపాటు ఉంటుంది. అయితే.. ఆ దశ ముగిసిన తర్వాత కూడా ఇన్ఫెక్షన్లు పెరుగుతాయని, కొన్ని తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని.. వీటిని నిర్లక్ష్యం చేస్తే మరణానికి దారితీసే ప్రమాదం ఉందని బ్రిటన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్నీ డా పైక్సావో క్రూజ్ చెప్పారు. పెక్సావో నేతృత్వంలోని పరిశోధకుల బృందం బ్రెజిల్‌లో చికున్ గున్యా బారినపడి కోలుకున్న 1.5 లక్షల కేసులను పరిశీలించింది.

కామోద్దీపన మాత్రలు వేసుకుని శృంగారం

- తొలి రాత్రి భార్యపై భర్త ఆటవిక చర్య.. నవ వధువు మృతి

హమీర్‌పూర్, ఫిబ్రవరి 14: మిడిమిడి జ్ఞానం, అత్యంత బాధ్యతారాహిత్యంతో ఓ వ్యక్తి చేసిన పని నవ వధువు ప్రాణాలను బలిగొంది. తొలి రాత్రే ఆటవికంగా శృంగారం చేయడంతో వివాహిత చనిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో జరిగిన ఈ పాశవిక ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శోభనం రోజు కామోద్దీపన పెంచే మాత్రలు వేసుకున్న వరుడు.. బాధితురాలిపై రాక్షసంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె జననాంగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆపై ఇన్ఫెక్షన్ కావడంతో వివాహిత తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఈ నెల 7న ఆమెను కాన్పూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి 10న ఆమె చనిపోయింది. గ్యాంగ్ రేప్ చేసినంత దారుణంగా బాధితురాలిపై అత్యాచారం జరిగిందని ఆమెకు చికిత్స అందించిన డాక్టర్ తెలిపారు. వివాహితకు తల్లిదండ్రులు లేరు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె సోదరుడు.. ఫిబ్రవరి 3న సోదరి వివాహాన్ని ఘనంగా జరిపించారు. 4న ఆమెను అత్తగారింటికి పంపించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వరుడు ఇంటికి తాళం వేసి పరారయ్యాడు.

అమెరికాలో ప్రవాస కుటుంబం అనుమానాస్పద మృతి

న్యూయార్క్, ఫిబ్రవరి 14: అమెరికాలోని కాలిఫోర్నియా శాన్‌మాటియోలో సొంతింటిలోనే ఓ భారత సంతతి కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేరళకు చెందిన ఆనంద్ సుజిత్ హెన్రీ (42), భార్య అలిస్ ప్రియాంక (40), పిల్లలు (కవల సోదరులు) నోహ, నీథన్ (4)తో కలసి అలమెడ లాస్ ఫులగాస్‌లో నివసిస్తున్నారు. అయితే వీరి బంధువు ఒకరు సుజిత్ ఇంటికి పలుమార్లు ఫోన్ చేయగా వారు ఎంతకు స్పందించలేదు. ఈ క్రమంలోనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వారి ఆ ఇంటిని తనిఖీ చేసేందుకు వెళ్లారు. తలుపులన్నీ మూసి ఉండటంతో కొంచెం తెరిచి ఉన్న ఓ కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించారు. బాత్రూం వద్ద దంపతుల మృతదేహాలు రక్తపు మడుగులో కనిపించగా.. వారి శరీరంపై తుపాకీతో కాల్చిన గాయాలున్నాయి. పక్కనే ఓ తుపాకీ, తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటు బెడ్రూంలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు కనిపించాయి. అయితే వీరి శరీరాలపై ఎలాంటి గాయాలు లేవు. పోస్టుమార్టం తర్వాత వారి మరణాలకు కారణమేంటనేది తెలుతుందని పోలీసులు చెప్పారు.

తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు జడ్జీల బదిలీ

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు ఇతర రాష్ట్రాల హైకోర్టులకు చెందిన ఇద్దరు జడ్జీలు బదిలీపై రానున్నారు. వారిని బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్రానికి సిఫార్సు చేసింది. వ్యక్తిగత కారణాల దృష్ట్యా తనను వేరే చోటికి బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ మౌషుమి భట్టాచార్య కొలీజియంకు లేఖరాశారు. తన కుమారుడు మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌కు వస్తున్నందున తనను కూడా వేరే హైకోర్టుకు బదిలీ చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ లేఖ రాశారు. ఈ ఇద్దరు న్యాయమూర్తుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు కొలీజియం వారిని తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది. తెలంగాణ హైకోర్టుకు కేటాయించిన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 26 మంది మాత్రమే పనిచేస్తున్నారు. నూతనంగా మరో ఇద్దరు రానుండడంతో ఆ సంఖ్య 28కి చేరనుంది.

బీజేపీలో చేరిన లాల్ బహదూర్ శాస్త్రి మనవడు

న్యూఢిల్లీ, లఖ్‌నవూ, ఫిబ్రవరి 14: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రి బుధవారం కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. లఖ్‌నవూలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపిందర్ సింగ్, ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ సమక్షంలో విభాకర్ శాస్త్రి కాషాయ కండువా కప్పుకున్నారు. విభాకర్ శాస్త్రి గతంలో ఫతేపూర్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

పాక్ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్!

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 14: పాకిస్థాన్ నూతన ప్రధానిగా షెహబాజ్ షరీఫ్(72)కు అవకాశం దక్కనుంది. ఆయన ఎంపిక దాదాపు ఖరారైంది. మాజీ ప్రధాని, పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్(పీఎంఎల్-ఎన్) పార్టీ చీఫ్ నవాజ్ షరీఫ్‌కు షెహబాజ్ స్వయానా తమ్ముడు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ ఇవ్వలేదు. దీంతో సంకీర్ణ సర్కారు ఏర్పాటు అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్-ఎన్ పార్టీ తమతో కలిసి వచ్చిన ఇతర పార్టీలను కలుపుకొని కూటమిగా ఏర్పడింది. ఈ కూటమి సాధారణ మెజారిటీ మార్కు సాధించింది.

డిజిటల్ లావాదేవీలు మరింత భద్రం

- ఓటీపీకి ప్రత్యామ్నాయ అథెంటికేషన్ విధానాలపై ఆర్బీఐ దృష్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఈ లావాదేవీల భద్రతను మరింత పెంచడంతోపాటు వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా అత్యాధునిక అథెంటికేషన్ సదుపాయాల అమలుకు బ్యాంకులను ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం వినియోగదారులు డిజిటల్ లావాదేవీలను పూర్తి చేయడానికి ఎస్ఎంఎస్ ఆధారిత వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ను ఆర్థిక సంస్థలు వినియోగిస్తున్నాయి. నమోదైన మొబైల్ నంబరుకు బ్యాంకులు పంపిన ఓటీపీని నిర్దేశిత సమయంలో ఎంటర్ చేయడం ద్వారా ఆన్‌లైన్ లావాదేవీ పూర్తవుతున్న విషయం తెలిసిందే. అయితే ఇది పూర్తి సురక్షితంగా ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలకు మరింత భద్రత కల్పించాలని, ఇందులో భాగంగా యాప్ ఆధారిత అనుమతి, బయోమెట్రిక్ అథెంటికేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించేలా ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది.

చేతిలో చేయి వేసి.. ఒకర్నొకరు చూసుకుంటూ..

డచ్ మాజీ ప్రధాని దంపతుల కారుణ్య మరణం

అమ్‌స్టర్‌డ్యామ్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: వాలంటైన్స్ డేకి కొద్ది రోజుల ముందు నెదర్లాండ్స్‌లో విషాదం చోటు చేసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని డ్రైస్ వాన్ అగ్ట్, ఆయన సతీమణి యూజీనీ ఇద్దరూ ఒకేసారి మృత్యుఒడిలోకి చేరారు. 93 ఏళ్ల వయసున్న వీరు అక్కడి చట్టం ప్రకారం కారుణ్య మరణాన్ని ఎంచుకొని, చివరి క్షణాల్లో ఒకరి చేతిలో మరొకరు చేతులు వేసుకుని, ఒకరినొకరు చూసుకుంటూ ఈ నెల 5న కన్నుమూశారు. దీంతో వీరి మధ్య 70 ఏళ్ల ప్రేమ బంధానికి తెరపడింది. '1977 నుంచి 1982 వరకూ ప్రధానిగా సేవలందించిన వాన్ అగ్ట్ 93వ పుట్టినరోజు జరుపుకొన్న మూడు రోజుల తర్వాత స్వగ్రామమైన నిజ్‌మెగెన్‌లో తన ప్రియమైన భార్య యూజీనీ చేతిలో చేయి వేసి, ఆమెతో పాటే మరణించారు' అని ఆయన స్థాపించిన హక్కుల సంస్థ 'వాన్ అగ్ట్ క్లబ్' ప్రకటించింది. 2019లో బ్రెయిన్ హేమరేజ్ బారిన పడిన వాన్ అగ్ట్ ఆ తర్వాత పూర్తిగా కోలుకోలేకపోయారు. దంపతులు ఇద్దరూ అస్వస్థతకు గురై నడవడం కూడా కష్టంగా మారింది. ఒకరిని విడిచి మరొకరు జీవించలేమని నిర్ణయించుకున్న తర్వాత వారు కారుణ్య మరణాన్ని ఎంచుకున్నారు. కాగా, 2002లో నెదర్లాండ్స్‌లో కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేసిన తర్వాత అక్కడ ఇలాంటి కేసులు నాలుగు రెట్లు పెరిగాయి. ఒక్క 2022లోనే 8,720 మంది ఈ విధానాన్ని ఎంపిక చేసుకున్నారు. ఆ సంవత్సరం 26 జంటలు కారుణ్య మరణం కోరుకుంటే 2023లో ఈ జంటల సంఖ్య 58కి పెరిగింది.

రైతులపై సోనిక్ అస్త్రం

చెవులు చిల్లులు పడేలా భారీ శబ్దాలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఎల్ఆర్డీఏ వినియోగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన పంజాబ్ రైతులపై పోలీసులు 'సోనిక్ ఆయుధాల'ను ప్రయోగించారు. ఒకే దిశలో కర్ణభేరీలు పగిలేలా శబ్దాలను విడుదల చేయడం సోనిక్ ఆయుధాల ప్రత్యేకత. లాంగ్ రేంజ్ అకూస్టిక్ డివైజ్(ఎల్ఆర్ఏడీ)గా పిలిచే సోనిక్ ఆయుధాలను సాధారణంగా సముద్రపు దొంగలకు హెచ్చరికలు జారీ చేయడానికి వినియోగిస్తుంటారు. కొన్ని దేశాల్లో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు వాడుతున్నారు. అమెరికా సైన్యం అమ్ముల పొదిలో 2000 సంవత్సరం నుంచే సోనిక్ ఆయుధాలుండగా.. 2013లో ఢిల్లీ పోలీసులు వీటిని కొనుగోలు చేశారు. నాలుగేళ్ల క్రితం రైతుల చలో ఢిల్లీ-1.0లో సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించినా.. ట్రాక్టర్లతో బారికేడ్లను బద్ధలు కొట్టుకుంటూ వచ్చిన రైతులు.. ఎర్రకోటపై తమ జెండాను ఎగురవేశారు. మంగళవారం నుంచి చలో ఢిల్లీ-2.0 ప్రారంభమైన నేపథ్యంలో.. రైతులను ఢిల్లీ శివార్లలోనే కట్టడి చేయాలనే ఉద్దేశంతో పోలీసులు ఎల్ఆర్ఏడీలను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా మన చెవులు 90 డెసిబుల్స్ వరకు శబ్దాలను వినగలవు. శబ్దం తీవ్రత అంతకు మించితే.. కర్ణభేరీ దెబ్బతింటుంది. ఎల్ఆర్ఏడీలు 160 డెసిబుల్స్ వరకు శబ్దాలను విడుదల చేస్తాయి. ఇవి ఒకే దిశలో 5 నుంచి 60 డిగ్రీల వ్యాసార్థంలో శబ్దాలను పంపుతాయి. ఎల్ఆర్డఈఏ సామర్థ్యం 2కిలో హెర్ట్జ్‌ల వరకు ఉంటుంది. అంటే.. ఒకే ఫ్రీక్వెన్సీతో 2.4 కిలోమీటర్ల దూరం వరకు భారీ శబ్దాలను పంపగలవు. ఢిల్లీ పోలీసులు సోనిక్ ఆయుధాలను బుధవారం ప్రయోగించినట్లు ఎన్డీటీవీ కథనాలను ప్రసారం చేసింది.



రైతులపై బాష్పవాయువును ప్రయోగిస్తున్న పోలీసులు

డ్రోన్లకు పతంగులతో చెక్

ఆందోళన చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు హరియాణా పోలీసులు మంగళవారం డ్రోన్లతో టియర్‌గ్యాస్ ప్రయోగించారు. రబ్బర్ బుల్లెట్లను ఉపయోగించారు. దీంతో పలువురు రైతులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో టియర్‌గ్యాస్ డ్రోన్లకు విరుగుడుగా రైతులు బుధవారం పతంగులను ఎగురవేశారు. పతంగుల దారాలకు చిక్కుకుపోయే డ్రోన్లు.. కుప్పకూలిపోతాయి. ఇక బాష్పవాయువు ప్రభావాన్ని తగ్గించేలా ఎక్కడికక్కడ నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు వాటర్ బాటిళ్లు, కాటన్ దుస్తులను తమ దగ్గర పెట్టుకున్నారు. బాష్పవాయువు ప్రయోగం జరిగినప్పుడు కాటన్ దుస్తులను తడిపి.. ముఖానికి కట్టుకోవడం వల్ల దాని దుష్ప్రభావాల నుంచి తప్పించుకోవచ్చని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు బుధవారం మధ్యాహ్నం హరియాణా పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో జరిపిన కాల్పుల్లో 40 మంది రైతులు గాయపడ్డారు.

శివార్లలో రోడ్ల దిగ్బంధం

ఢిల్లీ శివార్లలో.. ముఖ్యంగా పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు వద్ద, ఢిల్లీ-హరియాణా సరిహద్దుల్లోని సింఘ్వాలా-ఖనౌరీ రహదారిని రైతులు దిగ్బంధం చేశారు. ఆ ప్రాంతాల్లో సుమారు 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో లక్ష మందికిపైగా రైతులు ఢిల్లీ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. రైతులు ఢిల్లీ వైపు చొచ్చుకెళ్లకుండా ఉండేందుకు హరియాణా పోలీసులు సిమెంట్ దిమ్మెలు, బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. గతంలో రైతులు ట్రాక్టర్లతో బ్యారికేడ్లను తప్పిస్తూ ముందుకు దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు వస్తే.. వాటి టైర్లు పంక్చర్ అయ్యేలా రోడ్లపై మేకులు, ఇనుప ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు. ముందుకు దూసుకొచ్చే రైతులు రోడ్లపై జారిపడేలా, వాహనాలు అదుపుతప్పేలా ల్యూబ్రికెంట్స్‌ను వేశారు. ఓవైపు రైతుల ఆందోళన, మరోవైపు పోలీసుల దిగ్బంధనాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రైతు నేతలతో కేంద్రం చర్చలు

రైతు సంఘాల నేతలు మంగళవారం నుంచే చర్చలకుడిమాండ్ చేస్తుండగా.. కేంద్రం బుధవారం ఉదయం నుంచి ఆ దిశగా చర్యలను ప్రారంభించింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అర్జున్ ముండా, పీయూష్ గోయల్ ఉదయం భేటీ అయ్యి.. రైతు నేతల డిమాండ్లు, పోలీసుల చర్యలపై చర్చించారు. మధ్యాహ్నం 2.30 సమయంలో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్‌గోయల్, నిత్యానంద్ రాయ్.. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాతో వేర్వేరుగా చర్చలు జరిపారు. రైతు నేతల డిమాండ్లలో కొన్నింటికి కేంద్ర మంత్రులు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెస్పీకి చట్టబద్ధతపై ఇప్పటికిప్పుడు చట్టం చేయలేమని, అన్నివర్గాలు, రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని వివరించారని సమాచారం. అంతవరకు రైతులు తమ ఆందోళనలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గురువారం సాయంత్రం 5 గంటలకు మూడో విడత చర్చలు జరపనున్నట్లు కేంద్రం ప్రకటించింది.

లోకం తీరు



మద్దతు ధరకు

చట్టబద్ధతనివ్వాల్సిందే

- రైతు సంఘాల డిమాండ్

కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు చట్టబద్ధతనిచ్చే దాకా తమ ఆందోళన కొనసాగుతుందని రైతు సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. రైతు నేత సర్వణ్ సింగ్ పంధేర్ మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు టియర్‌గ్యాస్‌ను ప్రయోగించడం వల్ల చాలా మంది రైతులు గాయపడ్డారని, పలువురు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. కేంద్రం ఇలాంటి చర్యలను నిలువరించి, చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. తాము కేంద్రంతో ఘర్షణకు రాలేదని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే తమ పోరాటమని వివరించారు. మరో నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ కూడా ఎమ్మెస్పీనే తమ ప్రధాన డిమాండ్ అని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని పేర్కొన్నారు.

మోదీది నియంతృత్వ పోకడ: కాంగ్రెస్

రైతులపై పోలీసుల దాడిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నాటి దాడిలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు గుర్మీత్ సింగ్‌ను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. రైతులపై ప్రధాని మోదీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ ఎక్స్‌లో మండిపడ్డారు. రైతులకు తాము అండగా ఉంటామని గుర్మీత్‌కు ధైర్యం చెప్పారు. కాగా, ఝార్ఖండ్‌లో బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన రెండో విడత భారత్ జోడో న్యాయ యాత్ర రద్దు అయ్యింది. రైతుల చలో ఢిల్లీ ఆందోళనలో పాల్గొనేందుకు రాహుల్ దేశ రాజధానికి వెళ్లడంతో యాత్రను రద్దు చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్ ఇప్పటిది కాదని, 2011లో కూడా గుజరాత్ సీఎంగా మోదీ ఇదే డిమాండ్ చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ గుర్తుచేశారు.

గల్ఫ్‌లోనే

అతిపెద్ద ఆలయం

- రూ.700 కోట్లతో ఐదేళ్లలో నిర్మించిన స్వామి నారాయణ్ సంస్థ

అబుదాబి, ఫిబ్రవరి 14: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుధాబిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన తొలి హిందూ ఆలయంలో ప్రాచీన నిర్మాణ పద్ధతులతోపాటు అత్యాధునిక టెక్నాలజీలను ఉపయోగించారు. దుబాయి-అబుదాబి షేక్ జయ్యద్ హైవేపై అల్‌రబా వద్ద ఉన్న అబూ మ్రీఖా అనే ప్రాంతంలో యూఏఈ ప్రభుత్వం విరాళంగా ఇచ్చిన 27 ఎకరాల స్థలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. గల్ఫ్ ప్రాంతంలోనే అతిపెద్దదైన ఈ ఆలయాన్ని బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంస్థ (బీఏపీఎస్) రూ.700 కోట్లతో నిర్మించింది. శిల్ప, స్థపత్య శాస్త్రాల్లో పేర్కొన్న ప్రాచీన నిర్మాణ పద్ధతులను ఆలయ నిర్మాణంలో ఉపయోగించారు. ఎలాంటి లోహాన్ని వాడలేదు. పునాదిలో వేసిన కాంక్రీట్ మిక్స్‌లో 55శాతం సిమెంట్ బదులుగా ఫ్లైయాష్ వాడారు. తద్వారా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించారు. ఉష్ణోగ్రత, పీడనం, భూకంప కదలికలను గుర్తించటానికి వీలుగా ఆలయంలో అడుగడుగునా 300కుపైగా హైటెక్ సెన్సర్లను ఏర్పాటు చేశారు. ఉష్ణనిరోధక నానో టైల్స్‌ను, అద్దాలను వాడారు. వేడి వాతావరణంలోనూ ఇబ్బందులు లేకుండా ఆలయాన్ని భక్తులు సందర్శించుకోవటానికి వీలుగా వీటిని ఉపయోగించారు. 18 లక్షల ఇటుకలు, 1.8 లక్షల క్యూబిక్ మీటర్ల శాండ్‌స్టోన్‌ను వాడారు. శాండ్‌స్టోన్‌ను రాజస్థాన్ నుంచి తెచ్చారు. దాదాపు 20వేల టన్నుల శాండ్‌స్టోన్ పలకలను రాజస్థాన్‌లో శిల్పాలుగా మలిచి అక్కడి నుంచి 700 కంటైనర్లలో అబుధాబికి తరలించారు. ఆలయం లోపలి శిల్పాలకు ఇటలీ మార్బుల్‌ను వాడారు. దాన్ని రాజస్థాన్‌కు తరలించి శిల్పాలుగా మలిచి అబుధాబికి తెచ్చారు. అయోధ్య రామాలయాన్ని నిర్మించిన నగర నిర్మాణ శైలిలోనే ఈ ఆలయాన్ని నిర్మించారు. దీనికి 7 లక్షల పని గంటలు పట్టింది. 2019లో మొదలైన నిర్మాణ పనులు ఐదేళ్లలో పూర్తయ్యాయి. ఆలయ నిర్మాణంలో పాల్గొన్న కార్మికుల్లో ఎక్కువ గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వారే. యూఏఈలో మరో 3 హిందూ ఆలయాలున్నాయి. అవన్నీ దుబాయిలోనే ఉన్నాయి. అబుధాబిలో నిర్మించిన ప్రస్తుత ఆలయం యూఏఈలోనే గాక మొత్తం గల్ఫ్ ప్రాంతంలోని ఆలయాలన్నింట్లోకి పెద్దది.

మా హృదయాల్ని గెలిచారు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ జయ్యద్ అల్ నహ్యాన్ ఇక్కడ నివసిస్తున్న భారతీయులేగాక, భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజల హృదయాలను గెల్చుకున్నారని కొనియాడారు. లేత గులాబీ రంగు ధోతీ, కుర్తా, కండువా ధరించిన మోదీ ఆలయ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన హారతి తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆలయాన్ని నిర్మించిన స్వామి నారాయణ్ సంస్థ ప్రముఖులు కూడా ఉన్నారు. అబుధాబి ఆలయంలో హారతి ఇచ్చిన సమయంలోనే.. స్వామి నారాయణ్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా నిర్మించిన 1200కుపైగా ఆలయాల్లో 'గ్లోబల్ హారతి' కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటైన సమావేశానికి యూఏఈ మంత్రి షేక్ నహ్యాన్, భిన్న మతవిశ్వాసాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ.. భిన్నత్వం తమ ప్రత్యేకత అని, భిన్నత్వంలో విద్వేషాన్ని తాము చూడబోమని.. ఈ ఆలయం కూడా భిన్నత్వానికి ఓ సమున్నత నిదర్శనమని చెప్పారు. ఇక మీదట యూఏఈ అంటే బుర్జ్ ఖలీఫా, ఫ్యూచర్ మ్యూజియం, షేక్ జయ్యద్ మసీదుతోపాటు ఈ ఆలయం కూడా గుర్తుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ మహాద్భుత ఆలయం సాకారం కావటంలో నా సోదరుడు షేక్ మహమ్మద్ జయ్యద్ అల్ నహ్యాన్ అందరికన్నా గొప్ప పాత్ర నిర్వర్తించారు' అంటూ యూఏఈ అధ్యక్షుడికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి మోదీ ప్రస్తావించారు. ఇది భారత్‌కు మాత్రమే అమృతకాలం కాదని, విశ్వాసానికి, సంస్కృతీ సంప్రదాయాలకు కూడా ఇది అమృతకాలమన్నారు.

ప్రజలపై ప్రభుత్వం ఒత్తిడి ఉండొద్దు

అంతకుముందు ప్రధాని మోదీ.. 'ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు'లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాలు ప్రజల జీవితాల్లో వీలైనంత తక్కువగా జోక్యం చేసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. 'ప్రభుత్వం లేదేమో అన్నట్లుగా ప్రజలు భావించే పరిస్థితి రావొద్దు.. అదే సమయంలో వారిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఒత్తిడి కూడా ఉండొద్దు' అని పేర్కొన్నారు. కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన.. ఇదే కొన్నేళ్లుగా తాను పాటిస్తున్న విధానమని చెప్పారు. అవినీతికి దూరంగా, అందరినీ కలుపుకొనిపోయే విధంగా ప్రభుత్వాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లలో భారత్‌లో ప్రభుత్వంపై ప్రజల నమ్మకం పెరిగిందని, ప్రజల ఆకాంక్షలకు తాము ప్రాధాన్యం ఇవ్వటం వల్లనే ఇది సాధ్యమైందని మోదీ చెప్పారు. 'ఇటీవలి కాలంలో భారత్‌లో గొప్ప మార్పులు సంభవించాయి. పారిశుద్ధ్యం, డిజిటల్ అక్షరాస్యత, బాలికావిద్య వంటి కార్యక్రమాలన్నీ ప్రజల భాగస్వామ్యం వల్లనే విజయవంతం అయ్యాయి. గుజరాత్ సీఎంగా, ప్రధానిగా గత 23 ఏళ్లుగా నేను ప్రభుత్వంలో ఉన్నా. గరిష్ఠ ప్రభుత్వం.. కనిష్ఠ పాలన అన్నదే నా సిద్ధాంతం' అని పేర్కొన్నారు. భారతీయ మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయటంపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దేశంలో 50 కోట్ల మంది ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించామని చెప్పారు. ఫిన్‌టెక్, డిజిటల్ చెల్లింపుల రంగాల్లో తమ ప్రభుత్వ కృషి వల్ల భారత్ అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు సాధించిందన్నారు. ప్రపంచం ఓవైపు ఆధునికతవైపు వెళ్తోంటే, మరోవైపు గత కాలపు సవాళ్లు తీవ్రతరమవుతున్నాయని.. టెక్నాలజీ సానుకూలంగానూ, ప్రతికూలంగానూ తీవ్ర ప్రభావం చూపుతోందని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పులు కొత్త సవాళ్లను విసురుతున్నాయని, అంతర్జాతీయ సమాజం ఒక్కతాటిపై లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సులువైన జీవనం, న్యాయం, రవాణా, ఆవిష్కరణలు, వాణిజ్యానికి అనుకూల పరిస్థితులను కల్పించే ప్రభుత్వాలను నేడు ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్యానికి, టెక్నాలజీకి కేంద్రబిందువుగా మారుతున్న దుబాయి యావత్ ప్రపంచానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తోందంటూ మోదీ ప్రశంసించారు.



అబుధాబిలోని స్వామి నారాయణ్ ఆలయ ప్రారంభోత్సవంలో మోదీ

ద్వైపాక్షిక భేటీలు

సదస్సు సందర్భంగా దుబాయి ప్రధానితో, మడగాస్కర్ అధ్యక్షుడితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 'భవిష్యత్తు ప్రభుత్వాలను తీర్చిదిద్దటం' అనే అంశంతో ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు జరిగింది. గల్ఫ్, పశ్చిమాసియా, ఆఫ్రికా, యురేసియా మార్కెట్లకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయటానికి భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పారిశ్రామిక రంగానికి అవకాశం కల్పించే భారత్‌మార్ట్‌కు మోదీ యూఏఈ ప్రధానితో కలిసి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దుబాయిలోని జెబెల్ అలీ ఫ్రీ ట్రేడ్ జోన్‌లో భారత్‌మార్ట్‌ను డీపీ వరల్డ్ అనే సంస్థ నిర్మించనుంది. మోదీ ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత యూఏఈకి తాజా పర్యటనతో కలిపి ఇప్పటి వరకూ ఏడుసార్లు వచ్చారు. గత 8 నెలల్లో ఇది మూడో పర్యటన.

రాజ్యసభకు సోనియా నామినేషన్

- రాజస్థాన్ నుంచి పోటీ.. కర్ణాటక నుంచి మాకెన్
- గుజరాత్ నుంచి నడ్డా.. మహారాష్ట్ర నుంచి చవాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగారు. బుధవారం రాజస్థాన్ అసెంబ్లీ భవనంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మాజీ సీఎం అశోక్ గహ్లోత్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యసభలో రాజస్థాన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురి పదవీ కాలం ఏప్రిల్‌లో ముగియనుండగా, అందులో ఒక స్థానాన్ని గెలిచే సంఖ్యా బలం కాంగ్రెస్‌కు ఉంది. ప్రస్తుతం రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభకు ఇవే తన చివరి ఎన్నికలని 2019 లోక్‌సభ ఎన్నికల్లో సోనియా ప్రకటించారు. దీంతో ఇమె ఇప్పుడు రాజ్యసభ బరిలో తొలిసారిగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఈసారి రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా, ప్రస్తుతం రాజ్యసభలో రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఇక తెలంగాణ నుంచి రేణుకా చౌదరి, యువజన కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ యాదవ్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి అభిషేక్ సింఘ్వీ రాజ్యసభకు పోటీ చేయనున్నారు. అలాగే, రాహుల్‌గాంధీకి అత్యంత ఆప్తుడు, ఢిల్లీకి చెందిన డాక్టర్ అజయ్ మాకెన్‌తోపాటు డాక్టర్ సయ్యద్ నసీర్ హుసేన్, జీసీ చంద్రశేఖర్ కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయనున్నారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. అలాగే, మంగళవారం కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు పోటీ చేయనున్నారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్ ఒడిసా నుంచి, ఎల్.మురుగన్ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలువనున్నారు. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను బీజేపీ బుధవారం విడుదల చేసింది. 56 రాజ్యసభ స్థానాలకు ఈనెల 27న ఎన్నికలు జరుగనున్నాయి.



నామినేషన్ పత్రాలను అందిస్తున్న సోనియా; చిత్రంలో రాహుల్, ప్రియాంక

బాసరకు భారీగా భక్తజనం



సరస్వతీ నమస్తుభ్యం.. నామస్మరణతో చదువుల తల్లి కొలువై ఉన్న నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం బుధవారం మార్మోగింది. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి పర్వదినాన తమ పిల్లలకు అక్షర శ్రీకారం జరిపించేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుండే అక్షర శ్రీకార పూజలను ప్రారంభించినా భక్తులు 4 నుంచి 8 గంటలు వేచి చూడాల్సి వచ్చింది. క్యూలైన్లలో భక్తులకు పాలు, బిస్కెట్లు స్థానికుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

\- బాసర



మేడారానికి రక్షాతోరణం

ఘనంగా మండమెలిగే పండుగ.. నేటి నుంచి మరింత పెరగనున్న భక్తుల రద్దీ

- 21 నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర

ములుగు/మేడారం, ఫిబ్రవరి 14: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మరో ప్రధాన ఘట్టానికి అంకురార్పణ జరిగింది. మండమెలిగే పండుగ బుధవారం ఘనంగా జరిగింది. మండమెలిగే పండుగలో భాగంగా వనదేవతల వడ్డెలు (పూజారులు) మేడారం గ్రామానికి రక్షా తోరణాలు కట్టారు. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, ఏటూరునాగారం మండలంలోని గోవిందరాజులు, కొత్తగూడ మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు పూజామందిరాల్లో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకలను నిర్వహించారు. సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయాలను పూజారులు, కుటుంబ సభ్యులు శుద్ధిచేసి అలుకు పూతలు, మామిడి తోరణాలతో అలంకరించారు. డోలు వాయిద్యాలతో గ్రామ, పొలిమేర దేవతల వద్దకు చేరుకుని జలాభిషేకాలు చేసి నూతన వస్త్రాలు సమర్పించారు. ఊరికి ఇరువైపులా రక్షా తోరణాలు కట్టారు. మామిడాకులు, నల్లకోడి, ఆనపకాయలు కట్టి ద్వారస్తంభాలు ఏర్పాటు చేశారు. దుష్టశక్తులు పొలిమేర దాటి లోపలికి ప్రవేశించకుండా కల్లు, మద్యం ఆరబోశారు. వనదేవతల గద్దెల వద్ద ప్రధాన పూజారులు జాగరణ చేశారు. 10 గంటల తర్వాత దర్శనాలను నిలిపేసి.. దేవతలకు యాటపోతులను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక, సరిగ్గా వారం రోజులకు ఈనెల 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకోవడంతో మహాజాతర ప్రారంభమవుతుంది.



మండమెలిగే పండుగ సందర్భంగా బొడ్రాయికి పూజలు చేస్తున్న పూజారులు

22న సమ్మక్క గద్దెకు రావడంతో మహాఘట్టం ఆవిష్కృతమవుతుంది. 23న మొక్కుల సమర్పణ, 24న దేవతలను వనప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుంది. నేటి నుంచి భక్తుల రద్దీ పెరగనుంది. బుధవారం 3 లక్షల మంది దేవతలను దర్శించుకున్నట్టు అధికారులు అంచనా వేశారు.

నేడు ఉత్సవ కమిటీ ప్రమాణం

మేడారం జాతర నిర్వహణ కోసం దేవాదాయ శాఖ 14 మంది సభ్యులతో తాత్కాలిక ఉత్సవ కమిటీని ఇటీవల ప్రకటించింది. గురువారం వారు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

లైంగికదాడి ఫిర్యాదు తీసుకోరా?

- జడ్జి కొడుకుపై ఫిర్యాదుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయరా?
- కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వోపై హైకోర్టు ఆగ్రహం
- 16న తమ ఎదుట హాజరుకావాలని ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): "లైంగిక దాడి జరిగిందని బాధితురాలు చేసే ఫిర్యాదును తీసుకోరా? ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి జడ్జి కొడుకు కావడం వల్ల ఎస్‌హెచ్‌వో అతణ్ని రక్షించడానికి ప్రయత్నిస్తున్నాడు" అని హైకోర్టు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించింది. ఈ నెల 16న కోర్టుకు హాజరు కావాలంటూ కరీంనగర్ టూటౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో)ను ఆదేశించింది. కరీంనగర్‌లో ఓ జిల్లా జడ్జి కుమారుడు కతడి వికాస్(34) తనపై లైంగిక దాడి చేశాడని పేర్కొంటూ.. జిల్లా కోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ.. ఇటీవల ఉద్యోగం కోల్పోయిన బాధితురాలు(29) దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. కోర్టు ఆదేశాలతో తాను ఈ నెల 13న టూటౌన్ ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు బాధితురాలు పేర్కొన్నారు. అయితే.. పోలీసులు ఆ రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఠాణా వద్ద వేచి ఉండేలా చేశారని వివరించారు. "లైంగిక దాడికి సంబంధించి జిల్లా కలెక్టర్‌కు, జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్చార్సీ)కి ఫిర్యాదు చేశాను. దాంతో నన్ను ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం నుంచి గత ఏడాది అక్టోబరు 6న తొలగించారు" అని కోర్టుకు చెప్పారు. ఎస్‌హెచ్‌వో తీరుపై ధర్మాసనం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "లైంగిక దాడి విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం 'లలితకుమారి' కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే" అంటూ ధ్వజమెత్తింది. ఈ నెల 16న తమ ఎదుట హాజరుకావాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిక్షేపంగా ఇంటికి...

ఖతార్‌లో మూడునెలల క్రితం మరణశిక్ష పడిన భారత నౌకాదళ మాజీ అధికారులు అనూహ్యంగా, చడీచప్పుడూ లేకుండా స్వదేశానికి క్షేమంగా తిరిగిరావడం ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించే పరిణామం. పెట్టిన కేసులు, అరెస్టులు, శిక్షలు ఇత్యాదివన్నీ ఎంత గోప్యంగా ఉన్నాయో, వారి రాకకూడా అదేవిధంగా జరిగిపోయింది. దోహ్రా టెక్నాలజీస్‌లో ఉద్యోగాలు చేసుకుంటూ, స్థానిక సైనిక సిబ్బందికి శిక్షణనిచ్చే పనిలో ఉన్న వీరు ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణతో 2022లో అరెస్టుకావడంతో వారు ప్రాణాలతో బయటపడతారా, కనీసం జైలుశిక్షకు పరిమితమైనా అవుతారా? అన్న అనుమానాలు అందరినీ వెంటాడాయి. న్యాయస్థానాల్లో పోరాటాలనుంచి, దౌత్యయత్నాల వరకూ ప్రతీ అడుగూ జాగ్రత్తగా వేస్తూ మృత్యుముఖంలోకి వెళ్ళిన వీరందరినీ నిక్షేపంగా ఒడ్డునపడేసిన మన ప్రభుత్వాన్ని కచ్చితంగా అభినందించాల్సిందే.

గూఢచర్యం ఆరోపణ కనుక వారికి మరణశిక్షపడింది, ఆ తరువాత రెండుదశల న్యాయపోరాటాలతో మరణశిక్ష తప్పి, చివరకు యావజ్జీవం మిగిలింది. అప్పీల్స్ కోర్టు శిక్షను మార్చింది తప్ప, నిర్దోషులని ప్రకటించలేదు. ఆ తరువాత ఏమైనా న్యాయప్రక్రియలు కొనసాగాయో లేదో తెలియదు కానీ, మరోపక్క వారి విడుదల కోసం సాగిస్తున్న దౌత్యయత్నాలు తీవ్రమైనాయి. బహుశా ఈ కేసు దృష్టితోనే గత ఏడాది అక్కడి భారత రాయబారిని కూడా మన ప్రభుత్వం మార్చివుంటుంది. వీరిని కాపాడుకోవడమే ఏకైక ఎజెండాగా ఏడాదికాలంగా భారత విదేశాంగశాఖ అదే పనిగా కృషిచేస్తుంటే, జాతీయ భద్రతాసలహాదారు తన పరిచయాలను, శక్తియుక్తులను వాడుతూంటే, డిసెంబరులో కాప్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఖతార్ అమీర్‌తో భేటీ అయిన ఘట్టం కూడా సాయపడి ఎట్టకేలకు వీరికి విముక్తి లభించింది. వారు దేశంలో కాలూనిన మర్నాడే ఖతార్‌లో భారత ప్రధాని పర్యటించబోతున్నట్టుగా మన విదేశాంగశాఖ ప్రకటన వెలువడింది. అరబ్ ఎమిరేట్స్ పర్యటన, ఆలయ ఆరంభం మాత్రమే అప్పటివరకూ ప్రధాని కార్యక్రమాల్లో ఉండగా, ఆఖరు నిముషంలో ఖతార్‌ను కూడా చేర్చి, ఆ దేశం ఎమీర్‌కు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలియచేయాలని మోదీ అనుకొని ఉండవచ్చు.

ఈ వ్యవహారంలో మన విదేశాంగశాఖ కృషి, మోదీ వ్యక్తిగతంగా చేసిన ప్రయత్నాలు విశేషమైనవి. ఖతార్‌తో దశాబ్దాలుగా ఉన్న ఆర్థిక, వ్యాపార బంధం తెలిసిందే. గతంలో మిగతా అరబ్‌దేశాలు దానిని బాయ్‌కాట్ చేసినప్పుడు కూడా భారతదేశం అండగా నిలబడింది. ఎనిమిదిలక్షల మంది భారతీయులు అక్కడ నిర్భయంగా పనిచేసుకుంటూ, స్వదేశానికి పెద్ద ఎత్తున డబ్బు పంపగలుగుతున్నారు. వేలాది భారతీయ కంపెనీలు అక్కడ పనిచేస్తున్నాయి. ఏటా పదహారు బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం సాగుతోంది. అప్పుడప్పుడు కొన్ని పొరపొచ్చాలు వచ్చినా, ఖతార్‌తో సంబంధాలు ఎన్నడూ ఘర్షణ పడాల్సిన స్థాయికి చేరలేదు. ఈ కారణంగానే, ఈ ఎనిమిది అధికారుల విషయంలో అన్యాయం జరిగిందని అనిపించినప్పటికీ అంతర్జాతీయ జోక్యాన్ని భారత్ కోరుకోలేదు, ఖతార్‌మీద మాటలతో విరుచుకుపడలేదు. పశ్చిమాసియాలోని ఈ విశ్వసనీయమైన మిత్రదేశంతో సున్నితంగా వ్యవహరిస్తూ అనుకున్నది అంతిమంగా సాధించింది. ఖతార్‌లోని అన్ని రంగాల్లోనూ భారతీయులు విస్తరించి ఉండటం, ముఖ్యంగా అక్కడి సైనికరంగంలో మనవారు అధికంగా ఉండటం పాకిస్థాన్ సహించలేకపోతున్నదని, మన అధికారులను గూఢచర్యం కేసులో ఇరికించడంలో దాని పాత్ర ఉండవచ్చునని కొందరి అనుమానం.

భారతదేశం దిగుమతిచేసుకొనే ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ)లో నలభైశాతం ఖతార్ నుంచే అందుతున్నది. 1999లో ఉభయదేశాల మధ్యా గ్యాస్ సరఫరాకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందం 2028తో ముగిసిపోతుంది. ఐదేళ్లముందుగానే ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాల్సి ఉండగా, ఆ గడువు కూడా గత ఏడాది డిసెంబరుతో పూర్తయింది. ఈ విషయంలో ఎంతో ముందునుంచే ఖతార్ మనవెంటపడుతోంది. ఎట్టకేలకు, వారంక్రితమే, 2048వరకూ అమలులో ఉండే 78 బిలియన్ డాలర్ల విలువైన అతిపెద్ద గ్యాస్ ఒప్పందం ఉభయదేశాల మధ్యా కుదిరిన నేపథ్యంలో, ఈ ఒప్పందానికీ అధికారుల విడుదలకూ మధ్య ఏమైనా సంబంధం ఉన్నదా? అన్న అనుమానాలు, చర్చలు జరగడం సహజం. తెరవెనుక వ్యవహారాలు తెలియడం కష్టం కానీ, మనవారు క్షేమంగా వెనక్కువచ్చినందుకు మాత్రం సంతోషించాల్సిందే.


అటు ఆ రాముడూ ఇటు ఆత్మారాముడూ

శ్రీరామచంద్రుడి ఆహారంలో ఏ ఏ పదార్థాలుండేవి అన్న చర్చ ఆ మధ్య జరిగింది. అదే విషయం మీద అదేదో సినిమాను ఒక ఓటీటీ వేదిక వెనక్కి తీసుకుంది కూడా. ఆ కాలంలో రాముడు తాను పుట్టిన దేశంలో వంశంలో కులంలో ఏమి ఆహారం తినే ఆనవాయితీ ఉండేదో అదే తిని ఉంటాడు. కావాలంటే, వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో చదువుకుని లేదా పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి విద్వాంసుడి అనువాదాలు చదువుకుని తెలుసుకుంటే సరిపోతుంది. శ్రీరాముడు దేవుని అవతారమే తప్ప తానే దేవుడు కాదు కదా? ధర్మానికి ఏదో గ్లాని కలిగిందని మానవజన్మ ఎత్తి భూలోకం మీదికి వచ్చాడు. మనిషి పుట్టుక ఎత్తినందుకు, ఆహారనిద్రలు కష్టసుఖాలు వివాహసంతానాలు అన్నీ తప్పవు. మనలాగే జీవించి, మనలాగే బాధలూ బాదరబందీలూ అనుభవించాడు కాబట్టి, రాముడు మనసుకు దగ్గరగా అనిపిస్తాడేమో? కించిత్ కష్టానికి కూడా రామా అనుకుంటాం, అపచారం జరిగితే హేరామ్ అంటాం. తెగదెంపులు చేసుకోవాలంటే రాంరాం అనేస్తాం. రాముడెంతగా మన సంస్కృతిలో భాగమయ్యాడంటే, ఎంత రంగనాయకమ్మ అయితే మాత్రం రామరామ అనుకోరా? అని శ్రీరమణ గారు చమత్కరించారు!

ఆకలేసినప్పుడు ఆత్మారాముడు అల్లాడిపోతున్నాడంటాము. అంటే మనలోపల ఉన్నది రాముడేనని అర్థం. ఆయనను పస్తు పెట్టకూడదు కదా? త్యాగరాజులూ రామదాసులు కూడా రాముడిని పాడుకుంటూ అన్నంలో కూడా రాముడిని చూసుకున్నారు కానీ, ఉపవాసాలు ఉండలేదు. తనకు మాలిన ధర్మం ఉండదన్నట్టే, దైవం కూడా ఉండదు. అన్నానికీ రాముడికీ మధ్య పోటీ రాకూడదు! ఆత్మారాముడికీ రాముడికీ పంతం వస్తే, రెండువైపులా రాములే కదా? ఎవరు గెలవాలి?

రాముడిని అడ్డం పెట్టుకుని ఈ ఏడాది ఎన్నికలను అమోఘంగా, అమేయంగా గెలిచేయాలని నరేంద్రమోదీ ఆయన పరివారం అనుకుంటున్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కలిగించిన భక్తిపారవశ్యాలు దేశప్రజలలో సజీవంగా ఉన్నాయని, పోలింగ్ దాకా పదిలంగా ఉంటాయని నమ్ముతున్నారు. శతాబ్దాల ఆరాటం ఫలించిన శుభ తరుణం అనీ, కూలిన ఆత్మాభిమాన కేతనం తిరిగి రెపరెపలాడుతోందని చెప్పుకుంటున్న మాటలు రాజకీయ ఎంపికను తిరుగులేకుండా ప్రభావితం చేస్తాయని ఆశిస్తున్నారు. వాళ్లు అనుకోవడమే కాదు, మీడియా కూడా అదే వాస్తవాన్ని మోదీ ఇంటి కోడై కూస్తోంది. జట్టు కట్టలేని బలహీనతతో తమంతట తామే ఓటమిభావనలోకి కుంగిపోతున్న ప్రతిపక్షం కూడా మూడోసారి మోదీ విజయాన్ని ముందస్తుగానే అంగీకరిస్తున్నట్టు కనిపిస్తున్నది. మోదీ బృందానికి ఇప్పుడు కావలసినది కేవల విజయం కాదు, ఘనాతి ఘన విజయం! దేన్నైనా తిరగరాయగల, దేన్నైనా నిర్వచించగల, వెయ్యేళ్ల భవితవ్యాన్ని శాసించగల తిరుగులేని విజయం!

మరి రాముడు అందుకు సహకరిస్తాడా? అంతగా సహకరిస్తాడా? తనకొక ఆలయం నిర్మించినందుకు కొంత ప్రసన్నత కలిగి ఉండవచ్చును కానీ, అంతకు మించిన విచక్షణ ఆ రామచంద్రప్రభువుకు ఉంటుంది కదా? ఎదుటి పక్షంలో రావణాసురుడు నిలబడి సవాల్ విసురుతుంటే, బహుశా, బాలరాముని కరుణాకటాక్షం మోదీపైనే ప్రసరించే అవకాశం ఉండవచ్చు. కానీ, అవతలి పక్షంలో అశేషప్రజానీకంలోని 'ఆత్మారాముడు' నిలబడితే, శ్రీరాముడికి పెద్ద సంకటమే వచ్చి పడుతుంది. ఇప్పుడటువంటి క్లిష్టపరిస్థితి ఏదో వచ్చిపడుతున్నట్టుంది. అసలుకే మోసం రాకపోయినా, 400 సంఖ్యచుట్టూ పెట్టుకున్న ఆశలకు గండి పడే ప్రమాదం కనిపిస్తోంది.



> రాముడు ఆలయాల్లోనే కాదు, అందరిలోనూ ఉన్నాడని ఆధ్యాత్మికవాదులే చెబుతుంటారు. చరాచర ప్రకృతిలో, సమస్త జీవరాశిలో దైవం ఉనికిని గుర్తించడమే గొప్ప తాత్వికత అని నమ్ముతారు. మనుగడ పోరాటం చేస్తూనే, దైవాన్ని ధ్యానించుకోవాలని తుకారాం, కబీర్ వంటి వారు బోధించారు. ప్రజలు తమ జీవనపోరాటం చేయవలసిందే, అధిక ధరల మీద, అవినీతి మీద, విద్వేష వాతావరణం మీద, నిరుద్యోగం మీద, ఆర్థిక అంతరాల మీద పోరాడవలసిందే. మరో మార్గం లేదు. తన నామాన్ని జపించుకుంటూ కర్తవ్యాన్ని విస్మరిస్తే రాముడు సంతోషించడని భక్తులకు తెలుసు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే లాభం లేదని పెద్దలే చెబుతారు. ఆత్మారాముడి ఆకలి తీర్చకపోతే, రాముడి ఆకలి మాత్రం ఎట్లా తీరుతుంది?



■ కె. శ్రీనివాస్

సందర్భం

కొంతమంది కేంద్రమంత్రులు ఆ మాట అననే అన్నారు. దేశప్రజలు రామ భక్తి తాదాత్మ్యంలో ఓలలాడుతుంటే, వారి దృష్టి మళ్లించడానికి ప్రతిపక్షం ఏవేవో వివాదాలు తెస్తోందని. ఉత్తరం-దక్షిణం తగాదా గురించి ఆ మాట వచ్చింది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రాలు ఇచ్చే పన్ను ఆదాయం, రాష్ట్రాలకు దక్కే కేంద్ర కేటాయింపుల గురించిన ప్రస్తావన వచ్చింది. 'ఇట్లాగైతే కష్టం మరి, దక్షిణాది వాళ్లం ఆలోచించుకోవలసి వస్తుంది' అని కర్ణాటక కు చెందిన ఒక నాయకుడు అన్నాడు. తరువాత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏకంగా ఢిల్లీలో ధర్నా చేశాడు. ఆయనకు కేరళ నుంచి, తమిళనాడు నుంచి మద్దతు వచ్చింది. ఇండియా కూటమిలోని ముఖ్యమంత్రులందరూ ఢిల్లీకి వెళ్లడమో, మద్దతు చెప్పడమో చేశారు. 400 గమ్యం చేరాలంటే దక్షిణ దిక్కున కూడా కొన్ని విజయాలు కావాలి. ఈ వివాదం వాతావరణాన్ని దారి మళ్లిస్తోందని బీజేపీకి అనిపించింది. అనిపిస్తే, దాన్ని విస్మరించి అప్రధానం చేయాలి కదా, లేదు, ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి దీనికి జవాబు ఇచ్చే క్రమంలో మరింత ప్రాధాన్యం సమకూర్చారు!

ఈ ఉత్తర, దక్షిణ చర్చ ఏదో సాధిస్తుందని కాదు కానీ, రామాలయ వాతావరణంలో కూడా దక్షిణాది ఎడంగా, పెడగా ఉండడమే మోదీ ప్రభుత్వానికి జీర్ణం కావడం లేదు. దేశంలో ఈ వైవిధ్యం ఏమిటి? ఇంకా ప్రశ్నలు మిగిలి ఉండడమేమిటి? కేంద్రాన్ని పట్టుకుని లెక్కలూ పత్రాలూ అడగడమేమిటి? ఈ పరిస్థితి కొనసాగకూడదని ఉన్నది కానీ, 400 లక్ష్యం చేరితే తప్పితే ఇటువంటి 'అరాచకాలు' సరిదిద్దడం కూడా సాధ్యం కాదు మరి!

బడ్జెట్ సమావేశాలు కాగానే, అవసరమైన రాచకార్యాలూ తీసుకోవలసిన కీలకనిర్ణయాలూ తీసుకుని ఎన్నికల షెడ్యూలు ప్రకటించవచ్చుననుకుంటే, ఇప్పుడీ ఢిల్లీ ముట్టడి ముప్పు వచ్చి పడింది. ఈ వారం పదిరోజుల్లో ఎన్నికల తేదీల ప్రకటన వచ్చాక, రాజకీయ ప్రచార కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, ఆధ్యాత్మిక కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, విడివిడిగా రంగంలోకి దిగుతాయి. శోభాయాత్రల సందడి ఎన్నికల హడావిడికి సమీపంగా ఉంటే బాగుంటుందన్న ఆకాంక్షలూ ఉంటాయి. భక్తి వాతావరణం నుంచి రాజకీయ లాభం పిండుకోవాలని ఆశిస్తుంటే, ఏమిటి ఈ పంజాబ్ హర్యానా రైతులు మద్దతు ధర అంటూ వార్తావరణాన్ని అంతటినీ ఆక్రమిస్తున్నారు?

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చడమే అంటూ మార్కెట్ వాదులు సిద్ధాంతాలు చేస్తున్నారు. ఆ డిమాండ్ ఆమోదించే ప్రసక్తే లేదని కేంద్రప్రభుత్వం తేల్చిచెప్పింది. కానీ, వ్యవసాయోత్పత్తుల ధరలు ఏ ప్రాతిపదికన నిర్ణయించాలో సిఫారసు చేసిన స్వామినాథన్‌కు, మద్దతు ధర కోసం ఉద్యమించి స్వయంగా రైతు నాయకుడైన చరణ్ సింగ్‌కు ఈ ప్రభుత్వమే భారతరత్న ప్రకటించింది! ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడమెలాగో తెలియడమే కాదు, దీర్ఘకాలం నిర్బంధాన్ని సహించగలిగిన సత్తా కూడా కలిగిన రైతాంగం ఇప్పుడు దేశరాజధానిలో మోహరించింది. వారు ఎంతవరకు విజయం సాధిస్తారో తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మోదీ పరివారం కోరుకున్న ఉద్వేగాల వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు.

పరిస్థితి చేతిలో లేకుండా పోయిందని, జనహృదయాలను ఆవరించడంలో మోదీ విజయవంతమయ్యారని బాధపడడం మానేసి, ప్రతిపక్షాలు ప్రజల వాస్తవ సమస్యలను మళ్లీ రంగం మీదికి తేవడానికి తమవంతు ప్రయత్నం చేయడం మంచిది. మహాబలశాలి అయిన ప్రత్యర్థిని నిలువరించడానికి చిన్నదో పెద్దదో ఏదో చేయలేకపోతే, పిల్లిలో ఎలుక ఐక్యం అయిపోయినట్టు, అధికారప్రవంతిలో కలిసిపోవడం మంచిది. ప్రజల ధ్యాసను తమవైపే నిలుపుకోవడానికి వివిధ పక్షాలు ప్రయత్నించడం

> ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడమెలాగో తెలియడమే కాదు, దీర్ఘకాలం నిర్బంధాన్ని సహించగలిగిన సత్తా కూడా కలిగిన రైతాంగం ఇప్పుడు దేశ రాజధానిలో మోహరించింది. వారు ఎంతవరకు విజయం సాధిస్తారో తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మోదీ పరివారం కోరుకున్న ఉద్వేగాల వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు.


సహజం. అన్నిరకాల శక్తియుక్తులూ హంగులూ కలిగిన పక్షం, ఆ ప్రయత్నం విజయవంతంగాను, విస్తృతంగానూ చేయగలదు. అలాగని, ప్రజలు ఎప్పుడూ తమ ఆలోచనల మీద, మనోభావాల మీద అదుపు లేకుండా ఉంటారని అనుకోవడం కూడా పొరపాటు. అతి పెద్ద కృత్రిమ సంరంభం నుంచి కూడా ఆకులు అల్లాడిన సవ్వడి వైపు వారు దృష్టి మళ్లించుకోగలరు. కాకపోతే, అందుకు మానవప్రయత్నం కావాలి. దేవుడిని తమ పార్టీలో చేర్చుకున్నామని గర్విస్తున్నవాళ్లు కూడా, చేసింది మానవప్రయత్నమే.

రాముడు ఆలయాల్లోనే కాదు, అందరిలోనూ ఉన్నాడని ఆధ్యాత్మికవాదులే చెబుతుంటారు. చరాచర ప్రకృతిలో, సమస్త జీవరాశిలో దైవం ఉనికిని గుర్తించడమే గొప్ప తాత్వికత అని నమ్ముతారు. మనుగడ పోరాటం చేస్తూనే, దైవాన్ని ధ్యానించుకోవాలని తుకారాం, కబీర్ వంటి వారు బోధించారు. ప్రజలు తమ జీవనపోరాటం చేయవలసిందే, అధిక ధరల మీద, అవినీతి మీద, విద్వేష వాతావరణం మీద, నిరుద్యోగం మీద, ఆర్థిక అంతరాల మీద పోరాడవలసిందే. మరో మార్గం లేదు. తన నామాన్ని జపించుకుంటూ కర్తవ్యాన్ని విస్మరిస్తే రాముడు సంతోషించడని భక్తులకు తెలుసు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే లాభం లేదని పెద్దలే చెబుతారు. ఆత్మారాముడి ఆకలి తీర్చకపోతే, రాముడి ఆకలి మాత్రం ఎట్లా తీరుతుంది?

ఎవరి లబ్ధికోసం కులగణనపై దుష్ప్రచారం?

కులం అనేది పాశ్చాత్యుల సృష్టి అనే అభిప్రాయం ఈ మధ్య ప్రచారంలోకి వస్తున్నది. క్రైస్తవ మిషనరీలు, వలస పాలకులు భారతదేశాన్ని కులం అనే పట్టకం ద్వారా చూడాలని ప్రయత్నించారని, అలా దేశంలో కులం ప్రాముఖ్యతను సంతరించుకోవడానికి దోహదం చేశారని ఈ ప్రచారం చేసేవారి వాదన. మరి కులం దేశీయమైనది, స్థానికమైనది కాకపోతే, అది కేవలం పాశ్చాత్య వక్ర బుద్ధిపరుల దిగుమతి మాత్రమే అయితే, మన భక్తి ఉద్యమ కాలంలో తాత్త్విక చింతనాపరులైన బసవేశ్వరుడు, గురు నానక్, యోగి వేమన, సంత్ కబీర్ దాస్, రవి దాస్, ధరం దాస్, సుందర్ దాస్ వంటి వారి బోధనల్లో, చర్యల్లో కులం ఎందుకు కీలక స్థానంలో ఉంది? ఈ చింతనాపరులు ఎవ్వరూ పాశ్చాత్య ప్రభావంలో లేరు. వీరు కుల నిర్మూలనతో మాత్రమే సాధ్యమయ్యే మానవీయ సమాజాన్ని, కులాతీత ఆధ్యాత్మిక జ్ఞానోదయం పొందే జీవనాన్ని గురించిన జ్ఞానాన్ని అందించారు. కులం వీరి ఊహా శక్తి ద్వారానో, లేదా వారిపై గల పాశ్చాత్య వికృత ప్రభావంతోనో ఉత్పన్నమైనదని చెప్పటం పరిహాసాస్పదమే!

అయితే మన సామాజిక, రాజకీయ ఆలోచనల్లోనూ, జీవితంలోనూ బ్రిటీష్ వలస విధానాల ప్రభావం కొంతవరకు ఉంది అన్నది వాస్తవం. ఉదాహరణకు జనాభా గణన వంటి పాలన సాధనాల ద్వారా వలస పాలకులు కులాలకు సంఖ్యాత్మక పరిమాణాన్ని అందించారు. అది లేకున్నట్టయితే కులం అస్పష్టంగా, స్థానికంగా విడగొట్టబడి ఉండేది. ఈ గణనతో కులం కొత్త అవతారాన్ని, గతిశీలతను పొందింది. అంతే కానీ, కులం కుట్రపూరిత పాశ్చాత్య లేదా పాశ్చాత్య దేశాల ఎగుమతి చేయబడినదిగా భావించడం భావ దారిద్ర్యానికి ఒక చిహ్నం. ఇది మనువు ఒక్కడే కులాన్ని సృష్టించాడు అనే కల్పన లాంటిది! కులం ఆధునిక యుగం పూర్వపు దేశీయ చారిత్రక వాస్తవికత నుంచి వలస పాలన కాలం మీదుగా ఆకృతిని, గతిని పొందుతూ వస్తున్నది.



> సమాచారం శక్తిగా మారిన నేటి సమకాలీన సమాజంలో కుల సమాచారంపై కొందరికే నియంత్రణ ఉండడం ప్రమాదం. సమగ్ర అధికారిక కుల గణన దేశ, రాష్ట్రాల విధానాల రూపకల్పనలో పారదర్శకతను నెలకొల్పుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా వాస్తవికమైన, ప్రజాస్వామికమైన నిర్ణయాలు తీసుకోవటాన్ని సుసాధ్యం చేస్తుంది.

భారతీయ సమాజం, దాని ఉత్పత్తి వ్యవస్థ నిర్దిష్టతగా కులాన్ని పరిగణించడం కేవలం మార్క్సిస్ట్ పాండిత్యానికే పరిమితం కాదు. కుల వ్యవస్థలోని అంతర్గత మార్పులు, పరిణామాలు, ఉత్పాదక సంబంధ అంశాలను దృష్టిలోకి తెచ్చిన అనుభవపూర్వక వివరణలు, సిద్ధాంత పరంగా విస్తృతమైన, విభిన్నమైన అధునాతన పాండిత్యం ఎన్నో వైపుల నుంచి సమకూరింది. ఈ పాండిత్యం అన్ని రకాల దృక్పథాలలో- పరిణామ వాదం, సంఘర్షణ సిద్ధాంతాలు (conflict studies), నిర్మాణ వాదం (structuralism), కార్యాచరణ వాదం (functionalism), క్రియాత్మక వాదం (phenomenology), గాంధేయ వాదం, లోహియా వాదం, మరీ స్పష్టంగా అంబేద్కర్ వాదాలలో ఆవరించి ఉన్నందున, దీనిని కేవలం మార్క్సిస్ట్ సిద్ధాంతంలో భాగంగానే ఊహించి ఆ ముద్ర వేయడం అవగాహనా రాహిత్యమే.

కులం భారతీయ సామాజిక చరిత్రలో భాగం అని, ఆర్థిక, విద్య సాంస్కృతిక రంగాల్లో, ముఖ్యంగా రాజకీయాలు, ఇతర రంగాలలో సర్వవ్యాప్త ఉనికిని, ప్రభావాన్ని కలిగి ఉన్నదని అందరికీ తెలుసు. అలాంటప్పుడు కుల గణన అందించే బహుముఖమైన, విస్తృతమైన, క్రమబద్ధమైన సమాచారం పట్ల ఎందుకంత వ్యతిరేకత? కుల గణన ద్వారా వెల్లడయ్యే సమాచారం, దాని వ్యాప్తి ద్వారా దేశ సమగ్రతకు ముప్పు ఉన్నదనే తప్పుడు వాదనలు ఎందుకు సృష్టిస్తున్నారు?

రాజ్యాంగ నిబంధనలు, రాజకీయాల అవసరాల కారణంగా కొంత మార్పు వచ్చినప్పటికీ, భారతదేశంలో ఇంకా కులం ఒక హక్కుల, అర్హతల నిర్మాణంగా కొనసాగుతూ వస్తున్నది. మన పరిపాలన, రాజకీయ వ్యవస్థలను గమనిస్తే ఇప్పటికీ ఇవి కొన్ని సవర్ణ కులాలతో గాఢంగా అలుముకుని ఉన్నాయి. వ్యాపార రంగంలో కూడా కొన్ని కులాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. ఇక మన విద్యా వ్యవస్థల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. రిజర్వేషన్ల సదుపాయం ఉన్నప్పటికీ మన సంస్థాగత వ్యవస్థ కులతత్వంలో మగ్గుతున్నది. ఈ సంస్థలలో కింది కులాల అణచివేత కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు, రాజకీయాలు, నిర్దిష్ట ప్రాంతాలలో ఆధిపత్య వ్యవసాయ కులాల ఆధ్వర్యంలోనే ఉన్నాయి.

మన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, రాజకీయ ప్రచార వ్యూహాలు అన్నీ కులాల ఆధారంగా చేస్తున్నారనే వాస్తవాన్ని గుర్తించకపోవడం ఆత్మవంచన. స్థానిక, వివరణాత్మక సమాచారం లేకుండా ఇదంతా సాధ్యమా? రాజకీయ, ఆర్థిక లాభాల కోసం అధికారిక వనరుల సాయంతో స్థానికంగా సేకరించబడిన కులాల అనధికారిక సమాచారం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల దగ్గర, వివిధ ప్రైవేటు సంస్థల దగ్గర ఉన్నది. ప్రతి ఎన్నికల సందర్భంలోనూ సర్వేల ద్వారా ఇది మళ్ళీ మళ్ళీ నిరూపణ అవుతున్నది. అయినా, కులాల గణాంక సమాచారం ఎవరి దగ్గరా లేదు అనటం కపట నాటకమే! సమగ్ర అధికారిక కుల గణన దేశ, రాష్ట్రాల విధానాల రూపకల్పనలో పారదర్శకతను నెలకొల్పుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా వాస్తవికమైన, ప్రజాస్వామికమైన నిర్ణయాలు తీసుకోవటాన్ని సుసాధ్యం చేస్తుంది.

సమాచారం శక్తిగా మారిన నేటి సమకాలీన సమాజంలో కుల సమాచారంపై కొందరికే నియంత్రణ ఉండడం ప్రమాదం. దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు, అన్యాయాలకు కుల గణన ఒక అడ్డుకట్ట వేయగలదు. కుల గణన అధికార వ్యవస్థ ముందు చట్టబద్ధమైన, హేతుబద్ధమైన, డేటా ఆధారిత సవాళ్లను ఉంచుతుంది.

కుల గణన కుల విభజనకు దారి తీస్తుందని, జాతి సంఘీభావానికి గొడ్డలిపెట్టు అని వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి. ఆచరణలో కుల గణన సమాచారం కుల వ్యవస్థను బలహీనపరచగలదు. కులం పునాదులపై జాతిని నిర్మించలేమన్న బాబా సాహెబ్ అంబేద్కర్ హెచ్చరికను గుర్తుంచుకోండి. జాతీయ గౌరవం, జాతీయ సమగ్రత కుల నిర్మూలనతోనే సాధ్యం. ఇంత ముఖ్యమైన కుల గణనకు, అది తెరిచే సవాళ్ల వరద గేట్లకు బెదురుతున్నది ఎవరు? ఎందుకు? దీని జవాబు కోసం గొప్ప మేధో మథనం అవసరం లేదు. సమాధానం సుస్పష్టమే!

• శ్రీనివాసులు కర్లి
• చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

అతడి పేదరికాన్ని పెంచిన పద్మశ్రీ!

ఈ మధ్యన దేశవ్యాప్తంగా గుర్తింపునకు నోచుకోని ఎందరో బడుగులకి పద్మ పురస్కారం దక్కింది. ఆ మేరకు సంతోషమే. పద్మ పురస్కారాలు వచ్చిన వారిలో అత్యంత పేదవారు ఉన్నారని గ్రహించడం అవసరం. బతకడానికి వారికి కాస్తంతైనా ఆర్థిక సహాయం అవసరం. పద్మ పురస్కారాలు గుర్తింపు మాత్రమే. వాటిని అందుకున్న దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, కిన్నెర మొగిలయ్య, సకిన రామచంద్రం వంటి వారు పేదరికంలోనే ఉండాల్సి వస్తోంది. వాళ్ళు మళ్ళీ తమ సంగీత వాద్యాలను, కళను భుజాన వేసుకుని వెళ్లాల్సిందేనా? గత దశాబ్దం నుండి కొంత మంది పద్మశ్రీ అవార్డు పొందిన పేద కళాకారులకు ప్రోగ్రాంలు ఇవ్వలేదు. పురస్కారం అందుకున్న తరువాతనైనా కళాకారులుగా వారి కళకు తగిన స్థానం కల్పించలేదు. దాసరి కొండప్ప, సకిన రామచంద్రం వంటి వారిని పక్కన ఉంచేశారు. ఏనాడూ పిలిచి ఒక్క ప్రోగ్రాం కూడా ఏర్పాటు చేయలేదు. రవీంద్రభారతిలో తమ ప్రోగ్రాం ఉండాలనే వారి కోరిక తీరలేదు. దేశ అత్యున్నత పురస్కారం పొందాక కొంతమంది మరింత అన్యాయం అయిపోతున్నారు.



2022లో పేద కళాకారులైన కిన్నెర మొగిలయ్య, ఆదివాసీ సకిన రామచంద్రం (డోలీ కళాకారుడు) వంటి వారికి ఒక పద్ధతి ప్రకారం, ఒకే తీరుగా గౌరవం దక్కలేదు. వీరికి పద్మశ్రీ వచ్చినవెంటనే, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెరో కోటి రూపాయల పారితోషికం, ఇంటిస్థలం ప్రకటించింది. మొగిలయ్యకు వెంటనే కోటి రూపాయల చెక్కు అందించారు. హైదరాబాదులో ఇంటి స్థలం హామీ నేటివరకు అది నెరవేరలేదు. సకిన రామచంద్రంకు కోటి రూపాయలు ఇంకా ఇవ్వలేదు. రెండేళ్ల నుండి అతను మరింత పేద స్థితికి దిగజారాడు. పద్మశ్రీ పురస్కార గ్రహీత కావడంతో ఊరూరు తిరిగి చావులు, కోయ వేల్పుల పండగలు చేయడమూ సాధ్యం కాలేదు. ఈ రెండేళ్ల నుండి డబ్బులు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తూ ఆరోగ్యం పాడయింది. ఇప్పుడు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌కి వచ్చి ఆస్పత్రిలో చేరి అప్పులు చేసి దవాఖాన బిల్లులు కడుతున్నాడు. సాటి కళాకారుడికి కోటి రూపాయలు అంది, తనకు ఇంకా అందలేదన్న వ్యథ అతడిని నిరంతరం వేధిస్తున్నది. రెండేళ్ల నుండి అతని కుటుంబ సభ్యులు ప్రభుత్వ సహకారం అందుతుందని చకోర పక్షుల్లా వేచి చూస్తున్నారు. రామచంద్రానికి కళాకారుని పింఛన్ లేదు. కాని వృద్ధాప్య పింఛన్ నెలనెల అందుతోంది. ఆ రెండువేల రూపాయలే అతని కుటుంబానికి ఆసరా.

పద్మశ్రీ రాగానే ఐటీడీఏ భద్రాచలం వారు 'గిరిజన నృత్య పాఠశాల' ఏర్పాటు చేస్తున్నాం. అందులో మీరు నృత్య ఉపాధ్యాయునిగా చేరండి, నెలకు ఇరవై వేల రూపాయలు ఇస్తామని ఇతనికి ఓ నియామక లేఖ అందించారు. కాని రెండేళ్ల నుంచి ఆ ఊసే ఎత్తడం లేదు. స్కూలు ఏర్పాటుకి ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు. గత గిరిజనశాఖ సెక్రెటరీ దగ్గరకు వెళ్లి ప్రాధేయపడితే సాంస్కృతికశాఖ అధికారులకి ఫోన్ చేసి చేతులు దులుపుకున్నారు.

గోండి గుసాడి కళాకారుడు కనకరాజుకి, మొగిలయ్యకి కళాకారుల పింఛన్ పదివేల రూపాయలు దొరుకుతున్నాయి. ఆ పింఛన్ రామచంద్రంకి అందడంలేదు. అతి తీవ్రమైన వ్యాధితో అతడు ఎన్నాళ్లు బతుకుతాడో తెలియదు. కీమోథెరపి వంటి చికిత్సలు జరుగుతున్నాయి. ఈ మధ్య నాలుగు లక్షలు వడ్డీకి తెచ్చి ఆస్పత్రి ఖర్చులు చెల్లించారు. పద్మశ్రీ పురస్కారం కొందరికి అవధులు లేని ఆనందాన్ని తెస్తుంది. హోదా పెంచుతుంది. ఇలాంటి వారికి లేని గోసలు తెచ్చిపెడుతుంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు సకిన రామచంద్రం పడుతున్న బాధలు మరెవరికీ పట్టకూడదు. అందరినీ సమానంగా చూసే దృష్టి కొరవడిన గత పాలకులు రామచంద్రానికి ఎన్ని క్షమాపణలు చెప్పినా తక్కువే. ముఖ్యంగా సాంస్కృతిక శాఖ సంచాలకుల అవగాహనారాహిత్యానికి ఇదొక మచ్చుతునక.

కొత్త ప్రభుత్వం ఈ తప్పిదాలను సరిదిద్దాలి. వెంటనే రామచంద్రానికి కోటిరూపాయలు అందేట్టు చేయాలి. కొత్తగూడెంలో ఇచ్చిన ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి అది అవసరం. అలాగే, కళాకారుల పెన్షన్ కూడా ప్రకటించాలి. రెండేళ్ల నుండి జాప్యం జరుగుతున్న చెక్కుని వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించి ముఖ్యమంత్రిగారు తన విశాల హృదయాన్ని చాటుకోవాలి. గొప్ప కళాకారుడు గద్దర్‌కి అపాయింట్‌మెంట్ ఇవ్వని అప్పటి ముఖ్యమంత్రికన్నా తాను కళాభిమానినని, బడుగువర్గాల సాంస్కృతిక రంగానికి అండగా ఉంటాననే సంకేతాన్ని ఇవ్వాలి.

○ జయధీర్ తిరుమలరావు

కాపీ నివేదికలతో కాలుష్యం దాగుతుందా?

దుబాయిలో జరిగిన కాప్ 28 సదస్సులో శిలాజ ఇంధనాలకు ముగింపు పలకాలని ద్వీప దేశాలూ, బడుగు దేశాలూ చేసిన డిమాండుకు ప్రతిగా దశలవారీగా స్వచ్ఛందంగా మారాలని తీర్మానం చేశారు. వాతావరణ సంక్షోభం పెరుగుతున్న కొద్దీ బొగ్గుకీ, చమురుకీ ముగింపు పలకాలన్న డిమాండ్ బలపడుతున్నది. ఈ దశాబ్దంలోనే అంతర్జాతీయ నిర్ణయం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రభుత్వం సమగ్ర దృష్టి పెట్టాలి. పారిస్ ఒప్పందం జరిగిన తరువాత తెలంగాణలో ప్రతిపాదించిన దాదాపు 9 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏటా 4.6 కోట్ల టన్నులు పైగా కార్బన్‌డయాక్సైడ్ వెలువరిస్తాయి. శాస్త్రీయ అంచనాల ప్రకారం ప్రతి ఏడాదీ కర్బన ఉద్గారాలు కలిగించే ఆర్థిక నష్టం, సామాజిక భారం రూ.70,937 కోట్లు. ఒక్క యాదాద్రిదే రూ.31,527కోట్లు. అంటే ప్రతి యూనిట్ విద్యుత్ ఉత్పత్తిలోనూ గుప్త భారం రూ.11. కంపెనీ లెక్కలలో వీటికి చోటుండదు.

బొగ్గు భూగ్రహంపై నాగరికతకూ, సర్వ జీవరాశికీ ఏకైక గొప్ప ముప్పు అంటారు ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త జేమ్స్ హాన్సెన్. యాదాద్రి థర్మల్ కేంద్రం ప్రతిపాదన దశ నుంచి ప్రమాణాలు పాటించలేదు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రతిపాదనలో లోపాలు చూపడం నేరంగా భావించి మాట్లాడారు ప్రాజెక్టు అధికారులు. మానవ హక్కుల వేదికను నిందించారు. కాపీ కొట్టిన పర్యావరణ ప్రభావ అంచనా సమర్పించారు. ఎక్కడెక్కడ కాపీ కొట్టారో వివరాలన్నీ నిపుణుల కమిటీకి సమర్పించడంతో నివేదిక రద్దయింది. ప్రజాభిప్రాయ సేకరణ భౌతికంగా కాక ఆన్‌లైన్‌లో రాతపూర్వకంగా ఇచ్చేలా మార్చించారు. రెండో నివేదిక మొదటి దాని కంటే ఎక్కువ కాపీ కొట్టారు. అది పరిశీలించడానికి వీలు కాకుండా పేజీలను వెతకడానికి వీలు లేని బొమ్మలుగా చేసి నివేదిక ఇచ్చారు. ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. దానిని పదాలు వెతకగలిగేలా టెక్నాలజీ సాయంతో మార్చుకుని ఎక్కడెక్కడ కాపీ కొట్టారో గుర్తించి రిపోర్టు సమర్పించినా, తప్పులెన్ని చూపినా పర్యావరణ అనుమతి ఇచ్చారు. ఒక పర్యావరణ సంస్థ జరిగిన నియమ ఉల్లంఘనలను చూపుతూ ఎన్‌జీటీని ఆశ్రయించింది. ప్రధానంగా 2095.28 ఎకరాల అటవీ భూమి ప్లాంటు నిర్మాణానికి వాడారు. అందుకు పరిహారంగా రూ.118.46 కోట్లూ, పరిహార వనానికి రూ.80.13 కోట్లూ చెల్లించి చేతులు దులుపుకున్నారు. పరిహారానికి కేటాయించింది డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ముంపు భూమి. వాదోప వాదాల తరువాత ఎన్‌జీటీ పర్యావరణ అనుమతిని రద్దు చేసింది. అందువల్ల మళ్ళీ ఫిబ్రవరి 20 నాడు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటించారు.

మూడవ పర్యావరణ ప్రభావ అంచనా మళ్ళీ రెండవ నివేదిక చేసిన సలహాదారుకే ఇచ్చారు. ముందు దానిని చదవడానికి వీలుగాని (అక్షరాలు స్పష్టత లేని) నాణ్యతతో కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో పెట్టారు. ఫిర్యాదు చేసిన రెండు వారాలకు నివేదికను మూడు భాగాలు చేసి చదవగల నాణ్యతతో పెట్టారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచిన వారిని నిరుత్సాహపరచడమే లక్ష్యంగా కనిపిస్తుంది. అది 829 పేజీల నివేదిక. అనుబంధాలను తొలగించి సలహాదారు రాసిన 11 చాప్టర్లు (276 పేజీలు)

> బొగ్గు భూగ్రహంపై నాగరికతకూ, సర్వ జీవరాశికీ ఏకైక గొప్ప ముప్పు అంటారు ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త జేమ్స్ హాన్సెన్. యాదాద్రి థర్మల్ కేంద్రం ప్రతిపాదన దశ నుంచి ప్రమాణాలు పాటించలేదు. మూడవ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను పరిశీలిస్తే అందులో 35 శాతం కాపీ కొట్టినది. ప్లాంటు విడుదల చేసే కోటి టన్నుల కార్బన్‌డయాక్సైడ్ భూతాప ప్రమాదం గురించి మాట లేదు.



పరిశీలిస్తే అందులో 35 శాతం కాపీ కొట్టినదిగా బయటపడింది. నిజాయితీ లేదు. ప్లాంటు విడుదల చేసే కోటి టన్నుల కార్బన్ డయాక్సైడ్ భూతాప ప్రమాదం గురించి మాట లేదు. వ్యవసాయ దిగుబడులూ, ప్రజారోగ్యాలకు జరిగే నష్టంపై వేల అధ్యయనాలున్నా విస్మరించారు. ప్రజల సొమ్ముతో నడిచే ప్రభుత్వరంగ సంస్థ ప్రజలకు నిజం చెప్పాలన్న కనీస బాధ్యత కనపడదు. ఏమి రాసినా చెల్లుతుందనే అహంకారం. నివేదిక రాసిన సలహాదారుని అనైతిక ప్రవర్తన కారణంగా పర్యావరణ మంత్రిత్వ శాఖ ఏడాది పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాల నివేదికలు తయారు చేసే అర్హత తొలగించింది. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నివేదికపై విమర్శ రాసినందుకు మమ్ములను స్వార్థ ప్రయోజనాభిలాషులుగా చిత్రించిన జెన్‌కో అధికారులు కనీస వృత్తి ప్రమాణాలు పాటించలేదు. పెద్ద పెట్టుబడితో ప్రతిపాదించిన అతి పెద్ద విద్యుత్ కేంద్రం అమలులో తగిన శ్రద్ధ లోపించినందు వల్లనే మూడుసార్లు ప్రజాభిప్రాయ సేకరణ జరపవలసి వచ్చింది. అయినా అదే నిర్లక్ష్యం. పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలు లోప భూయిష్టంగా వున్నాయి. ప్రజల సొమ్ముతో నడిచే ప్రభుత్వ రంగ సంస్థయినా, 30 సంవత్సరాల క్రితం అభివృద్ధిలో ప్రజల పాత్ర ఆవశ్యకమని చేసిన రియో ఒప్పందం స్ఫూర్తిని అవమానపరచే విధంగా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రతి చర్యలోనూ ప్రజల పట్ల న్యూనతా భావం చూపారు. పర్యావరణ అనుమతి పొంది ఆరేళ్ళు దాటినా ఇంతవరకూ భూ నిర్వాసితులెవరికీ ఉద్యోగాలివ్వలేదు.

ప్రాజెక్టుతో ప్రజలకు జరిగే నష్టాలు పూర్తిగా దాచేశారు. థర్మల్ విద్యుత్ కాలుష్యంతో వ్యవసాయానికి జరిగే నష్టంపై విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. అమెరికా వ్యవసాయ శాఖ పెరిగే ఓజోను కాలుష్యంతో పంటల దిగుబడి తగ్గుదల సమాచారాన్ని సమీకరణ బద్ధం చేసింది. ఓజోన్ మోతాదుతో ఏ పంట దిగుబడి ఎంత తగ్గుతుందో సులువుగా లెక్కకట్టవచ్చు. రాయచూరు థర్మల్ కేంద్రం పరిసరాలలో వరి 34.5 శాతం, పత్తి 35.16 శాతం, జొన్న 50 శాతం దిగుబడి తగ్గినట్లు బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నమోదు చేసింది. పండ్ల తోటలకు జరిగే నష్టం ఇంకా ఎక్కువ. పక్క మహారాష్ట్రలో ఉదాహరణలున్నాయి. ప్రజారోగ్యానికి జరిగే నష్టంపై వందల అధ్యయనాలున్నాయి. కాని ఒక్క మాట రాయలేదు.

యాదాద్రి థర్మల్ కేంద్రం వల్ల పరిసరాలలో ఏటా 15 – 69 మధ్య వయసు వారి 2 వేల మరణాలు సంభవిస్తాయని అధ్యయనాలు చూపుతున్నాయి. విజయవాడ థర్మల్ కేంద్రం పరిధిలో పశువుల, స్త్రీల పునరుత్పత్తి అనారోగ్యాలపై ఫిర్యాదులున్నాయి. భారలోహాలూ, పాదరసం కాలుష్యాల గురించి ప్రస్తావించనే లేదు. సింగ్రౌలీలో ఆదివాసీలు పాదరస కాలుష్య బాధితులు. బూడిద చెరువులు నిరంతరంగా భూగర్భ జల కాలుష్యం చేస్తాయి. రామగుండం పక్కన కుందనపల్లి గ్రామం దశాబ్దాలుగా భూగర్భ జలకాలుష్యంపై పోరాడుతూనే ఉంది. ఈ నిజాలేవీ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో లేవు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా?

ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై విచారణకు ఆదేశించిన తెలంగాణ ప్రభుత్వం, అమలుపై సమగ్ర దర్యాప్తు చేయాలి. జరుగుతున్న తప్పులను సరిదిద్దాలి. లేకుంటే జరిగే నష్టానికి బాధ్యత ప్రభుత్వానిదవుతుంది.

■ డా. కలపాల బాబూరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



మేడారం జాతరలో భక్తజనం (ఫైల్)

మేడారం దారిలో..

- ప్రణాళికతో వెళ్తే ప్రయాణం.. ఆధ్యాత్మిక సమాహారం
- మార్గమధ్యంలో చారిత్రక ఆలయాలు, పురాతన కట్టడాలు
- అందుబాటులో తెలంగాణ టూరిజం బస్సులు
- 21 నుంచి 24 వరకు జాతర

ములుగుజిల్లాలోని మేడారం జాతరకు వేళయింది. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వెళ్లేందుకు నగరవాసులూ సిద్ధం అవుతున్నారు. ప్రత్యేక ప్రణాళికలతో వెళ్తే ప్రయాణాన్ని ఆద్యంతం ఆస్వాదించొచ్చు. నగరం నుంచి ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి వెళ్తే దారిపొడవునా ఉన్న చారిత్రక కట్టడాలు, ఆలయాలను వీక్షించవచ్చు. రెండు, మూడు రోజులు ప్లాన్ చేసుకుని ముందుకుసాగితే పలు ప్రాంతాలను సందర్శించవచ్చు. నగరం నుంచి 278 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడారం దారిలో ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాలు, పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాల విశిష్టత, రమణీయ దృశ్యాలను ఓసారి తెలుసుకుందాం.

-హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

1 నమో.. నారసింహ

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం తెలంగాణలో అతి పెద్ద పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది. శని, ఆదివారాల్లో భక్తుల తాకిడి విపరీతంగా ఉంటుంది. నగరం నుంచి మేడారం జాతరకు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే వారు తొలుత లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవచ్చు. స్వామివారి దర్శనం తర్వాత ఇక్కడి నుంచి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొలనుపాకలోని జైన మందిరాన్ని సందర్శించవచ్చు. రెండు వేల ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయమిది. ఆదినాథుడు, మహావీరుడు, నేమినాథుడు తదితర జైన దేవుళ్లు ఇక్కడ కొలువుదీరారు. మూల విరాట్టుకు కుడివైపున గర్భగుడిలో భారీ ఎత్తులో ఉన్న మహావీరుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ.



2 వేయిస్తంభాల ఆలయం..



యాదాద్రి ఆలయం, జైన మందిరాన్ని తిలకించిన తర్వాత హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయాన్ని చూడవచ్చు. కాకతీయ రాజుల నిర్మాణాల్లో ఒకటిగా పేరొందిన వేయిస్తంభాల గుడిని ఒక్కసారైనా చూసి తీరాల్సిందే. 11వ శతాబ్దంలో కాకతీయ వంశానికి చెందిన రుద్రదేవుడి హయాంలో చాళుక్యుల శైలిలో ఆలయాన్ని నిర్మించారు. వేయి స్తంభాలు కలిగి ఉండడంతో ఈ ఆలయాన్ని వేయిస్తంభాల గుడిగా పిలుస్తుంటారు. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు.

4 రామప్ప గుడి..



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట దగ్గర ఉన్న రామప్ప గుడిని సందర్శించవచ్చు. ఇది కాకతీయ రాజులు నిర్మించిన చారిత్రక దేవాలయం. హైదరాబాద్‌కు 220 కి.మీ. దూరంలో, వరంగల్ పట్టణానికి 70 కి.మీ. దూరంలో ఉంది. ఇసుకపై ఆలయాన్ని నిర్మించారు. నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి వాడిన రాయి నేటికీ రంగు కోల్పోకుండా ఉండడం ఇక్కడి ప్రత్యేకత. కాకతీయుల అపురూప కట్టడమైన రామప్ప ఆలయానికి రెండేళ్ల క్రితం యునెస్కో గుర్తింపు లభించింది.

5 లక్నవరం సరస్సు..



రామప్ప గుడికి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం చెరువును 1312లో ఓరుగల్లు రాజధానిగా పాలించిన ప్రతాపరుద్రుడు తవ్వించాడు. ఎత్తైన కొండల నడుమ నిర్మించిన చెరువు నేటి ఆధునిక ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని పోలి ఉంటుంది. కొన్నేళ్ల క్రితం చెరువుపై నిర్మించిన వేలాడే తీగల వంతెన సందర్శకులను ఆకట్టుకుంటోంది. మేడారం వెళ్లే భక్తులు తప్పనిసరిగా రామప్ప, లక్నవరాన్ని సందర్శిస్తారు. చివరగా మేడారానికి చేరుకునే భక్తులు అక్కడ బస చేసి మరుసటి రోజు వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకోవచ్చు.

3 భద్రకాళి గుడి..



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రకాళి గుడి ప్రఖ్యాతిగాంచింది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో వరంగల్- హన్మకొండ ప్రధాన రహదారిలో పాలిటెక్నిక్ కాలేజీ నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఈ గుడి ఉంది. ఆలయంలో భద్రకాళీదేవి విగ్రహం దాదాపు 9 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఏటా ఇక్కడ జరిగే శాకంబరీ ఉత్సవాలకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తుంటారు. ఉమ్మడి వరంగల్‌లో భద్రకాళి గుడికి ప్రత్యేక గుర్తింపు ఉంది.



అందుబాటులో టూరిజం బస్సులు..

జాతరను పురస్కరించుకుని తెలంగాణ టూరిజం శాఖ ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. నగరం నుంచి ఒక రోజులో మేడారానికి తీసుకెళ్లడంతో పాటు మార్గమధ్యంలో వేయిస్తంభాల గుడిని చూపించే విధంగా ఈనెల 7 నుంచి ప్యాకేజీని ప్రారంభించింది. ఉదయం 6.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని సీఆర్‌ఓ ఆఫీస్ నుంచి బయలుదేరే బస్సు రాత్రి 10.30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. వోల్వో బస్సులో పెద్దలకు రూ.1800, పిల్లలకు రూ.1440, నాన్ ఏసీ హైటెక్ కోచ్‌లో పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.960, ఏసీ మినీ కోచ్‌లో పెద్దలకు రూ.1600, పిల్లలకు రూ.1280 టికెట్ ధర ఉంటుందని తెలిపారు. కేవలం రవాణా మాత్రమే కల్పిస్తామని, అల్పాహారం, భోజన ఖర్చులు భక్తులే భరించాలని వారు పేర్కొన్నారు.

జాతర తేదీలు..

- 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును గద్దె వద్దకు తీసుకొస్తారు.
- 22న సమ్మక్కను గద్దె వద్దకు తీసుకొస్తారు.
- 23న భక్తులకు వనదేవతల దర్శనం.
- 24న దేవతల వనప్రవేశంతో జాతర ముగింపు.



సరస్వతీ నమస్తుభ్యం

వసంత పంచమి వేడుకలు నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. శృంగేరీమఠ్‌లోని శారదాంబ అమ్మవారు మహా సరస్వతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- జవహర్‌నగర్, (ఆంధ్రజ్యోతి)



జీహెచ్ఎంసీలో కదిలిన కుర్చీలు

- పాతుకుపోయినవారికి స్థానచలనం

7

జయహో పుస్తకం



8

పెద్దల సభకు చిన్నోడు

- అనిల్‌కుమార్‌యాదవ్‌కు చాన్స్
- రాష్ట్రానికి ఖరారైన రెండుస్థానాల్లో ఒకటి నగరానికి
- పార్టీని నమ్ముకున్న కుటుంబానికి దక్కిన గౌరవం



హైదరాబాద్ సిటీ, రాంనగర్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): పెద్దల సభకు చిన్నోడు ఎంపికయ్యాడు. అసెంబ్లీ సీట్ల వారీగా కాంగ్రెస్‌కు వచ్చే రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి నగరంలో పుట్టి పెరిగిన అనిల్‌కుమార్‌యాదవ్‌కు దక్కింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తనయుడైన అనిల్‌కుమార్ చిన్నతనం నుంచే కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థి, యువజనకాంగ్రెస్ నేతగా వివిధ స్థాయిల్లో పని చేస్తూ ప్రస్తుతం సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కుటుంబమంతా చిరకాలంగా కాంగ్రెస్‌తోనే ఉంటోంది. కష్టకాలంలోనూ పార్టీ పటిష్ఠతకు అవిశ్రాంతంగా పని చేస్తోంది. అంజన్‌కుమార్‌యాదవ్‌తో పాటు తనయులు అనిల్‌కుమార్‌యాదవ్, అరవింద్‌యాదవ్ పార్టీ ఏ పిలుపు ఇచ్చినా ముగ్గురూ ముందువరుసలోనే ఉంటారు. కాంగ్రెస్ పట్ల వారి కుటుంబానికి ఉన్న అంకితభావాన్ని గుర్తించిన అధిష్ఠానం యువతను ప్రోత్సహించడానికి అనిల్‌కుమార్‌యాదవ్‌కు రాజ్యసభ సీటును ఖరారు చేసింది.

అంజన్ శిబిరంలో ఆనందోత్సాహాలు

రాజ్యసభకు అనిల్ ఎంపికతో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. బుధవారం సాయంత్రం 4 నుంచి రాత్రి వరకు న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని అంజన్‌కుమార్‌యాదవ్ కార్యాలయానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కుమారుడికి ఎంపీగా అవకాశం రావడంతో అంజన్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మిగతా 8వ పేజీలో..

బయోడేటా

పేరు	ఎం.అనిల్‌కుమార్‌యాదవ్
భార్య	దేవికాయాదవ్
కుమారులు	ఆరోవ్‌కుమార్, అన్‌సూల్‌కుమార్
తల్లిదండ్రులు	ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, నాగమణియాదవ్
పుట్టిన తేదీ	9-9-1982
విద్యార్హతలు	బీకామ్, ఎల్ఎల్‌బీ
నివాసం	పాతబస్తీ

అరకోటి వేతనంతో ఉద్యోగం

- జేఎన్‌టీయూ విద్యార్థినికి బంపర్ ఆఫర్



చల్లా సాయికృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ విద్యార్థిని చల్లా సాయికృతికి గోల్డెన్ ఆఫర్ లభించింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ డీఈషా గ్రూప్‌లో రూ.52 లక్షల వార్షిక వేతనంతో ప్లేస్‌మెంట్ పొందింది. కంపెనీలో ఒక ఉద్యోగానికి జరిగిన రాతపరీక్షకు జేఎన్‌టీయూ నుంచే వంద మందికి పైగా విద్యార్థులు పోటీపడ్డారు. మూడు రౌండ్ల అనంతరం ప్లేస్‌మెంట్ సాయికృతి సొంతమైంది. ఎంసెట్‌లో 186వ ర్యాంకు సాధించిన సాయికృతి బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో చేరింది. అక్క స్ఫూర్తితో సాఫ్ట్‌వేర్‌రంగం వైపు మొగ్గుచూపినట్లు తెలిపింది. తండ్రి మహీధర్ న్యూల్యాండ్ ల్యాబొరేటరీలో ప్రాజెక్టు మేనేజర్ కాగా, అమ్మ ఉషారాణి గృహిణి. కాగా, దేశవ్యాప్తంగా పేరుగాంచిన ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్లేస్‌మెంట్స్ తగ్గినట్లుగా వార్తలు వస్తుండగా, ఈ ఏడాది జేఎన్‌టీయూ కాలేజీలో 20 శాతం ప్లేస్‌మెంట్స్ పెరిగినట్లు ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. భారీ ప్యాకేజీతో ఉద్యోగం పొందిన సాయికృతికి శుభాకాంక్షలు తెలిపారు.



ఇందిరాపార్కుకు తాళం

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంటలు, సందర్శకులతో రోజూ కళకళలాడే ఇందిరాపార్కు ప్రేమికులరోజున వెలవెలబోయింది. వాలైంటైన్ డే సందర్భంగా పార్కుల్లో ప్రేమజంటలు కనిపిస్తే పెళ్లిళ్లు చేస్తామని కొన్నిసంస్థలు హెచ్చరించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు ఇందిరాపార్కును మూసివేశారు. ద్వారాలకు తాళాలు వేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు వరకు మూసి ఉండడంతో దూరప్రాంతాల నుంచి పార్కును వీక్షిద్దామని వచ్చిన వారు నిరాశకు గురయ్యారు. పార్కులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ



ప్లకార్డులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వీర జవాన్ల దివస్(పుల్వామా ఎటాక్) సందర్భంగా తెలంగాణ ప్రాంత బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ కోఠి మహిళ యూనివర్సిటీ నుంచి కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వరకు ప్లకార్డులతో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వద్ద వీర జవాన్ల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి పండరీనాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, రాహుల్, బాలస్వామి మాట్లాడుతూ 'విదేశీ విష సంస్కృతి వద్దు... భారత సంస్కృతి ముద్దు' అనే సందేశం ప్రపంచ వ్యాప్తంగా కొనసాగాలన్నారు. వాలెంటైన్ డేను ప్రోత్సహించవద్దని సూచించారు.

గవర్నర్ తిరస్కరణ ఆదేశాలను కొట్టేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గం సిఫార్సులకు వ్యతిరేకంగా తమ నామినేషన్‌లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీచేసిన ఆదేశాలను కొట్టేయాలని పిటిషనర్‌లు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ భర్తీ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం కూడా విచారణ కొనసాగించింది. గవర్నర్ తన అధికార పరిధికి మించిన నిర్ణయం తీసుకున్నారని పిటిషనర్లు తెలిపారు. తమకు రాజకీయాలతో సంబంధం ఉందని గవర్నర్ తమ నామినేషన్‌లను తిరస్కరించారని, మరి కోదండరాం, అమీర్‌అలీ నామినేషన్‌లను ఎలా ఆమోదించారని అడిగారు. మరి గవర్నర్‌కు రాజకీయ నేపథ్యం లేదా అని వారు ప్రశ్నించారు. గురువారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.



రాంచంద్ర(బాబూజీ మహరాజ్) స్మారకార్థం పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తున్న దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్, రామచంద్ర మిషన్ గురూజీ

'రామచంద్ర మిషన్' సేవలు అమోఘం

● కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్

నందిగామ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రామచంద్ర మిషన్ సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న సేవలు అమోఘమని, ఆ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్ అన్నారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ రెండో గురువు బాబూజీ మహరాజ్ జయంతితో పాటు సంస్థ ఆదిగురువు లాలాజీ మహరాజ్ జయంత్యుత్సవాలు రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని ప్రపంచంలోని అతిపెద్ద ధ్యాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూజీ మహరాజ్ పేరుతో పోస్టల్ స్టాంప్‌ను కేంద్రమంత్రి, రామచంద్ర మిషన్ గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్(దాజీ)తో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది ధ్యాన అభ్యాసకులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఉస్మానియా' రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ వేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో 313ని అమలు చేయాలని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రూపు ప్రతినిధులు అనురాధరెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసీఫ్ హనీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని అలానే ఉంచి, ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని వారు సూచించారు. సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మణికొండలో ఫ్లైఓవర్ పేరిట చెట్ల నరికివేత

● హైకోర్టులో వట ఫౌండేషన్ పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేరేచోట నాటేందుకు ప్రయత్నించకుండా చెట్లను నరికేయడంపై వివరణ ఇవ్వాలని పేర్కొంటూ అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, జీహెచ్ఎంసీ కమిషనర్, మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఫ్లైఓవర్ నిర్మాణం, క్రికెట్ మైదానం దారి కోసం వందలాది వృక్షాలను నరికేయడాన్ని వ్యతిరేకిస్తూ వట ఫౌండేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మణికొండ మున్సిపాల్టీలో ఫ్లైఓవర్ నిర్మాణం, క్రికెట్ మైదానం కోసం చెట్లను నరికేస్తున్నారని, వాటిని వేరేచోట నాటేందుకు (ట్రాన్స్‌లొకేషన్) ఉచితంగా సహకారం అందిస్తామని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ సంస్థ తరఫు న్యాయవాది వడ్డేపల్లి రచన తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీచేస్తూ.. వివరణ ఇవ్వాలని పేర్కొంది. విచారణను వచ్చేవారానికి వాయిదా వేసింది.

వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం పాతబస్తీలోని పలు పాఠశాలల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. గౌలిపురా శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ప్రధానాచార్యుల దంపతుల చేత యజ్ఞం జరిగింది. సరస్వతీదేవి మంత్రోచ్ఛరణల మధ్య 85 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల కార్యదర్శి సీహెచ్ రూప్‌రాజ్ బాసర నుంచి వచ్చిన కుంకుమను చిన్నారుల నుదుట దిద్ది ఆశీర్వదించారు. కార్యక్రమంలో రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

● నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐకి గాయాలు



భాజావలి మొయినుద్దీన్



సాదిక్‌అలీ (ఫైల్)

కొత్తపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్‌అలీ(40) మృతి చెందగా, నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్(52)కు గాయాలయ్యాయి. ఎల్‌బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్ కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నారు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్‌బీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి 11.40 గంటలకు తిరిగి బైకుపై మలక్‌పేటకు బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైకును ఢీకొట్టింది. బైకు నడిపిన సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి, వెనుక కూర్చున్న ఖాజావలీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాదిక్‌అలీ, ఖాజావలీలను 108 వాహనంలో ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ సాదిక్‌అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తెలిపారు. ఎస్ఐ ఖాజావలి చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఎండీ అబ్దుల్ అలీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు.

రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

● బాలుడి మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కార్తీక్ (ఫైల్)

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలోని ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నం.5 దుర్గాభవానీనగర్ బస్తీలో మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తిక్(11) జవహర్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తిక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. బుధవారం ఉదయం బస్తీకి అనుకొని ఉన్న జీహెచ్ఎంసీ పార్కులో నుంచి వెళుతున్న నాలాలో పరిశీలించగా కార్తిక్ మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ హత్య కేసు

● పోలీసుల అదుపులో రౌడీషీటర్ జిలాని

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రియాల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలాని అక్కడి నుంచి పారిపోయాడు. అతని మనుషులు మాత్రం పోలీసులకు దొరికారు. గతంలో కూడా అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో ఏ1గా ఉన్న జీడిమెట్లకు చెందిన గణపతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్ఎంసీలో కదిలిన కుర్చీలు

● పాతుకుపోయిన వారికి స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఎన్నేళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పది మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏ.శైలజ, ఎండీ షేక్, డీ.సుభాష్‌రావులకు పోస్టింగ్ ఇవ్వలేదు.

పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
జకీయ సుల్తానా	డిప్యూటీ సీఈఓ	సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్
ఎ.సుజాత	సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్
సీహెచ్.నాగేశ్వరరావు	రామగుండం, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్
జి.వేణుగోపాల్ రెడ్డి	బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్
శివకుమార్	డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్ఎంసీ	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్
ఎస్.విద్యాధర్	గజ్వేల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్
వి.సమ్మయ్య	తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్	సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్
ఖాదర్ మొయినుద్దీన్	వెయిటింగ్	సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్
తిప్పర్తి యాదయ్య	ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్
జి.ఆంజనేయులు	డిప్యూటీ కమిషనర్, జీహెచ్ఎంసీ	సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్
టి.దశరథ	సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్
పి.రవీందర్‌కుమార్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్
సీహెచ్.అరుణకుమారి	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్
ఎ.నాగమణి	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్

వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దు

● విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు ● అసెంబ్లీ ముట్టడికి యత్నం.. అరెస్ట్



ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాల భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని కోరుతూ బుధవారం విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు హెచ్ సునీల్, గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.సుఖేందర్‌రెడ్డి, సాత్వికరెడ్డి, కమలాకర్, చందు, అనిల్ గోగికార్, పాక నవీన్‌బాబు, రాహుల్‌చంద్ర, అనిల్ కుమార్, రవి, కిషోర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శిశువును వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న శిశువు

మదీన, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి అరుగుల మీద వదిలిపెట్టి వెళ్లిపోయారు. చాంద్రాయణగుట్ట ఎస్ఐ అబ్దుల్ జబ్బార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘాజిమిల్లత్ కాలనీలో రోడ్డుపక్కన ఓ శిశువును గుర్తు తెలియని వ్యకులు మంగళవారం రాత్రి చెత్తకుండి దగ్గర వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు చాంద్రాయణగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శిశువును నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. పరిసరాల్లో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు యాక్టివాపై వచ్చి శిశువును వదిలిపెట్టినట్లుగా గుర్తించారు. త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్ పూలింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి

● సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు కార్‌పూలింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి బయటపడడంలో దాని ప్రాముఖ్యం గురించి ఉద్యోగులకు తెలియజేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్సీఎస్సీ), బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) కంపెనీ సీఈవోలతో సీపీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. సైబరాబాద్ పోలీస్‌తో కలిసి ఎస్సీఎస్సీ చేస్తున్న కార్యక్రమాలు, వాటి ద్వారా ఐటీ కంపెనీలకు జరుగుతున్న మేలు, సామాజిక బాధ్యతకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. కంపెనీల్లో సమాచార భద్రతా నిపుణులు ఉంటే సీఐఎస్‌వో(చీఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్)కు నామినేట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహనకు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చిన కంపెనీల సీఈవోలను సీపీ అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్, ఎస్సీఎస్సీ జనరల్ సెక్రటరీ రమేష్ ఖాజా, అధికారులు పాల్గొన్నారు.

సమ్మోహనంగా సాయిశ్రియ భరతనాట్యం



నాట్యం చేస్తున్న నర్తకి సాయిశ్రియ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు చక్కటి అభినయంతో యువ నర్తకి సాయి శ్రియ ప్రదర్శించిన నాట్యం ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. బుధవారం రవీంద్రభారతిలో ప్రముఖ నాట్యగురువు శుభ ధనుంజయ్ శిష్యురాలు సాయిశ్రియ ఏనుగు భరత నాట్యంలో ఆరంగ్రేటం చేసింది. ఏనుగు సురేష్, మణిరాధిక దంపతుల కుమార్తె సాయిశ్రియ చిన్నతనం నుంచి భరతనాట్యంలో శిక్షణ పొందింది. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ రెంటాల చంద్రశేఖర్, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, డా.మద్దాళి ఉషాగాయత్రి, డా.పి.రమాదేవి, సూర్యనారాయణ, తదితరులు సాయిశ్రియను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం గురువుకు సత్కారం చేశారు.

జీబీఎన్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న నటుడు సుమన్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గౌడ్స్ బిజినెస్ నెట్‌వర్క్(జీబీఎన్) వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్‌ను ప్రముఖ నటుడు సుమన్ ఆవిష్కరించారు. బుధవారం సుమన్ ఇంటి వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కమ్యూనిటీ వ్యాపారుల అభివృద్ధే లక్ష్యంగా తొలిసారిగా ఒక వెబ్‌సైట్ రావడం అభినందనీయమన్నారు. వ్యాపారరంగంలో గౌడ సోదరులు రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జీబీఎన్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చీకటి ప్రభాకర్, ఈతముల్లు ప్రసాద్‌గౌడ్, రాజేందర్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అములకొండ శ్రీనివాస్, ర్యాకల లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.


గో గీత లఘుచిత్రం విడుదల



నిట్టల గోపాలకృష్ణను సత్కరిస్తున్న నటుడు సుమన్, తదితరులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో డా.నిట్ల గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన గో గీత లఘు చిత్రాన్ని విడుదల చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ నటుడు సుమన్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ నటి రోజారమణి, నటి కవిత, వెంకటరమణశర్మ తదితరులు హాజరై నిర్వాహకులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో గీత లఘు చిత్రానికి గోపాలకృష్ణ నిర్మాత, స్క్రీన్‌ప్లేతోపాటు దర్శకత్వం వహించి అందులో నటించడం గొప్ప విషయమన్నారు. సమాజానికి సందేశాన్నిచ్చే చిత్రాలు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిట్టల గోపాలకృష్ణను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పులివర్తి కృష్ణమూర్తి, నంగునూరి చంద్రశేఖర్, రఘుశ్రీ, కోకా భవాని, లలితవాణి, రామచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో శ్మశానవాటిక అభివృద్ధి



బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్లేశ్‌నేత

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ నూర్ మహ్మద్‌కుంట శ్మశానవాటికలో కార్వాన్‌కు చెందిన ఎ.మల్లేశ్ నేత సొంత ఖర్చులతో బోరు వేయిస్తున్నారు. ఆ పనులకు బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. బోరు వేసి మోటారు బిగించడంతోపాటు శ్మశానవాటికకు వచ్చే వారు కూర్చునేందుకు పది బెంచీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎస్.వెంకటేశ్, సీహెచ్ కృష్ణాగౌడ్, నాయకులు ఎ.మాధవరెడ్డి, పి.సుధాకర్‌గౌడ్, రాజు, అంబదాస్, సింహాద్రి, కిష్టప్ప, చిట్టి పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yy4s3alలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



కార్పొరేట్ బ్యాంకింగ్ అండ్ అనుబంధ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్ తివారీ తెలంగాణ పర్యటనలో భాగంగా బుధవారం కోఠిలోని ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా అశ్విని కుమార్ తివారీ శ్రీ శంకర మేనేజింగ్ ట్రస్టీకి చెక్కును అందజేశారు. శ్రీ శంకర గురుకుల వేద పాఠశాలలో 41 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్, ఫొటో వోల్టాయిక్ పవర్ ఆన్-గ్రిడ్ సిస్టమ్ ఏర్పాటుకు చెక్కును అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్, సీజీఎం రమేశ్‌రావు, జనరల్ మేనేజర్ దేబాశీష్‌మిత్ర, తదితరులు పాల్గొన్నారు.

● హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

అనిల్‌కుమార్ యాదవ్‌కు 'రాజ్యసభ'పై హర్షం

మదీన, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా యువజన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో పాతబస్తీలో సంబరాలు జరుపుకుంటున్నారు. ఆయన నివాసమైన పాతనగరం గొల్లకిడికిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. అనిల్ కుమార్‌యాదవ్ గతంలో ముషీరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు. ఈయన తండ్రి అంజన్‌కుమార్ యాదవ్ రెండు పర్యాయాలు సికింద్రాబాద్ ఎంపీగా పనిచేశారు. చాలా ఏళ్ల తర్వాత పాత బస్తీకి చెందిన నాయకుడికి రాజ్యసభ రావడం సంతోషకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

బూత్ చలో అభియాన్



బూత్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో గోపాల్‌జీ, సాయి, సందీప్‌సింగ్, తదితరులు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బూత్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బేగంబజార్ డివిజన్ జగన్నాథ్ ద్వారా బూత్ నంబర్ 113, 114, 115 వద్ద బూత్ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ, సాయి, సందీప్‌సింగ్, జుగల్ కిశోర్, డి.సిద్ధార్థ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

మదీన, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కిషన్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో సలహాదారు సీఎన్ సాయికిరణ్ నేతృత్వంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మహ్మద్ జావిద్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అక్రం, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ మోసిన్, కార్యవర్గ సభ్యులుగా రషీద్‌ఖాన్, తబస్సుమ్, మఖ్బూల్ ఖురేషీ, మహ్మద్ అల్తాఫ్, మహ్మద్ యూసుఫ్ ఎన్నికయ్యారు.

'రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీష్

గోషామహల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నుక్కడ్ నాటక ప్రదర్శనలో లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

ఆకట్టుకున్న నుక్కడ్ నాటక ప్రదర్శన

గోషామహల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించేందుకు ఆబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)లో నుక్కడ్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్లకార్డులను ప్రదర్శించారు. ముఖ్యంగా నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అప్పుడే వారి భవిష్యత్ ఎంతో గొప్ప ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన నుమాయిష్‌కు వచ్చిన వేలాది ప్రజలను అమితంగా ఆకట్టుకుంది.

పట్టపగలే నగల షాపులో భారీ దోపిడీ!

● బంగారు గొలుసు కావాలంటూ వచ్చి కత్తితో దాడి
● రూ.20 లక్షల విలువైన నగలు ఎత్తుకెళ్లిన ముగ్గురు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాన్ ప్రకారం బంగారు గొలుసు కావాలంటూ నగల షాపునకు వచ్చిన దుండగులు.. షాపులోని వ్యక్తిపై కత్తితో దాడి చేసి రూ.20 లక్షల విలువ చేసే అభరణాలను ఎత్తుకెళ్లారు. మలక్‌పేట అక్బర్‌బాగ్‌లోని కిస్వాహ్ నగల దుకాణంలో బుధవారం ఈ ఘటన జరిగింది. షాపు యజమాని మహ్మద్ ఉర్ రెహమాన్ పని మీద బయటికెళ్తూ కుమారుడు సజా ఉర్ రెహమాన్(22)ను షాపులో కూర్చొబెట్టాడు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం 1.30 గంటలకు ఓ వ్యక్తి వచ్చి బంగారు గొలుసు కావాలని అడిగాడు. దీంతో సజా ఉర్ రెహమాన్ గొలుసు చూపించే పనిలో ఉండగా.. మరో ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి షాపులోకి వచ్చారు. ఇందులో ఒకరు సజా ఉర్ రెహమాన్‌పై కత్తితో దాడికి దిగగా.. అతడు చెవి, మెడకు గాయం కావడంతో కింద పడిపోయాడు. దీంతో షాపులోని బంగారు నగలను సర్ది సంచిలో వేసుకున్నారు. అనంతరం బయటికి వచ్చి ముగ్గురు ఒకే బైక్‌పై పారిపోయారు. దీనిపై షాపు యజమాని మహ్మద్ ఉర్ రెహమాన్ చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన సజా ఉర్ రెహమాన్ పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఇటు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ ధరావత్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపారు. దొంగలను పట్టుకోడానికి నాలుగు టీమ్‌లను రంగంలోకి దింపినట్లు సమాచారం.

పంపకాలలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11.356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్ఠవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నేడు నగరానికి మధ్యప్రదేశ్ సీఎం రాక

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ గురువారం నగరానికి రానున్నారు. మల్లన్న భక్తుల సౌకర్యార్థం కొమురవెల్లిలో నిర్మించతలపెట్టిన రైల్వేస్టేషన్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొంటారు. అనంతరం, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ నాయకుల సమావేశంలో పాల్గొంటారు. సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి తెలుగు లిటరరీ కాంగ్రెస్ సదస్సు

తార్నాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024 సదస్సును నిర్వహించనున్నటు ఆ శాఖ అధ్యక్షుడు ప్రొ. సి.కాశీం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 3 రోజుల పాటు జరగనున్న తెలుగు సాహిత్య మహాసభలలో మొదటి రోజు కవిత్వం, కథ, నవల, విమర్శ, పరిశోధన, జానపద సాహిత్యం, భాష అనే ఇతివృత్తాల కేంద్రంగా మొత్తం ఆరు సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమం చివరిరోజు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల తెలుగు శాఖ అధ్యక్షులతో చర్చాగోష్ఠి కార్యక్రమం ఉంటుందని, ఈ చర్చాగోష్ఠి కార్యక్రమంలో తెలుగు భాషా, సాహిత్యాల అధ్యయనం, పరిశోధన, కరిక్యులంపై విస్తృతమైన చర్చ ఉంటుందని ఆయన వివరించారు.



రామ్‌నాథ్ కోవింద్‌కు 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై మజ్లిస్ పార్టీ అభిప్రాయాన్ని రాతపూర్వకంగా అందజేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

రామ్‌నాథ్ కోవింద్‌తో ఒవైసీ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై అత్యున్నత స్థాయి కమిటీ(హెచ్‌ఎల్‌సీ) చైర్మన్ రామ్‌నాథ్ కోవింద్‌తో మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌పై కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన కమిటీ నియమించిన విషయం విదితమే. అయితే, ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడంలో ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన నివేదికను అందించడంతో పాటు పార్టీ అభిప్రాయాన్ని ఒవైసీ ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు కమిటీ సభ్యులకు వివరించారు. దీనిపై కమిటీ సభ్యుల ప్రశ్నలకు పార్టీ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. కొంత సేపు చర్చించారు.

డ్రైవర్ పేరుతో కారు.. వసూళ్లకు అటెండర్..!

● శివబాలకృష్ణ కేసులో గోపీ, హబీబ్‌ను విచారించిన ఏసీబీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికిమించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ బినామీలపై ఏసీబీ దృష్టి సారించింది. అందులో భాగంగానే శివబాలకృష్ణ వద్ద ఏళ్ల తరబడిగా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ గోపీనాథ్, అటెండర్ హబీబ్‌ను ఏసీబీ అధికారులు బుధవారం ప్రశ్నించారు. బినామీల పేర్లతో స్థిర, చర ఆస్తులు కొనుగోలు చేసిన శివబాలకృష్ణ అదే క్రమంలో డ్రైవర్ గోపీ పేరుతో హోండా సిటీ కారు కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కారు ఎప్పుడు కొన్నారు, ఎక్కడ, ఎంతకు కొన్నారు, గోపీ పేరుతో ఎందుకు కొనాల్సి వచ్చింది. కారు గోపీకి గిఫ్ట్‌గా ఇచ్చారా అనే కోణంలో ఏసీబీ అధికారులు అతన్ని ప్రశ్నించారు. స్థిరాస్తి సంస్థలకు అనుమతులు మంజూరు చేసే క్రమంలో వారి నుంచి డబ్బులు సేఫ్‌గా తీసుకువచ్చేందుకు కొన్ని సందర్భాల్లో అటెండర్ హబీబ్‌ను శివబాల కృష్ణ ఉపయోగించినట్లు ఏసీబీ గుర్తించింది. ఎవరెవరి నుంచి ఎంత మొత్తం తెచ్చారు, ఎక్కడికి చేరవేశారు, ఎవరైనా ప్రభుత్వ అధికారులకు ఆ డబ్బులు అందించారా అనే కోణంలో హబీబ్ నుంచి ఏసీబీ అధికారులు వివరాలు రాబట్టారు. మరోవైపు బినామీలు భరత్ కుమార్, సత్యనారాయణను ఏసీబీ అధికారులు వరుసగా రెండో రోజు కూడా విచారించారు. శివబాలకృష్ణ బినామీలు, అతని వద్ద పనిచేసిన మరికొందర్ని విచారించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది.

జయహో పుస్తకం

ఆరో రోజు పుస్తకావిష్కరణ సభలు, సాహిత్య సదస్సులు

పుస్తకావిష్కరణ సభలు, సాహిత్య సదస్సులు, కవులు, రచయితలు, పాఠకుల ఆత్మీయ పలకరింపులతో.. పుస్తక మహోత్సవం ఆరో రోజు అద్భుతంగా సాగింది. తమకు నచ్చిన పుస్తకాలను కొనడమేకాదు, వాటిమీద రచయితలతో సందర్శకులు సంభాషిస్తుండటం బుక్ ఫెయిర్ ప్రాంగణంలో కనిపిస్తోన్న అరుదైన దృశ్యం. స్మార్ట్ యుగంలోనూ నగర వాసులు జయహో పుస్తకం అంటున్నారు. ఎండను సైతం లక్ష్యపెట్టకుండా ఎన్టీఆర్ స్టేడియంలోని పుస్తక ప్రదర్శనకు పెద్ద ఎత్తున సాహిత్యాభిమానులు తరలిరావడం గొప్ప విషయం.
- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి)



సదస్సులో మాట్లాడుతున్న జి. లక్ష్మీనర్సయ్య

వాక్యం వికాసాత్మకం కావాలి

వాక్యం రసాత్మకం మాత్రమే కాదు, వికాసాత్మకం కావాలి అని ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనర్సయ్య అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 'నేటి సామాజిక పరిణామం - రచయితల స్పందన' అంశంపై బుధవారం రవ్వా శ్రీహరి వేదికపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మీనర్సయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కవి జూలూరు గౌరీశంకర్, జూపాక సుభద్ర, ఎన్.వేణుగోపాల్, తెలకపల్లి రవి, ఆనందాచారి తదితరులు ప్రసంగించారు.

'హమీద్ దల్వాయి' ఆవిష్కరణ

ఎలిమి ఆధ్వర్యంలో ఓల్గా అనువదించిన 'హమీద్ దల్వాయి' కథాసంపుటి ఆవిష్కరణ సభ బుధవారం హైదరాబాద్ పుస్తకమహోత్సవంలో జరిగింది. ఈ సభలో రచయితలు ఉణుదుర్తి సుధాకర్, పూర్ణిమ తమ్మిరెడ్డి, గూండ్ల వెంకటనారాయణ, రచయిత్రులు ఓల్గా, జ్యోతి పాల్గొన్నారు.

హృదయరాగం పుస్తకం...

జర్నలిస్టు పగిడిపాల ఆంజనేయులు రాసిన 'హృదయరాగం' పుస్తకాన్ని బుధవారం బుక్ ఫెయిర్ వేదికపై ప్రముఖ దర్శకుడు బి.నర్సింగరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, మానవహక్కుల నేత జీవన్‌కుమార్, సామాజిక ఉద్యమకారుడు రియాజ్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకుడు చంద్రమోహన్, సీనియర్ జర్నలిస్టు గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

'పిలుపు' కవితా సంపుటి...

అమృత రాజ్ కవిత్వం 'పిలుపు' సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతలు పసునూరి రవీందర్, మెర్సీ మార్గరేట్ ఆవిష్కరించారు. ఇందులోని కవితలు చదువుతుంటే, సమాజం పట్ల కవికున్న అవ్యాజమైన ప్రేమ అర్థమవుతుందని వక్తలు పేర్కొన్నారు.

విద్యకు విముక్తి పుస్తకం...

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో బుధవారం హెబ్బర్ నాగేశ్వరరావు రాసిన 'విద్యకు విముక్తి' పుస్తకాన్ని విశ్రాంత ఐఏఎస్ చామర్తి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. సంస్కృతి, సంప్రదాయాలకు పూర్వ వైభవం రావాలంటే సంస్కృత విద్యాబోధన ప్రారంభించాలి అని రచయితతో పాటు బొప్పా భాస్కర్ తదితర వక్తలు అన్నారు.

వివిధ పుస్తకాలు.. లభ్యమయ్యే స్టాళ్లు

- దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో తమ విశిష్టతను చాటుతూ, సమాజాన్ని ప్రభావితం చేస్తోన్న 256మంది మహిళలు, అమ్మాయిల స్ఫూర్తిదాయక గాథల సమాహారం 'షీరోస్' పుస్తకం స్టాల్ నంబరు - 360లో లభ్యమవుతుంది. ఈ పుస్తకం సందర్శకులకు రూ.600కు అందిస్తున్నారు.
- విప్లవ రచయితల సంఘం ప్రచురణలతో పాటు కొకు 'చదువు', అల్లం రాజయ్య సాహిత్య విమర్శ 'వెన్నెలకోనలు', నర్ల రవి 'కులం - విప్లవోద్యమం' వ్యాసాలు, మలుపు ప్రచురణల పుస్తకాలు 'బుల్డోజర్ సందర్భాలు', ప్రశ్నించే స్త్రీల అనుభవ కథనాలు 'ట్రోల్', 'మణిపూర్‌లో జాతి హింస' తదితర పుస్తకాలు అరుణతార స్టాల్ నంబరు- 157లో లభ్యమవుతాయి. విప్లవోద్యమ రచయిత్రులు రాసిన 350 కథలతో బి.అనురాధ సంపాదకత్వంలో 'వియుక్క' పేరుతో ఆరు సంకలనాలుగా వెలువడ్డాయి. వీటి ధర. రూ.4,500. పుస్తక ప్రదర్శనలో రూ.3వేలకు అందిస్తున్నారు.

నేటి కార్యక్రమాలు

- గురువారం మధ్యాహ్నం 2 గంటలకు చిన్నారులకు నృత్యపోటీలు
- సాయంత్రం 4గంటలకు కత్తి పద్మారావు రచించిన 'ఈ దేశం మాది' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 5గంటలకు శ్రీరామోజు హరగోపాల్ 'కొత్త తెలంగాణ శాసనాలు' సంకలనం ఆవిష్కరణ
- సాయంత్రం 6గంటలకు సాహిత్య విమర్శకుడు సంగిశెట్టి శ్రీనివాస్‌తో ముఖాముఖి
- సాయంత్రం 7గంటలకు నవయుగభారతి ప్రచురణ 'జాతి పునర్నిర్మాణ రథ సారథులు' ఆవిష్కరణ



చిన్నారుల నృత్య ప్రదర్శన

బాలవికాస్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చిన్నారుల జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను దర్శకుడు బి.నర్సింగరావు అభినందించి, మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పెద్దల సభకు చిన్నోడు

(5వ పేజీ తరువాయి)

పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ ప్రస్థానం : ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ 1999లో ఎన్‌ఎస్‌యూఐలో చేరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 2002 నుంచి 2006 వరకు పనిచేశారు. అనంతరం జాతీయ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. 2006 నుంచి 2011 వరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2012 నుంచి 2015 వరకు యూత్ కాంగ్రెస్ ఎలక్టెడ్ వైస్‌ప్రెసిడెంట్‌గా కొనసాగారు. 2015 నుంచి 2020 వరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2020 నుంచి 2022 వరకు యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జిగా పనిచేశారు. 2023లో పార్టీ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికై నేటి వరకు కొనసాగుతున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంతలో రాజ్యసభసీటు దక్కింది.

జిల్లా అభివృద్ధి కోసం కలిసి నడుస్తాం

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేయడంతోపాటు మహేశ్వరం నియోజకవర్గంలో కబ్జాలకుగురైన చెరువులు, కుంటలు, అసైన్డ్, ప్రభుత్వ భూముల ఆక్రమణపై పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల కృష్ణారెడ్డి కలిసి సంయుక్త ప్రకటన చేశారు. మంగళవారం రాత్రి మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కేఎల్‌ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అయిన తన కోడలు అనితారెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నామని, తదనంతరం నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై పోరాటం చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలో నియోజకవర్గంలో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ భూములను పరిశీలించేందుకు మంత్రుల బృందం పర్యటించనుందని తెలిపారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపు కోసం తాము పని చేస్తామని చెప్పారు.



ఒక్కటైన మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల కృష్ణారెడ్డి

కౌన్సెలింగ్

వాటిని వాడితే?

లైంగిక ఆరోగ్యం, చికిత్సల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో రూపొందిన ఒక తాజా వాణిజ్య ప్రకటన దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టిస్తోంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్, అశ్లీల నటుడు జానీ సిన్స్‌లతో ఒక సీరియస్ విషయాన్ని హాస్యచతురతతో వివరించడానికి చేసిన ఈ ప్రయత్నం విశ్రమ స్పందనలకు అందుకుంటోంది. అయితే ఇంతకూ ఈ వాణిజ్య ప్రకటన ద్వారా ప్రచారం కల్పిస్తున్న లైంగిక ఉత్పత్తుల ప్రామాణికత ఎంత? వీటిని ఎవరు, ఎలా, ఎప్పుడు, ఎందుకు వాడుకోవచ్చు? పురుష లైంగిక సమస్యలకు ఈ ఉత్పత్తులతో శాశ్వత పరిష్కారం దక్కుతుందా? వైద్య నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం!



లైంగిక విషయాలు, సమస్యలు, లోపాల గురించి బహిరంగంగా చర్చించడానికీ, ఇతరులతో పంచుకోడానికీ అందరూ సుముఖంగా ఉండరు. అందుకు బిడియం కొంత కారణమైతే, ఇతరులు చిన్నచూపు చూస్తారేమోననే భయం మరొక కారణం. అలాగే చిన్నాచితకా లైంగిక సమస్యలను ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కోవడం అత్యంత సహజం. అలాంటప్పుడు జ్వరం మాత్రల్లా, ఇలాంటి మందులు కూడా తేలికగా అందుబాటులో ఉంటే వాటిని వాడుకోవచ్చు కదా? అని అనిభావించేవాళ్లు ఎక్కువ! ఈ కోవకు చెందిన వాళ్ల కోసం కొన్ని కంపెనీలు పలు రకాల లైంగిక ఉత్పత్తులను మార్కెట్లోకి తెస్తున్నాయి. తాజాగా సంచలనం సృష్టిస్తున్న వాణిజ్య ప్రకటన కూడా లైంగిక ఉత్పత్తులకు సంబంధించినదే! ఇలాంటి మందులతో ప్రయోజనాలూ ఉన్నాయి, అంతే సమానంగా దుష్ప్రయోజనాలూ ఉన్నాయి.

ఎవరు - ఎంత కాలం?

ఈ ఉత్పత్తుల్లో ఔషధ మోతాదులు తక్కువ. పైగా ఈ కంపెనీల ఉత్పత్తులన్నీ పురుష హార్మోన్లను పెంచే వృక్షసంబంధ ఉత్పత్తులే అయి ఉంటాయి. ఇతరత్రా దుష్ప్రభావాలు తలెత్తి న్యాయపరమైన ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ఉండడం కోసం కంపెనీలు తీసుకునే ముందు జాగ్రత్తలివి. కాబట్టి ఎటువంటి డయాగ్నొసిస్ అవసరం లేకుండా, స్వల్ప లైంగిక సమస్యలను ఎదుర్కొనే వాళ్లు మాత్రమే ఈ ఉత్పత్తులను వాడుకోడానికి అర్హులు. అలాగే డెపెండెన్సీకి గురి కాకుండా ఉండడం కోసం ఈ ఉత్పత్తులను అదే పనిగా వాడుకోకుండా రెండు నెలలకు పరిమితం చేయాలి. కొందర్లో ఈ మందులు వాడినా అంతగా ప్రభావం కనిపించకపోవచ్చు. అలాంటప్పుడు మానసికంగా కుంగిపోకుండా ఆండ్రాలజిస్టులను కలిసి తగు మోతాదుతో కూడిన మందులను వాడుకోవాలి. లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఉత్పత్తులు తాత్కాలిక ఫలితాన్ని మాత్రమే అందించగలుగుతాయి తప్ప, అంతర్లీన కారణాన్ని సరిదిద్ది సమస్యను శాశ్వతంగా నయం చేయలేవనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.

సురక్షితమైనవే.. అయినా

ఈ ఉత్పత్తులను సదరు వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేసేటప్పుడు, ఉచిత వైద్యుల కన్సల్టేషన్ అనే ఒక క్లాజ్ స్పష్టంగా పేర్కొని ఉంటుంది. కంపెనీ ప్యానల్‌లో ఒకరిద్దరు ఎమ్‌బిబిఎస్ వైద్యులు ఉండి, ఉత్పత్తులను ఆర్డర్ చేసిన కొనుగోలుదారులను వాళ్లు ఫోన్‌లో సంప్రతించి, సమస్య గురించి తెలుసుకుని తగిన ఉత్పత్తులను సూచించడం జరుగుతూ ఉంటుంది. ఈ ఉత్పత్తుల్లో ఆండ్రాలజిస్టులు శీఘ్రస్ఖలనాలకు సూచించే డెపాక్సిటీన్, టెడలాఫిల్ లాంటి ఔషధాలే ఉంటూ ఉంటాయి. వీటితో పాటు సహజసిద్ధంగా పురుష హార్మోన్ టెస్టోస్టెరాన్‌ను పెంచే మూలికా మందులు, న్యూట్రాస్యూటికల్స్ కూడా ఉంటూ ఉంటాయి. అమేజాన్‌లో కొనుగోలు చేసుకుని వాడుకుంటున్న అశ్వగంధ, శిలాజిత్తు మాదిరిగానే వీటిని కొనుగోలు చేసి వాడుకోవడం ప్రమాదకరం కాదు. లైంగిక ఆరోగ్యం పట్ల అవగాహన ఏర్పడడానికీ ఇలాంటి ప్రకటనలు తోడ్పడితే, లైంగిక సామర్థ్యం తగ్గినా వైద్యులను కలవడానికి ఇష్టపడని పురుషులకు ఇలాంటి ఉత్పత్తులు ఎంతో కొంత ఉపయోగపడతాయి అనడంలో ఎలాంటి అనుమానం లేదు. వైద్యులను కలవడానికి వెనకాడే పురుషులు వీటిని వాడుకుని కొంత ఫలితాన్ని పొందే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే ఇక్కడొక తిరకాసు ఉంది.

తప్పుదారి పట్టించవచ్చు

పురుష లైంగిక సమస్యలకు మూలకారణాలను కనిపెట్టకుండా ఇలాంటి ఉత్పత్తులను వాడుకుంటూ పోవడం ఎంతవరకూ సమంజసం? ఉదాహరణకు స్తంభన సమస్యకు ఎన్నో కారణాలుంటాయి. అలాంటి ఒక వ్యక్తి ఎదుర్కొంటున్న స్తంభన సమస్యకు రక్తనాళాలు ఇరుకుగా మారడం కారణమైతే, ఇలాంటి మందులు వాడుకోవడం వల్ల ఆ సమస్యను ప్రారంభంలో సమర్థంగా, శాశ్వతంగా సరిదిద్దే అవకాశాన్ని కోల్పోవడంతో పాటు, దీర్ఘకాలంలో ఆ సమస్య మరింత తీవ్రమై చికిత్సతో సరిదిద్దలేని స్థితికి చేరుకునే ప్రమాదం ఉంటుంది. ఇలా కొందర్లో అంతర్లీన సమస్యను ఆలస్యంగా గుర్తించడం వల్ల, అది చికిత్సకు లొంగక, పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోవచ్చు. ఇదొక కోణం. అలాగే ఈ మందులతో కొంత మేరకు సామర్థ్యం పెరగడంతో, మందులు వాడకుండా ఉండలేని డిపెండెన్సీ సమస్య కూడా కొందర్లో తలెత్తే ప్రమాదం ఉంటుంది. టెస్టోస్టెరాన్ హార్మోన్ మోతాదు తగ్గడం మూలంగా సమస్య తలెత్తిన కొందర్లో ఈ ఉత్పత్తులను అదే పనిగా వాడుకోవడం వల్ల హార్మోన్ మోతాదు విపరీతంగా పెరిగి వీర్య ఉత్పత్తి తాత్కాలికంగా తగ్గిపోవచ్చు. స్పర్శను పోగొట్టి, మొద్దుబారేలా చేసే అనస్థీషియాను పోలిన లిడోకైన్ స్ప్రేలు కూడా ఈ ఉత్పత్తుల్లో ఉంటున్నాయి. ఈ స్ప్రేతో దుష్ప్రభావాలు లేకపోయినా పిల్లల కోసం ప్రయత్నిస్తున్న వాళ్లు వీటిని వాడిన అరగంట తర్వాత, శుభ్రం చేసుకుని, పిల్లల కోసం ప్రయత్నించాలి. లేదంటే గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు.

డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
హైదరాబాద్.

అతిలోక సుందరి శ్రీదేవి... బడా నిర్మాత బోనీ కపూర్‌ల కూతురుగా... బాలీవుడ్ ఎంట్రీకి ముందు **జాన్వీ కపూర్**పై భారీ అంచనాలు ఉన్నాయి. వాటిని అందుకోవడం అంత సులువు కాదని తెలిసినా... ఆమె అభినయంపై ఎక్కుపెట్టిన విమర్శనాస్త్రాలు లెక్కకు మించాయి. 'కానీ వాటిని తట్టుకొని... మానసికంగా దృఢంగా నిలబడగలిగానంటే అందుకు క్రమం తప్పని వ్యాయామం, యోగా, ఆహార నియమాలే కారణం' అంటుంది జాన్వీ.

అభిమానుల ధడక్



ఆరేళ్ల కిందట 'ధడక్'తో బాలీవుడ్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇచ్చింది జాన్వీ కపూర్. ఆ కమర్షియల్ హిట్‌తో కుర్రకారు 'హార్ట్‌బీట్' అయింది ఈ బ్యూటీ. తరువాత అవకాశాలు క్యూ కట్టినా... అభినయానికి ఆస్కారంగల పాత్రలనే ఎంచుకొంటూ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా కథానాయిక చుట్టూ తిరిగే కథలకే ప్రాధాన్యం ఇస్తోంది. 'అలాంటి చిత్రాల్లో నటిస్తుంటే మహిళా సాధికారత సాధించిన అనుభూతి కలుగుతుంది. వైవిధ్యమైన, ప్రయోగాత్మక పాత్రలు పోషించడం ద్వారా నటనకు సంబంధించి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అన్నిటికీ మించి ప్రేక్షకులకు విభిన్న కథలు అందించడంలో ఉండే అనుభూతి వెలకట్టలేనిది' అంటున్న జాన్వీ ఇప్పటికి ఎనిమిది చిత్రాల్లో నటించింది. మంచి నటిగానూ గుర్తింపు తెచ్చుకుంది. 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్'లో అద్భుత అభినయానికి ఉత్తమ నటిగా 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి 'దేవర'లో నటిస్తోంది. తెలుగులో ఆమెకు ఇదే తొలి చిత్రం.

'నటిని కావాలని అనుకోని రోజు నాకు గుర్తు లేదు' అంటున్న జాన్వీ కుటుంబం దశాబ్దాలుగా సినీ పరిశ్రమతో మమేకమైపోయింది. తల్లితండ్రులతో పాటు అనిల్ కపూర్, సంజయ్ కపూర్, సోనమ్ కపూర్, అర్జున్ కపూర్... ఇలా జాన్వీ కుటుంబంలో అందరూ బాలీవుడ్‌లో ప్రముఖులే. ముంబయి 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లో చదివిన ఆమె... నటనే తన కెరీర్ అని చిన్నప్పుడే నిర్ణయించుకుంది. అమెరికా కాలిఫోర్నియాలోని 'లీ స్ట్రాస్‌బెర్గ్ థియేటర్ అండ్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్'లో యాక్టింగ్ కోర్సు పూర్తి చేసింది. తిరిగి వచ్చాక నటనతో పాటు క్యాట్‌వాక్‌లతో అదరగొట్టింది. ర్యాంప్‌పై నడుస్తూ... సరికొత్త ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ... నవతరం 'ఫ్యాషన్ ఐకాన్'గానూ పేరు తెచ్చుకుంది. పలు అవార్డులు గెలుచుకుంది.

ప్రతికూలతలు పక్కనపెట్టి...

అందరు సినీ వారసుల్లానే జాన్వీ కపూర్‌కు కూడా ఆరంభంలో విమర్శలు, ఎత్తిపొడుపులు ఎదుర్కోక తప్పలేదు. మొదటి చిత్రానికే ఆమె తల్లి శ్రీదేవితో పోల్చి 'ప్రతిభ లేకపోయినా తెరమీదకు వచ్చింది' అనేలా సామాజిక మాధ్యమాల్లో ఎన్నో రకాల వ్యాఖ్యలు, విమర్శలు. 'ఆరంభంలో అలాంటి వ్యాఖ్యలు చూసి చాలా బాధపడేదాన్ని. వాటి గురించే ఆలోచించేదాన్ని. కానీ ఇప్పుడు... అసలు అలాంటి నెగెటివ్ కామెంట్స్‌ను పట్టించుకోవడమే మానేశాను. పాజిటివ్ కామెంట్స్ మాత్రమే తీసుకొంటున్నాను. దానివల్ల నా మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటోంది. మనం ఏం చేసినా కొంత మంది వేలెత్తి చూపిస్తుంటారు. అది వారి నైజం. అర్థవంతమైన విమర్శలను స్వీకరించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాను. వాటి నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. ప్రతి దాంట్లో రంధ్రాన్వేషణ చేసే వారి గురించి ఆలోచించడం ఎప్పుడో మానేశాను'... అంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది జాన్వీ.

సహజ సౌందర్యం...

'సినీ తారలనగానే ఎప్పుడూ అపురూపంగా కనిపించాలనే అభిప్రాయం ఉంది. దానివల్ల ఎక్కడికి వెళ్లాలన్నా ముస్తాబు అవ్వక తప్పని పరిస్థితి. నాకు అలాంటివి నచ్చవు. జనంలో అయినా... సన్నిహితుల మధ్యనైనా... ఎలాంటి పైపూతలు లేకుండా నేను నేనుగా, సహజంగా ఉండాలనుకొంటాను. ఎవరేమనుకొంటారో అనేది అసలు పట్టించుకోను' అంటున్న జాన్వీ... నటనతో పాటు ఫిట్‌నెస్‌కు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఎందుకంటే అదే తనను నిత్యనూతనంగా ఉంచడంలో దోహదపడుతోందని అంటోంది.

వర్కవుట్ ఇలా...

కాలేజీ రోజుల్లో ఫిట్‌గా ఉండడం అంటే సన్నగా కనిపించడమనే భావన ఉండేది జాన్వీకి. 'తరువాత అర్థమైంది... మనిషి దృఢంగా ఉండడం అంటే రోజూ వ్యాయామం చేయడం, బలవర్థకమైన ఆహారం తినడం, ఆరోగ్యంగా ఉండడం అని. నా ఫిట్‌నెస్ జర్నీ చిన్న చిన్న వ్యాయామాలు, సమతుల ఆహారంతో మొదలైంది. పంచదార, జంక్ ఫుడ్ పూర్తిగా ఆపేయాల్సి వచ్చింది. క్రమంగా వర్కవుట్ పెంచుకొంటూ పోయాను. అప్పట్లో కష్టమనిపించినా... ఇప్పుడు అలవాటైపోయింది. నాకు అలియా భట్‌ను చూస్తుంటే ఎంతో ప్రేరణగా అనిపిస్తుంది. పాత్రల ఎంపిక, వాటి కోసం ఆమె పడే తపన నిజంగా అభినందనీయం. ఇక ఫిట్‌నెస్‌లో స్ఫూర్తి మా చాచా అనిల్ కపూర్. 66 ఏళ్ల వయసులో కూడా యువకుడిలా కనిపించడం ఆయనకే సాధ్యం'... ఇదీ జాన్వీ మాట. ఒకప్పుడు బొద్దుగా ఉన్న ఈ ముద్దుగుమ్మ కఠోరంగా శ్రమించి నాజూకు బొమ్మగా తయారైంది.

వర్కవుట్ ఇలా...

జాన్వీ కపూర్ రోజువారీ వ్యాయామాల్లో కార్డియో, స్ట్రెంత్ ట్రైనింగ్, యోగా ఉంటాయి.

- ఉదయం ముందుగా రన్నింగ్, సైక్లింగ్ లేదంటే డ్యాన్స్‌తో కూడా 45 నిమిషాల కార్డియో సెషన్. దీనివల్ల అదనపు కేలరీలు కరుగుతాయి.
- స్క్వాట్స్, పుషప్స్, లంగెస్, వెయిట్ లిఫ్టింగ్ తదితర వ్యాయామాలు. వీటివల్ల శరీర సామర్థ్యం పెరుగుతుంది.
- తరువాత యోగా సెషన్. దీంతో శరీరం ఫ్లెక్సిబుల్‌గా తయారవుతుంది.
- కాసేపు ధ్యానం. ఇది ఒత్తిడులను దూరం చేస్తుంది. మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను ఇస్తుంది.

ఇదీ మెనూ...

ఆరోగ్యకరమైన, పోషక విలువలు, పిండి పదార్థాలుగల సమతుల ఆహారం జాన్వీ మెనూలో ఉంటుంది.

- ఉదయం లేవగానే నిమ్మరసం, తేనె కలిపిన గ్లాసుడు గోరువెచ్చటి నీరు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు, బ్రెడ్ టోస్ట్, గ్రీన్ టీ
- మధ్యాహ్న భోజనంలో గ్రిల్డ్ చికెన్ లేదా వెజిటబుల్స్, బ్రౌన్ రైస్‌తో ఫిష్.
- సాయంత్రం స్నాక్స్‌గా ఫ్రూట్ స్మూతీ, బాదం, పిస్తా, జీడిపప్పు.
- డిన్నర్‌కు సూప్, గ్రిల్డ్ ఫిష్ లేదా చికెన్, సలాడ్.

అంతేకాదు... శరీరం డీహైడ్రేట్ కాకుండా తరచూ మంచినీళ్లు తాగుతుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, సుగర్ డ్రింక్స్‌కు దూరంగా ఉంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తుంది.

కొందరికి అజీర్తి ఎప్పుడూ ఉంటుంది. దీని వల్ల వారు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అలాంటి వారు ఈ క్రింది ఆహార పదార్థాలు తింటే మంచిదని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. అవేమిటో చూద్దాం..

అజీర్తికి ఆయుర్వేదం చిట్కాలు!

1

బాదంపప్పు

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం బాదంపప్పులకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. వీటిలో అజీర్తిని తగ్గించే గుణం ఒకటి. కేవలం అజీర్తి తగ్గించటమే కాకుండా నాడీ వ్యవస్థను ఉత్తేజపరచటంలో బాదంపప్పు ప్రముఖ పాత్ర వహిస్తుంది. అందువల్లే ప్రతి రోజు ఉదయం నానబెట్టిన బాదం పప్పులను తినమని ఆయుర్వేద వైద్యులు సలహా ఇస్తూ ఉంటారు.

2

తగినంత నూనె

ఆహారంలో తగినంత నూనె, కొవ్వులు లేకపోతే అజీర్తి చేసే అవకాశముంది. అందువల్ల ఆహారంలో నూనెలను తప్పనిసరిగా ఒక భాగం చేయాలి. నువ్వుల నూనె, నెయ్యి, ఆలివ్ నూనెలను తగిన మోతాదుల్లో తీసుకుంటే అజీర్తి సమస్య దూరం అవుతుంది. చాలా ప్రాంతాల్లో అజీర్తి సమస్య నివారణకు ఆముదాన్ని వాడతారు.

3

పళ్లు

బాగా ముగ్గిన అరటిపళ్లు, యాపిల్స్ బొప్పాయి వంటి వాటి వల్ల అజీర్తి దూరం అవుతుంది. సాధారణంగా పళ్లను ఆహారాన్ని తినే ఒక గంట ముందు కానీ తిన్న ఒక గంట తర్వాత కానీ తీసుకోవాలి.

ఇంటింటి చిట్కాలు

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం వాతదోషం వల్ల అజీర్తి కలుగుతుంది. ప్రతి ఇంట్లో ఉపయోగించే వెల్లుల్లి, ఉప్పుల వల్ల అజీర్తి చాలా వరకు తగ్గుతుంది. ఇంగువ వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉంటాయి.



బరువు తగ్గటానికి కృతి పాఠాలు!

బరువు ఎవరికైనా శారీరకంగానే కాదు.. మానసికంగా కూడా బరువే! అయితే దాన్ని అధిగమించినప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారు. అలాంటి వ్యక్తే ఫరీదాబాద్‌కు చెందిన కృతి గుప్తా. 27 ఏళ్ల వయస్సున్న కృతి వృత్తిపరంగా ఒక లాయర్. అయితే ఆమెకు బరువు ఒక శాపంగా మారింది. దీని నుంచి బయటపడటానికి ఆమె కొన్ని మార్గాలన్వేషించింది.. పది నెలల్లో 40 కేజీల బరువు తగ్గింది. ఈ క్రమంలో ఆమె నేర్చుకున్న పాఠాలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. ఆ పాఠాలేమిటో మనం తెలుసుకుందాం.



బాడీ పాజిటివిటీ

మనం ఎలాంటి షేప్‌లో ఉన్నా- అందంగా, ఆరోగ్యంగా ఉన్నామనుకుంటాం. ఆరోగ్యంగా ఉన్నామనే భావనను బలోపేతం చేసుకుంటూ జీవితంలో ముందుకు వెళ్లిపోతాం. దీని వల్ల కలిగే దుష్పరిణామాలను గాలికి వదిలేస్తాం. కొన్ని సార్లు మార్పు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినా- కొద్దిగా కష్టం అనిపించినా వదిలేస్తాం. అలా కాకుండా ఒకో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్లినప్పుడు లక్ష్యం చేరుకుంటాం. ఉదాహరణకు కృతికి నడక మొదలుపెట్టిన మొదట్లో విపరీతమైన ఆయాసం వచ్చేది. "ఆ సమయంలో నేను ఆగలేదు. ప్రతి రోజు నడుస్తూనే ఉండేదాన్ని. దీని వల్ల క్రమంగా వేగం పెరిగింది. ఆయాసం తగ్గింది. అంతే కాదు.. ఫిట్‌గా ఉండటం తెలిసిన తర్వాత- గతంలో నేనెంత అన్‌ఫిట్‌గా ఉన్నానో అర్థమయింది" అంటారు కృతి.

సరైన అవగాహన

చాలా సందర్భాలలో ఏదైనా పని ప్రారంభించే ముందు- ఆ పని గురించి సరైన అవగాహన ఉండదు. దీని వల్ల ఆ పని సగంలోనే ఆగిపోతుంది. కానీ కృతి తాను చేరుకోవాలనుకొన్న లక్ష్యం గురించి.. దానికి ఏ మార్గంలో ప్రయాణించాలనే విషయం గురించి స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకుంది. ఈ క్రమంలో కొన్ని తప్పులు చేసింది. కానీ వాటిని సరిదిద్దుకుంది. దీని వల్ల ఒకప్పుడు వంద మీటర్లు కూడా నడవలేని కృతి ప్రస్తుతం 21 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొంటోంది.

ఏ ఇద్దరూ ఒకటి కాదు..

ప్రతి వ్యక్తి శరీరం తీరు.. దాని అవసరాలు భిన్నంగా ఉంటాయి. బరువు తగ్గాలంటే- మన శరీరానికి తగిన ఆహారం తీసుకోవాలి. తగిన వ్యాయామం చేయాలి. ఇవి జరగనంత కాలం లక్ష్యం చేరుకోలేం. కృతి ఈ విషయాన్ని ముందే గ్రహించింది. ముందు తన శరీరం పనితీరుపై అవగాహన ఏర్పరుచుకుంది. దానికి తగిన రీతిలో ఆహారాన్ని తీసుకుంది. ఫిట్‌గా అయింది.

పర్మనెంట్ బ్యూటీ

ముఖంలోని కొన్ని లోపాలను మేకప్‌తో తాత్కాలికంగా దాచుకోవచ్చు. అవే లోపాలను మేకప్‌తో పని లేకుండా దీర్ఘకాలం పాటు దాచగలిగే చికిత్స 'పర్మనెంట్ మేకప్'. ఈ మేకప్ మతలబులు ఇవే!

మేకప్

అందమైన కనుబొమల కోసం...

కనుబొమలకు ఆకర్షణీయమైన ఆకృతిని అందించడంతో పాటు, ఒత్తుగా కనిపించేలా చేయడం కోసం ఉద్దేశించిన బ్రోషేపింగ్ ఇది. కొందరి కనుబొమలు పలుచగా ఉంటాయి. ఇంకొందరికి ఆకృతి లేకుండా ఉంటాయి. ఇలాంటి వాళ్ల కనుబొమలను మైక్రో పిగ్మెంటేషన్ సహాయంతో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. కనుబొమల్లో టాటూ ఇంకుతో వెంట్రుకల రూపంలో స్ట్రోక్స్ ఇవ్వడం ద్వారా సహజసిద్ధ వెంట్రుకలను తలపించేలా చేయవచ్చు.

పెదవులను తీర్చిదిద్దడం కోసం...

పింక్ లిప్స్ కోరుకునేవాళ్లు, నల్లని పెదవులున్నవాళ్లు, సగం తెలుపు రంగు పెదవులు కలిగి ఉన్నవాళ్లు పర్మనెంట్ లిప్‌స్టిక్‌ను ఎంచుకోవచ్చు. దీన్లో రంగులను ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే రంగు వేసిన తర్వాత తొలగించుకోవడం కష్టం కాబట్టి ఒకటికి రెండు సార్లు ఆలోచించి, రంగును ఎంచుకోవాలి. ఈ రంగు కూడా రెండు నుంచి మూడేళ్లకు వెలిసిపోతుంది. కాబట్టి మళ్లీ టచప్స్ అవసరమవుతాయి. రంగు ఇంక్‌ను ఇంజెక్ట్ చేయడం కోసం పెదవుల మీద ఎక్కువసార్లు గుచ్చడం జరుగుతుంది. కాబట్టి చికిత్స తర్వాత పెదవులు వాచే అవకాశాలుంటాయి. ఈ వాపు వారంలో తగ్గిపోతుంది. రెండు నుంచి మూడు వారాల తర్వాత అవసరమైతే రెండోసారి టచప్ కూడా చేయవలసి ఉంటుంది. ఈ చికిత్సతో లిప్ కలర్‌తో పాటు లిప్ లైన్ కూడా మెరుగు చేసుకోవచ్చు.

కనురెప్పలకు ఐ లైనర్...



పర్మనెంట్ ఐలైనర్ కూడా వేయించుకోవచ్చు. ఇందు కోసం నలుపు పిగ్మెంట్‌నే ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఈ చికిత్స ఎంతో సున్నితమైన కంటికి దగ్గరగా సాగుతుంది. కాబట్టి అనుభవజ్ఞులైన వైద్యులను ఎంచుకోవాలి. ఐ లైన్ పొడవు, వెడల్పులను కూడా ముందుగానే కచ్చితంగా అంచనా వేసి, పర్మనెంట్ ఐలైనర్ వేయించుకోవాలి.

స్కాల్ప్ మైక్రో పిగ్మెంటేషన్


కొందరికి నుదుటి దగ్గర హెయిర్ లైన్ తరిగిపోతూ ఉంటుంది. వెంట్రుకలు ఒత్తుగా తలపించేలా చేసే పౌడర్లు, స్ప్రేలు అందుబాటులో ఉన్నప్పటికీ పర్మనెంట్ మేకప్‌తో ఎక్కువ కాలం పాటు ఆ ప్రభావాన్ని పొందే వీలుంటుంది. నుదుటి దగ్గరి వెంట్రుకలు పలుచబడినప్పుడు పర్మనెంట్ మేకప్‌లో భాగంగా వెంట్రుకలను తలపించేలా ఆ ప్రదేశాన్ని రంగుతో నింపుకోవచ్చు.

కొరియన్ బిబి గ్లో

ఇది బ్లెమిష్ బామ్. మచ్చలను చర్మంలో కలిసిపోయేలా చేసి, మెరుపును తెచ్చిపెట్టే చికిత్స. ఈ చికిత్సలో చర్మపు రంగుకు దగ్గరగా ఉండే పిగ్మెంటును ఉపయోగిస్తారు కాబట్టి ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. ఈ చికిత్సలో బిబి క్రీమ్‌ను అప్లై చేసి, డెర్మా పెన్ ద్వారా ఆ క్రీమ్‌ను చర్మం పైపొరల్లోకి చొప్పించడం జరుగుతుంది. ఈ చికిత్స ఫలితం ఏళ్ల తరబడి ఉండదు. కొన్ని వారాలు, నెలల్లోనే మెరుపు తగ్గడం మొదలుపెడుతుంది. కానీ ఈ చికిత్సకు సంబంధించిన దీర్ఘకాల ప్రభావాలు, దుష్ప్రభావాల గురించిన శాస్త్రీయ ఆధారాలు ఇంకా అందుబాటులో లేవు. కాబట్టి ఈ చికిత్సను ఆశ్రయించేవారు ఆచితూచి అడుగులేయడం ఉత్తమం. ఈ చికిత్సలో భాగంగా పిగ్మెంట్‌ను చర్మం అడుగుకి ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది.

వీళ్లు అప్రమత్తం

కొంతమందికి కిలాయిడ్ టెండెన్సీ, స్కారింగ్ టెండెన్సీ ఉంటుంది. ఇలాంటి వాళ్లకు ఆ ప్రదేశంలో కండ పెరగడం లేదా మచ్చ ఏర్పడడం జరుగుతుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు పర్మనెంట్ మేకప్‌కు దూరంగా ఉండాలి. గాయం మానడంలో సమస్యలను ఎదుర్కొనేవాళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి. కొందరికి కనెక్టివ్ టిష్యూ డిజార్డర్లు ఉంటాయి. వాళ్లకు రియాక్షన్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. అలాగే సున్నిత చర్మం కలిగిన వాళ్లు, అలర్జీ తత్వం కలిగిన వాళ్లు కూడా దీనికి దూరంగా ఉండడమే ఉత్తమం.



డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.

దుష్ప్రభావాలు లేకుండా...

పర్మనెంట్ మేకప్‌తో దుష్ప్రభావాలు లేకుండా ఉండాలంటే అనుభవజ్ఞులైన డెర్మటాలజిస్ట్‌తో చేయించుకోవాలి. నాణ్యమైన ఇంకు వాడకపోయినా, చికిత్సలో ఉపయోగించే నీడిల్స్ అశుభ్రంగా ఉన్నా ఇన్‌ఫెక్షన్లకు, రియాక్షన్లకూ ఆస్కారం ఉంటుంది. ఇంకు నాణ్యత తక్కువగా ఉంటే, అది తక్కువ కాలంలోనే వెలిసిపోయే అవకాశాలు కూడా ఉంటాయి. అలాగే పిగ్మెంట్ రంగు కచ్చితంగా చర్మానికి నప్పినప్పుడే ఆకర్షణీయంగా కనిపిస్తాం. కాబట్టి ఈ విషయంలో కూడా పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి.


ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 15 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



చిరు విరామం

సినిమా షూటింగ్స్‌కు చిరంజీవి చిన్న బ్రేక్ ఇచ్చారు. శ్రీమతి సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్తున్నాను. తిరిగిరాగానే 'విశ్వంభర' చిత్రీకరణలో పాల్గొంటాను. అందరికీ ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'విశ్వంభర' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. 'బింబిసార' ఫేం వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. భారీ సెట్స్‌లో ఇటీవలే కీలక ఘట్టాలను తెరకెక్కించారు. చిరంజీవి తిరిగిరాగానే మరో షెడ్యూల్ ప్రారంభించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. 'విశ్వంభర'కు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

టైటిల్ ట్రాక్‌తో హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి నాయుడు నిర్మించారు. సుధీర్ బాబు సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'హరోం హర' అంటూ సాగే టైటిల్ ట్రాక్‌ను యూనిట్ బుధవారం విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించింది. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 1980ల్లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని యూనిట్ తెలిపింది. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

భామతో బచ్చన్



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' అనేది ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి రవితేజ, భాగ్యశ్రీ బోర్సే రొమాంటిక్ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయని చిత్రబృందం తెలిపింది. ఇటీవలే కారంపూడిలో ఓ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. ఈ చిత్రానికి మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.

పుల్వామా అమరవీరులకు నివాళులు



వరుణ్‌తేజ్ తొలిసారిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మానుషి చిల్లర్ ఇందులో రాడార్ ఆఫీసర్‌గా, రుహానా శర్మ మరో కీలక పాత్రలో నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారత భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న వాహనాల కాన్వాయ్‌పై జరిగిన ఉగ్ర దాడిలో నలభై మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. పుల్వామా స్మారక ప్రదేశాన్ని హీరో వరుణ్‌తేజ్, మానుషి సహా 'ఆపరేషన్ వాలెంటైన్' టీమ్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాల స్ఫూర్తితో వాస్తవ సంఘటనల ప్రేరణతో రూపొందిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

వేసవిలో శశివదనే

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన గ్రామీణ ప్రేమ కథా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ్ బెల్లంకొండ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రేమికులుగా రక్షిత్, కోమలి జంట ఆకట్టుకుంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ ఆ పోస్టర్‌కు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్. సినిమాటోగ్రఫీ: శ్రీ సాయికుమార్ దారా



వినోదం.. అంతకుమించి

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' విడుదల కోసం తుది మెరుగులు దిద్దుకుంటోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. మొదటి భాగంలో రాధికతో ప్రేమ కారణంగా ఇబ్బందులు తెచ్చుకున్న టిల్లు ఇప్పుడు మరోసారి అదే తరహాలో సమస్యల సమూహంలో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అనుపమ లుక్స్‌తో పాటు ఆమె బాడీ లాంగ్వేజ్, సిద్ధుతో ఆమె కెమిస్ట్రీ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. కథకు సంబంధించిన అంశాలను ఎక్కువగా వెల్లడించకుండా .. ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఆసక్తి కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా మొదటి భాగాన్ని మించి సీక్వెల్ ఉంటుందనే నమ్మకాన్ని ట్రైలర్‌తో కలిగించారు దర్శకుడు మల్లిక్ రామ్. రామ్ మిరియాల పాటలకు స్వరాలు అందించగా, సంగీత దర్శకుడు తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు.




తండ్రీ కొడుకుల కథ



నటుడు ధన్‌రాజ్ దర్శకత్వంలో సముద్రఖని ముఖ్యపాత్రలో నటిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రభాకర్ అరిపాక సమర్పణలో పృథ్వీ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా 'రామం రాఘవం' చిత్రం గ్లింప్స్‌ను హీరో రామ్ పోతినేని, దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ఈ చిత్రంలో శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శివ ప్రసాద్ యానాల కథను సమకూర్చగా, అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మార్తాండ్ కే వెంకటేశ్

8 వసంతాల ప్రేమ





'మధురం' ఫేం ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం ప్రకటించింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు. ఎనిమిది సంవత్సరాలలో ఓ అందమైన యువతి జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. దీనికి '8 వసంతాలు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

భామా కలాపం 2లో అన్నీ డబుల్ ఉంటాయి



ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామా కలాపం 2' వెబ్ సిరీస్ ఈ నెల 16 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను బాపినీడు, సుధీర ఈదర నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో ప్రియమణి మాట్లాడుతూ 'ఇందులో అన్నీ డబుల్ ఉంటాయి. థ్రిల్స్, ట్విస్టులతో పాటు కాస్త డేంజర్ కూడా ఉంది. ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. మహిళ తలుచుకుంటే ఏదైనా చేయగలదు అని చెబుతున్నాం' అన్నారు. మొదటి పార్ట్ చూసి రెండో పార్ట్ చూస్తే ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారని దర్శకుడు అభిమన్యు చెప్పారు. ఇందులో తనకు జుబేదా పాత్ర ఇచ్చిన దర్శకుడికి సీరత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సిరీస్ కోసం ఎంతో కష్టపడ్డామని మరో నటి శరణ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహా బిజినెస్ హెడ్ వాసు, ఎడిటర్ విప్లవ్ కూడా పాల్గొన్నారు.

రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా

'ఈ సినిమాను మొదట 'అమరావతి టైమ్స్' పేరుతో తీశాం. కానీ సెన్సార్‌కు వెళ్లినప్పుడు ఫిక్షనల్ స్టోరీ అయితేనే సెన్సార్ చేస్తామని అధికారులు చెప్పారు. వారు చెప్పిన ప్రకారం మార్పులు చేసి, టైటిల్‌ను కూడా 'రాజధాని ఫైల్స్' అని మార్చాం. దీని వల్ల అదనంగా ఖర్చు అయి, బడ్జెట్ కూడా పెరిగింది' అని చెప్పారు దర్శకుడు భాను. ఆయన రూపొందించిన 'రాజధాని ఫైల్స్' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

- 'ఇది రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా. ప్రజల ఆవేదనను చూపించే ప్రయత్నం చేశాం. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని నమ్మి తమ భూములు ఇచ్చారు. మరో ప్రభుత్వం వచ్చి వారిపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతోంది. ప్రజలు నవ్వింది ప్రభుత్వాన్ని కానీ పార్టీలను కాదు. ఈ అంశాన్నే సినిమాలో చూపించాం. రైతులు పడిన ఇబ్బందులు, మానసిక సంఘర్షణ, వారిని ఇబ్బంది పెట్టే వ్యక్తులు, న్యాయం కోసం రైతులు చేసే పోరాటం.. ఇవే సినిమాలో అంశాలు' అని స్పష్టం చేశారు భాను.
- చిత్రీకరణ సమయంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి ఒత్తిళ్లు రాలేదని చెబుతూ 'అమరావతికి వెళ్లి అక్కడి బాధిత రైతులతో ఈ సినిమా చేశాం. వాస్తవ సంఘటన ఆధారంగా సినిమా తీస్తున్నప్పుడు ఆ సంఘటనను ఎదుర్కొన్న వారే అందులో నటించడం చాలా అరుదు. మా సినిమాలో బాధితులే తమ పాత్రలను పోషించారు' అని ఆయన తెలిపారు.



దర్శకుడు భాను

- ఈ కథను ఎన్నుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ 'నిర్మాత రవిశంకర్‌గారు ఇలాంటి అంశంతో సినిమా చేయాలని అడిగినప్పుడు మొదట భయపడ్డాను. రిస్క్ తీసుకోవడానికి నిర్మాతే సిద్ధంగా ఉన్నప్పుడు వెనకడుగు వేయడం ఎందుకని అంగీకరించాను. అమరావతి రైతులను కలిశాను. వారు పడిన ఇబ్బందుల్ని వింటుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. వారు పడిన మానసిక క్షోభను చిత్రంలో చూపించాం. తొలి కాపీ చూసిన తర్వాత జీవితానికి ఇది ఒక్కటి చాలు అనిపించింది. ప్రజలందరికీ నచ్చే సినిమా అవుతుంది' అన్నారు.
- సినిమాలో రైతు ప్రతినిధిగా వినోద్‌కుమార్, రైతు భార్యగా వాణీ విశ్వనాథ్ నటించారనీ, మణిశర్మ అద్భుతమైన సంగీతాన్ని అందించారనీ దర్శకుడు భాను తెలిపారు.

అమ్మాయిలు ఇచ్చే షాక్.. అదే మెడిసిన్!



ఒక తెలుగు యువతి హీరోయిన్‌గా నటించడం, ఆ సినిమాకు ఆమె కథకురాలు, నిర్మాత కావడం అరుదు. 'డియర్ ఉమ' చిత్రంతో సుమయ రెడ్డి ఇలా తన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్నారు. పృథ్వీ అంబర్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'డియర్ ఉమ' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇదొక ప్రేమ కావ్యం అని టీజర్ చూశాక అనిపించింది. ప్రేమ ఇచ్చే సంతోషాన్ని, బాధను అద్భుతంగా మలిచిన భావన కలుగుతుంది. 'నా క్షణాల్లో జీవం నీ కళ్లు.. నా నరాల్లో ప్రవాహం నీ చూపు', 'ప్రేమ అనేది ఓ అనిర్వచనీయమైన నిర్వచనం', 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు.. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది. అమ్మాయిలు ఇచ్చే షాకులకు అబ్బాయిలకు ఇదే సరైన మెడిసిన్'..వంటి డైలాగులు సినిమాలో డెప్త్‌ను చాటాయి. అందమైన ప్రేమ కథాచిత్రంగా రూపుదిద్దుకున్న 'డియర్ ఉమ' షూటింగ్ పూర్తయిందనీ, త్వరలో విడుదల చేస్తామనీ దర్శకనిర్మాతలు చెప్పారు.

కాలం రాసిన ఆరు కథలు



సాగర్, వికాస్, అభిలాష్, రోహిత్, రవితేజ, హరి, శ్రుతి శంకర్, నిహారికా చౌదరి, ఉమ, హన్విక, పల్లవి రేష్మ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎస్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ విడుదల చేశారు. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్, జానర్‌లో ఈ చిత్రం రూపొందడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. మనం ఏదో అవుదామని వస్తే మరేదో అవుతాం. దానిని బట్టే జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ ఈ చిత్రానికి మంచి టైటిల్ ఎన్నుకోవడంలోనే సగం విజయం సాధించారు. పలు కథలను కలిపి సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ ప్రేమకథలో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. మొత్తం కలసి ఆరు కథలు ఇందులో ఉంటాయి. సహజత్వానికి దగ్గరగా ఉంటుందని కొత్త తారలతో తీశాం. మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తయింది. అందరినీ అలరించే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

కృత్రిమ మేధతో కొలువులకు ఢోకా లేదు

2026 నాటికి 10 లక్షల ఉద్యోగాలు



టెక్ మహీంద్రా మాజీ సీఈఓ సీపీ గుర్నానీకి జీవితకాల సాఫల్య పురస్కారం అందజేస్తున్న హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు, చిత్రంలో జయేశ్ రంజన్, రాజన్న తదితరులు

» టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయన్న భయాలను టీసీఎస్ (టెక్నాలజీ, సర్వీసెస్ అండ్ సాఫ్ట్‌వేర్) ప్రెసిడెంట్ వీ.రాజన్న తోసిపుచ్చారు. వచ్చే రెండేళ్లలో ఈ రంగంలో 10 లక్షల కొత్త కొలువులు ఏర్పడతాయన్నారు. అయితే ఇందుకోసం అభ్యర్థులు, ఉద్యోగులు కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవాల్సి ఉంటుందన్నారు. బుధవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన 'ఏఐ:సెలబ్రేటింగ్ ది ఫ్యూచర్' సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. వచ్చే కొద్ది సంవత్సరాల్లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 39.4 శాతానికి చేరుతుందని కూడా రాజన్న చెప్పారు.

ఏఐ ఓ అవకాశం: గుర్నానీ

ఈ సదస్సులో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అందుకున్న టెక్ మహీంద్రా మాజీ సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీ మాట్లాడుతూ.. 'ఏఐ ఒక అవకాశం' అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరేసరికి, ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 50,000 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటనను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

వృద్ధికి అపార అవకాశాలు

మన దేశంలో ఏఐ ఆధారిత పరిశ్రమల వృద్ధికి ఢోకా లేదని సదస్సులో పాల్గొన్న సైయెంట్ సీఈఓ కార్తీక్ నటరాజన్ అన్నారు. గత ఏడాది చివరి నాటికి మన దేశంలో ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 15,000 కోట్ల డాలర్లకు చేరిందన్నారు. 2023-2030 మధ్య కాలంలో ఏఐ ఆధారిత పరిశ్రమల సగటు వార్షిక వృద్ధి రేటు 36.8 శాతం వరకు ఉంటుందని తెలిపారు. ఏఐతో నవకల్పనలు, ఆర్థిక అవకాశాలు అపారంగా పెరుగుతాయని నటరాజన్ తెలిపారు. ఈ సదస్సులో హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు, ఎస్‌టీపీఐ హైదరాబాద్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎండీసీ లాభంలో 62% వృద్ధి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,469.73 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.903.89 కోట్లు)తో పోల్చితే లాభం 62 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయాలు కూడా రూ.3,924.75 కోట్ల నుంచి రూ.5,746.47 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.2,693.01 కోట్ల నుంచి రూ.3,516.78 కోట్లకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ఆమోదించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఫిబ్రవరి 27ను ఖరారు చేసింది.

హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి గోద్రెజ్ ప్రాపర్టీస్

రూ.350 కోట్లతో 12.5 ఎకరాల కొనుగోలు

» ప్రీమియం, లగ్జరీ నివాస గృహ ప్రాజెక్ట్ అభివృద్ధి



న్యూఢిల్లీ: ప్రముఖ రియల్టీ కంపెనీ గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్.. హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం రాజేంద్రనగర్ ప్రాంతంలో 12.5 ఎకరాలు కొనుగోలు చేసింది. ఈ భూమిని ఎంతకు కొన్నదీ కంపెనీ వెల్లడించలేదు. అయితే ఈ లావాదేవీ విలువ రూ.350 కోట్ల వరకు ఉంటుందని పరిశ్రమ వర్గాల అంచనా. ఈ వెంచర్ ద్వారా ప్రీమియం, లగ్జరీ నివాస గృహాలు నిర్మించాలని కంపెనీ భావిస్తోంది. గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి ప్రవేశించడం ఇదే తొలిసారి.

రూ.3,500 కోట్ల ఆదాయం: ఈ ప్రీమియం, లగ్జరీ నివాస గృహాల ప్రాజెక్టు ద్వారా రూ.3,500 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని గోద్రెజ్ ప్రాపర్టీస్ అంచనా. ఈ వెంచర్ ద్వారా 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రీమియం, లగ్జరీ అపార్ట్‌మెంట్లు నిర్మించాలని కంపెనీ యోచిస్తోంది. ముందు ముందు కూడా హైదరాబాద్ తమకు కీలక మార్కెట్ కానుందని కంపెనీ తెలిపింది. దేశంలోని కీలక నగరాల్లో మా ఉనికిని బలోపేతం చేయాలనుకుంటున్నామని, ఆ వ్యూహంలో భాగంగానే హైదరాబాద్‌లో ఈ భూమి కొనుగోలు చేసినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఎండీ, సీఈఓ గౌరవ్ పాండే తెలిపారు.

చెల్లింపులు నిలిపివేయండి

వీసా, మాస్టర్‌కార్డ్‌కు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు పగ్గాలు బిగించిన తరహాలోనే అంతర్జాతీయ పేమెంట్ దిగ్గజాలు వీసా, మాస్టర్‌కార్డ్‌పై కూడా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆంక్షలు విధించింది. కేవైసీ నిబంధనలు పాటించడంలేదన్న కారణంగా చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు చేసే కార్డు ఆధారిత చెల్లింపులను నిలిపివేయాలని ఆ సంస్థలు రెండింటినీ ఆర్‌బీఐ ఆదేశించింది. ఆర్‌బీఐ ఫిబ్రవరి 8వ తేదీన జారీ చేసిన ఆ నోటీసు తమకు అందిందన్న విషయం వీసా ధ్రువీకరించగా మాస్టర్‌కార్డ్ ఇంకా స్పందించాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై నియంత్రణాపరమైన చర్యలు తీసుకున్న నేపథ్యంలోనే ఈ పరిణామం కూడా చోటు చేసుకోవడం విశేషం. దీని వల్ల ఒక వ్యాపార సంస్థ వద్ద చేసిన లావాదేవీని మరో వ్యాపార సంస్థ వద్ద ఆథరైజ్ చేసే సదుపాయం తాత్కాలికంగా నిలిచిపోతుంది. అయితే వాణిజ్య, బిజినెస్ చెల్లింపుల విభాగంలో ఉన్న బిజినెస్ పేమెంట్ సొల్యూషన్ ప్రొవైడర్లందరినీ (బీపీఎస్‌పీ) వారి వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన వివరాలందించాలని ఆర్‌బీఐ కోరుతున్నట్టుగా కనబడుతున్నదని వీసా ప్రతినిధి ఒకరన్నారు. తాము ఈ అంశంపై ఆర్‌బీఐతో సంప్రదింపులు జరుపుతున్నామని, అలాగే తమ భాగస్వాములందరినీ నిబంధనలకు కట్టుబడాలని కోరుతున్నామని ఆయన చెప్పారు. దీనిపై బీపీఎస్‌పీలు మరింత స్పష్టత ఇవ్వాల్సిఉంటుందని వీసా కంపెనీ చెబుతోంది. ఇదిలా ఉండగా వ్యాపార చెల్లింపులు నిలిపివేయాల్సిందిగా కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలకు కూడా నోటీసులు అందినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల అద్దె, ట్యూషన్ ఫీజు చెల్లింపులకు అంతరాయం కలగవచ్చన్న భయం వారు వ్యక్తం చేశారు. క్రెడ్, పేటీఎం, నోబ్రోకర్ వంటి ఫిన్‌టెక్‌లు కమర్షియల్, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా రెంట్, ట్యూషన్ ఫీజుల చెల్లింపును అనుమతిస్తున్నాయి.

తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.192 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.232 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ మాత్రం రూ.938 కోట్ల నుంచి రూ.1,545 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో సెనెక్సీ ఫలితాలను చేర్చటంతో లాభదాయకత పెరిగిందని, దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసిక ఫలితాలను సరిపోల్చలేమని కంపెనీ పేర్కొంది. 2022 నవంబరులో సెనెక్సీ గ్రూప్‌ను గ్లాండ్ ఫార్మా 12 కోట్ల యూరోలకు కొనుగోలు చేసింది.

నాట్కో లాభంలో మూడింతల వృద్ధి

క్యూ3లో రూ.213 కోట్లుగా నమోదు

హైదరాబాద్: నాట్కో ఫార్మా లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా మూడింతలు వృద్ధి చెంది రూ.212.70 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.62.3 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో రెవెన్యూలు గణనీయంగా పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని నాట్కో వెల్లడించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.492.5 కోట్ల నుంచి రూ.758.6 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.431.90 కోట్ల నుంచి రూ.539.30 కోట్లకు పెరిగినట్లు నాట్కో పేర్కొంది.

కాగా డిసెంబరు త్రైమాసికంలో ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.333.70 కోట్ల నుంచి రూ.605.60 కోట్లకు పెరగగా దేశీయ ఫార్ములేషన్స్ ఆదాయాలు మాత్రం రూ.101.10 కోట్ల నుంచి రూ.99.4 కోట్లకు తగ్గినట్లు నాట్కో తెలిపింది. త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.25 మధ్యంతర డివిడెండ్‌ను ఇచ్చేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

3 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో జనవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 0.27 శాతానికి దిగివచ్చింది. ఇది మూడు నెలల కనిష్ఠ స్థాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ఇది నెగిటివ్ జోన్‌లో ఉండి నవంబరు నెలలో ఒక్కసారిగా 0.39 శాతానికి దూసుకుపోయింది. గత ఏడాది జనవరిలో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 4.8 శాతం ఉండగా గత డిసెంబరులో 0.73 శాతం ఉంది. డిసెంబరుతో పోల్చితే జనవరిలో ఆహార ద్రవ్యోల్బణం 9.38 శాతం ఉంచి 6.85 శాతానికి దిగివచ్చింది. ఇదే విభాగంలోని కూరగాయల ధరల్లో పెరుగుదల 26.3 శాతం నుంచి 19.71 శాతానికి దిగివచ్చింది. బంగాళాదుంప, పండ్లు, గుడ్లు, పాలు, చేపలు అన్నింటి ధరలూ తగ్గాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,180 ▼	57,000 ▼	75,500 ▼
ముంబై	61,590 ▼	56,416 ▼	69,150 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ		విజయవాడ	536
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
15వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	603		
గోదావరి	536	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	125
విశాఖపట్నం	122		

లాభాల్లోనే స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 268 పాయింట్లు అప్

ముంబై: ద్రవ్యోల్బణ గణాంకాలు అందించిన ఊరటతో పాటు చివరి గంట కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్ వరుసగా రెండో రోజున కూడా లాభాల్లో ముగిసింది. వాస్తవానికి నష్టాల్లో ప్రారంభమై ఇంట్రాడేలో 71,822.83 వరకు దిగజారిన సెన్సెక్స్ ఆ నష్టాలను పూడ్చుకుని 267.64 పాయింట్ల లాభంతో 71,822.83 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.80 పాయింట్లు లాభపడి 21,840.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ 4.24 శాతం లాభంతో అగ్రగామిగా నిలిచింది.

రేపు ఎస్కోనెట్ ఇష్యూ ప్రారంభం: ఐటీ సిస్టమ్ ఇంటిగ్రేటర్ ఎస్కోనెట్ టెక్నాలజీస్ ఐపీఓ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇష్యూలో షేరు ధర శ్రేణిని రూ.80-84గా కంపెనీ ప్రకటించింది. బుక్ బిల్డింగ్ విధానంలో రూ.10 ముఖ విలువ గల 33,60,000 షేర్లను జారీ చేయనుంది.

రూ.20 లక్షల కోట్ల శిఖరంపై రిలయన్స్

బుధవారం నాడు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు 1.15 శాతం లాభపడి రూ.2,962.60 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లకు పైన స్థిరపడింది. మంగళవారం ఆర్ఐఎల్ ఇంట్రాడేలో ఈ మైలురాయిని దాటినప్పటికీ ముగింపు సమయానికి అంతకన్నా దిగువనే క్లోజైంది. బుధవారం ఆ మైలురాయిని దాటడంతో ఆర్ఐఎల్ మార్కెట్ విలువపరంగా ప్రపంచంలోని టాప్ 50 కంపెనీల్లో 49వ స్థానంలో నిలిచింది. అలాగే మార్కెట్ విలువలో పెప్సికో, షెల్, పెట్రోచైనా వంటి సంస్థల కన్నా పైకి వెళ్లింది. డాలర్ విలువలో ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్ 23,900 కోట్ల డాలర్లకు చేరింది. ప్రస్తుతం ప్రపంచ కంపెనీల్లో మైక్రోసాఫ్ట్ 3.08 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువతో అగ్రస్థానంలో ఉండగా యాపిల్ (2.89 లక్షల కోట్ల డాలర్లు), సౌదీ అరామ్కో (2.04 లక్షల కోట్ల డాలర్లు), గూగుల్ యాజమాన్యంలోని ఆల్ఫాబెట్ ఇంక్ (1.84 లక్షల కోట్ల డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

'బీమా సుగమ్' కోసం ఆన్‌లైన్ పోర్టల్

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదన

న్యూఢిల్లీ: దేశంలో బీమా పాలసీల మార్కెటింగ్ మరింత సులభతరం కానుంది. ఇందుకోసం 'బీమా సుగమ్' పేరుతో ఒక ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రతిపాదించింది. దీనికి సంబంధించి ఒక ముసాయిదా పత్రం విడుదల చేసింది. ఈ పత్రంపై బీమా కంపెనీలు, ఇతర స్టేక్‌హోల్డర్లు మార్చి 4వ తేదీలోగా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని ఐఆర్‌డీఏఐ కోరింది. దేశ ప్రజల్లో బీమా కవరేజీ పెంచేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని ఐఆర్‌డీఏఐ అంచనా. ఈ ప్రతిపాదన ఆచరణకు నోచుకుంటే బీమా కంపెనీలు, పాలసీదారులు, ఏజెంట్లకు ఒకే వేదికగా ఇది ఉపయోగపడుతుంది. ఈ పోర్టల్ ఈక్విటీలో సాధారణ, జీవిత, ఆరోగ్య బీమా కంపెనీలకు వాటా ఉంటుంది.

నెల రోజుల వరకు ఫ్రీ లుక్ పీరియడ్: బీమా సుగమ్‌తో పాటు మరో సంస్కరణకు ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది. పాలసీదారులు తాము తీసుకున్న పాలసీని తిరస్కరించే గడువును, పాలసీ డాక్యుమెంట్స్ అందిన 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి తోడు బీమా పాలసీలు అన్నిటికి పాలసీ తీసుకునేటప్పుడే నామినేషన్ తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. పాలసీదారులకు రిఫండ్, సెటిల్‌మెంట్ సొమ్ములు త్వరగా అందేందుకు వీలుగా పాలసీ ఇచ్చేటప్పుడే వారి బ్యాంకు ఖాతాల వివరాలు కూడా తీసుకోవాలని కోరింది.

స్పోర్ట్స్

దేవాన్షికి స్వర్ణం.. లక్షితకు రజతం



న్యూఢిల్లీ: పది మీటర్ల ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. స్పెయిన్‌లోని గ్రనడాలో బుధవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ జూనియర్ ఈవెంట్‌లో భారత షూటర్లు పోడియం ఫినిష్ చేశారు. దేవాన్షి ధమా (240) స్వర్ణం సాధించగా.. లక్షిత (238) రజతం దక్కించుకుంది. సీనియర్ విభాగం పోటీలు శుక్రవారం మొదలవుతాయి.

మూనీకి గుజరాత్ పగ్గాలు

డబ్ల్యూపీఎల్



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు సారథిగా ఆస్ట్రేలియా స్టార్ బెత్ మూనీ వ్యవహరించనుంది. గత సీజన్‌లోనూ జట్టు పగ్గాలు మూనీకే అప్పగించినా.. తొలి మ్యాచ్ ఆడిన వెంటనే గాయంతో లీగ్‌కు దూరమైంది. దీంతో మూనీ స్థానంలో స్నేహ్ రాణా జట్టును నడిపించింది. జట్టుకు ప్రధాన కోచ్ మైకేల్ క్లింగర్ కాగా.. మిథాలీ రాజ్ మెంటార్ బాధ్యతలు నిర్వర్తించనుంది. బెంగళూరు, న్యూఢిల్లీ వేదికలుగా ఈనెల 23 నుంచి పోటీలు జరుగనున్నాయి.

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

కివీస్ 211 ఆలౌట్

హామిల్టన్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికాకు 31 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో రోజు బుధవారం కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ 43, లాథమ్ 40 రన్స్ చేశారు. డేన్ పీట్ 5 వికెట్లతో దెబ్బతీశాడు. ప్యాటర్సన్‌కు 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు సౌతాఫ్రికా తమ ఓవర్‌నైట్ స్కోరు (220/6)కు 22 రన్స్ మాత్రమే జోడించి 242 వద్ద ఆలౌటైంది. ఒరోర్కెకు 4, రవీంద్రకు 3 వికెట్లు దక్కాయి.

'న్యూయార్క్' కెప్టెన్‌గా యువరాజ్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ లెజెండ్స్ క్రికెట్ ట్రోఫీ (ఎల్‌సీటీ) సీజన్-2లో న్యూయార్క్ సూపర్‌స్టార్ స్ట్రయికర్స్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆ జట్టులో బాబర్ ఆజమ్, రషీద్‌ఖాన్, పొలార్డ్ తదితరులు ఆడనున్నారు. 15 ఓవర్ల ఈ టోర్నీ మార్చి 7 నుంచి 18 వరకు శ్రీలంకలోని క్యాండీలో జరగనుంది. 6 జట్లు, 9 రోజులపాటు 18 మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఢిల్లీ, న్యూయార్క్, పంజాబ్, రాజస్థాన్, కొలంబో, చత్తీస్‌గఢ్ జట్లు బరిలోకి దిగనున్నాయి. గతేడాది జరిగిన సీజన్-1లో ఇండోర్ నైట్స్, గువాహటి అవెంజర్స్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి.

రాజ్‌కోటలో పాగా ఎవరిదో?

నేటి నుంచి ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

ఉ. 9.30 నుంచి జియో సినిమాలో..



100 ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కిది వందో టెస్టు. ఆ జట్టు తరపున నూరు టెస్టులాడిన 16వ ప్లేయర్.

1 టెస్టుల్లో 500 వికెట్లు పూర్తి చేసేందుకు స్పిన్నర్ అశ్విన్‌కు మరో వికెట్ చాలు.

భారత్‌కు గాయాల బెడద | కొత్త ఆటగాళ్లకు చాన్స్

రాజ్‌కోట్: తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇచ్చిన ఝలక్‌కు వైజాగ్ టెస్టులో టీమిండియా గట్టిగానే బదులిచ్చింది. తద్వారా ఐదు టెస్టుల సిరీస్‌లో 1-1తో నిలిచింది. యశస్వీ జైస్వాల్ సూపర్ బ్యాటింగ్, బుమ్రా మెరుపు బౌలింగ్.. వెరసి జట్టుకు అద్భుత విజయం దక్కింది. తాజాగా బుధవారం నుంచి ఇరు జట్ల మధ్య మూడో టెస్టు జరుగనుంది. అయితే భారత జట్టుకు గాయాల బెడద, ఆటగాళ్ల ఫామ్‌లేమి ఇబ్బందిగా మారింది. ఇప్పటికే విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లేకపోవడంతో జట్టు మిడిలార్డర్ బలహీనంగా మారింది. ఈ సమస్యను ఎలా అధిగమిస్తుందో వేచి చూడాల్సిందే. అటు ఇంగ్లండ్ జట్టు ఈ టెస్టులో నెగ్గి తిరిగి ఆధిపత్యం చూపాలన్న కసితో ఉంది. అలాగే కెప్టెన్ బెన్ స్టోక్స్‌కిది కెరీర్‌లో వందో టెస్టు. అందుకే తమ సారథికి చక్కటి విజయాన్ని బహుమతిగా అందించాలని సహచరులు భావిస్తున్నారు.

సర్ఫరాజ్, జురెల్‌కు చాన్స్?: భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్ జైస్వాల్ మాత్రమే ఊపు మీదున్నాడు. ఈ సిరీస్‌లో తను 321 పరుగులు సాధించగా, మిగతా వారంతా 170 లోపే ఉండడం గమనార్హం. వీరిలో శ్రేయాస్ అయ్యర్‌పై ఇప్పటికే వేటు పడగా, రాహుల్ గాయంతో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఎదురుచూపులు ఫలించే చాన్స్ ఉంది. అతడితోపాటు యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ వైపు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతోంది. 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో జురెల్ 46.47 సగటుతో ఉండడం అతడికి కలిసివస్తోంది. ఎందుకంటే గత 12 ఇన్నింగ్స్‌లో కీపర్ కేఎస్ భరత్ బ్యాటింగ్‌లో విఫలమవుతూనే ఉన్నాడు. దీంతో తనపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. శ్రేయాస్ లేకపోవడంతో రజత్ పటీదార్‌కు వచ్చిన ముప్పేమీ లేదు. అటు ఓపెనర్ గిల్ చాలాకాలం తర్వాత ఈ ఫార్మాట్‌లో ఓ సెంచరీ సాధించి జట్టులో చోటును పదిలం చేసుకున్నాడు. ఇక బౌలింగ్‌లో ఆల్‌రౌండర్ జడేజా జట్టులోకి రావడం సానుకూలాంశమే. స్థానిక ఆటగాడిగా అతడికి పిచ్‌పై అవగాహన ఉంటుంది. అయితే తొలి రెండు టెస్టుల్లో స్పిన్నర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. వీరిని ఇంగ్లండ్ బ్యాటర్లు సులువుగా ఆడేస్తుండడం ఆందోళనకరంగా మారింది. పేసర్లలో బుమ్రాను ఆడిస్తే అతడికి జతగా విశ్రాంతి ముగించుకున్న సిరాజ్ కొనసాగుతాడు. అయితే జట్టు ఇద్దరు పేసర్లతో వెళ్లాలనుకుంటే స్పిన్నర్ కుల్దీప్‌ను బెంచీకే పరిమితం చేసి ఆల్‌రౌండర్లు అక్షర్, జడేజా, అశ్విన్‌లతో వెళ్లవచ్చు.

ఎదురుదాడే లక్ష్యంగా..: వారం రోజులపాటు అబుదాబిలో విశ్రాంతి తీసుకున్న ఇంగ్లండ్ జట్టు మూడో టెస్టులోనూ తమ శైలిని మార్చుకోవాలనుకోవడం లేదట. భారత్‌పై దూకుడు కనబరిచి వారు పొరపాట్లు చేసేవరకు వేచిచూడాలనుకుంటోంది. ఇప్పటివరకు ఇదే వర్కవుట్ అయ్యింది కాబట్టి కెప్టెన్ స్టోక్స్ తన వందో టెస్టులోనూ వెనక్కి తగ్గేదే లేదని భావిస్తున్నాడు. 2016లో ఇక్కడే జరిగిన టెస్టులో తనతో పాటు రూట్ కూడా శతకం సాధించాడు. ఇప్పటికే ప్రకటించిన తుది జట్టులో ఒక మార్పు చేసి సిరీస్‌లో తొలిసారిగా రెండో సీమర్‌ను చేర్చారు. స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో మార్క్ ఉడ్ ఆడనున్నాడు.క్రాలే.. పోప్ మరోసారి కీలకం కానున్నారు. జో రూట్ తన స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోతున్నాడు. స్పిన్నర్లు హార్ట్‌లీ, రెహాన్ ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలుగుతున్నారు.

జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), బెన్ ఫోక్స్, రెహాన్ అహ్మద్, హార్ట్‌లీ, మార్క్ ఉడ్, అండర్సన్.

పిచ్

రాజ్‌కోట్ పిచ్ సహజంగానే బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లో భారీగా పరుగులు నమోదయ్యాయి. ఫ్లాట్ వికెట్ కావడంతోనే ఇంగ్లండ్ కూడా తమ తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లు చాలనుకుంది.

భారత్‌తో ఆడడం ఇష్టం

మైలురాళ్ల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అంతకన్నా ముందు భారత్‌లాంటి పటిష్ఠ జట్టుతో ఆడడాన్ని ఆస్వాదిస్తా. ఎందుకంటే ఈ జట్టుతో మాకెదురయ్యే పోటీతో పాటు అధిక స్థాయిలో ప్రేక్షకులు వస్తుంటారు. పిచ్ గురించి అతిగా ఆలోచించడం లేదు. బుమ్రా అద్భుత బౌలర్. అతడిని దీటుగా ఎదుర్కొని పరుగులు సాధించే వ్యూహంలో ఉన్నాం. విరాట్, రాహుల్ లేకపోవడం మాకు అనుకూలంగానో, భారత్‌ను దెబ్బతీసేదిగానో భావించడం లేదు.

- బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్ కెప్టెన్)

వారిని ఓడించడం అసాధ్యం కాదు



భారత గడ్డపై గెలవడం పర్యాటక జట్లకు సులువేమీ కాదు. కానీ ఇంగ్లండ్ అటాకింగ్ గేమ్‌తో ఆడుతోంది. అలాగని ఆ జట్టును ఓడించడం అసాధ్యమని అనుకోవడం లేదు. మేం కూడా వారి శైలితోనే జవాబివ్వాల్సి ఉంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో చిన్న తప్పులను చేయకపోయుంటే ఫలితం మరోలా ఉండేది. నేనిక వంద శాతం ఫిట్‌గా ఉండేలా ప్రయత్నిస్తా. అవసరం లేని చోట డైవింగ్‌కు దూరంగా ఉంటా. ఇక అశ్విన్ ఇక్కడే 500 వికెట్లు పూర్తి చేసుకుంటాడు.

- స్పిన్నర్ జడేజా

'భారత రెజ్లింగ్'పై సస్పెన్షన్ ఎత్తివేతకు వక్రమార్గాలు!

సంజయ్‌పై సాక్షి మాలిక్, పూనియా ఆరోపణలు

న్యూఢిల్లీ: యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) విధించిన సస్పెన్షన్‌ను తొలగించుకోవడానికి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ వక్రమార్గాలను అనుసరించాడని ఒలింపిక్ పతక విజేతలు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో మరోసారి నిరసనకు దిగుతామని హెచ్చరించారు. 'సంజయ్ ఏదో మతలబు చేసి నిషేధాన్ని ఎత్తేసేలా చేశాడని తెలిసింది. చట్టాలకు అతీతులమనే విధంగా వ్యవహరిస్తున్నారని నెట్‌లో పోస్టు చేసిన వీడియోలో మాలిక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాల్లో మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ అనుయాయుల జోక్యాన్ని ఏమాత్రం సహించబోనని చెప్పింది. ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకుంటే.. తమ నిరసనను మళ్లీ ఆరంభిస్తామని సాక్షి హెచ్చరించింది.

భారత్‌లోనే ఐపీఎల్

లీగ్ చైర్మన్ ధూమల్ భరోసా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఐపీఎల్‌ను విదేశాలకు తరలిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ మెగా లీగ్‌ను పూర్తిగా భారత్‌లోనే నిర్వహిస్తామని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ భరోసా ఇచ్చాడు. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. తదనుగుణంగా మ్యాచ్‌ల తేదీలను నిర్ణయిస్తామన్నాడు. కాగా, ఐపీఎల్‌ను వచ్చే నెల 22 నుంచి రెండు దశలుగా నిర్వహించనున్నారని సమాచారం.

చైనాకు షాకిచ్చారు

● భారత అమ్మాయిల విక్టరీ ● ఘనంగా సింధు రీఎంట్రీ ● నాకౌట్‌కు పురుషుల జట్టు ● ఆసియా టీమ్ బ్యాడ్మింటన్



షా ఆలమ్ (మలేసియా): రీఎంట్రీలో పీవీ సింధు అదరగొట్టడంతో.. బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌ను భారత మహిళల జట్టు ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగిన గ్రూప్-డబ్ల్యూ మ్యాచ్‌లో పటిష్ఠ చైనాపై భారత్ 3-2తో గెలిచి సంచలనం సృష్టించింది. ఈ గ్రూప్‌లో రెండే జట్లు ఉండడంతో ఈ మ్యాచ్‌కు ముందే టీమిండియాకు నాకౌట్ బెర్త్ ఖరారైంది. 11వ ర్యాంకర్ సింధు 21-17, 21-15తో తనకంటే మెరుగైన 8వ ర్యాంకర్ హన్ యుపై గెలిచి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపింది. అయితే, అశ్విని పొన్నప్ప-తనీషా జంట 19-21, 16-21తో లి షంగ్-టాన్ నింగ్ చేతిలో, అస్మిత 13-21, 15-21తో వాంగ్ జి యి చేతిలో ఓడారు. కానీ, ట్రీసా జోలీ-గాయత్రి జోడీ 10-21, 21-18, 21-17తో లి యి జింగ్- లు జుపై గెలిచి 2-2తో సమం చేసింది. నిర్ణాయక మ్యాచ్‌లో అన్మోల్ కర్బ్ 22-20, 14-21, 21-18తో ఉ లు యుపై నెగ్గడంతో భారత్ 3-2 ఆధిక్యంతో ముందంజ వేసింది. ఇక, పురుషుల జట్టు కూడా నాకౌట్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4-1తో హాంకాంగ్‌పై గెలిచింది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ 18-21, 14-21తో ఎన్‌జి కా లాంగ్ అంగస్ చేతిలో ఓడగా, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-16, 21-11తో లి వయ్-చోయ్‌పై నెగ్గి సమం చేసింది. లక్ష్య సేన్ 21-14, 21-9తో చాన్‌పై, అర్జున్-ధ్రువ్ జోడీ 21-12, 21-7తో లాంగ్-హంగ్‌పై, కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో గునవాన్‌పై గెలిచారు. గురువారం చైనాతో భారత్ తలపడనుంది.

తలైవాస్‌పై ఢిల్లీ గెలుపు



కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 45-43తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 29-26తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. పుణె రైడర్ ఆకాశ్ సూపర్-10 సాధించాడు.

కేసీఆర్ సర్కారు విద్యను విస్మరించింది

» కాంగ్రెస్ అయినా పట్టించుకోవాలి: అక్బరుద్దీన్



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు రెండు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో అదనపు తరగతుల నిర్మాణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని, మైనార్టీ గురుకులాలకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని... మైనార్టీ గురుకులాలకు కూడా కేటాయింపులు చేస్తామని ప్రకటించారు. ఆర్థిక మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన గణాంకాలకు, పద్దుల పుస్తకాల్లో చూపిన లెక్కలకు చాలా వ్యత్యాసం ఉందని, దానిపై ఆయన సభకు వచ్చి వివరణ ఇవ్వాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లోని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని, సుమారు వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే గ్రేటర్ పరిధిలో ప్రతి నెలా రెండువేలకు పైగా కుక్కకాట్ల ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించి ప్రజలను రక్షించాలని కోరారు.

కాళేశ్వరం అక్రమాలపైసీబీఐ విచారణ ఎందుకు కోరడంలేదు?: ఏలేటి



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ కోరటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వెనకడుగేస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు యూటర్న్ తీసుకున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టులపై విచారణకు కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణను ఎందుకు కోరటంలేదని అడిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అంతర్గతంగా మిలాఖత్ అయిపోయి.. బయటికి కొట్లాడుతున్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ ఇస్తే.. 48 గంటల్లో విచారణ మొదలుపెట్టిస్తామని, లేకపోతే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సీబీఐ విచారణకు డిమాండ్ చేశారని, ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కాళేశ్వరం, మేడిగడ్డ టూర్ పిక్నిక్‌లా ఉన్నదని, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు చక్కగా లంచ్ చేసి వచ్చారన్నారు. బీఆర్ఎస్ - బీజేపీ పొత్తు అని పదేపదే కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, గతంలో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్‌పార్టీకే ఉన్నదన్నారు.

బీజేఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

బీజేపీ శాసనసభపక్ష నేత(బీజేఎల్పీ)గా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. దీంతో, కొద్దిరోజులుగా సాగుతున్న సందిగ్ధతకు తెరపడినట్లయ్యింది. ఈ పదవి కోసం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా పోటీపడగా పార్టీ నాయకత్వం మహేశ్వర్‌రెడ్డి వైపే మొగ్గు చూపింది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌లుగా పాయల్ శంకర్(ఆదిలాబాద్), కాటిపల్లి వెంకట రమణారెడ్డి(కామారెడ్డి)లు నియమితులయ్యారు. కాగా, చీఫ్ విప్‌గా డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు(సిర్‌పూర్), విప్‌గా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా(నిజామాబాద్ అర్బన్) రాకేశ్ రెడ్డి(ఆర్మూరు) ట్రెజరర్‌గా కొనసాగనున్నారు. శాసనమండలి పక్ష నేతగా ఏవీఎన్‌రెడ్డి నియమితులయ్యారు.

కల్వకుంట్ల కుటుంబానికి లిమిటెడ్ కంపెనీలా బీఆర్ఎస్

» వారి అక్రమాలను బయటకు తెస్తున్న పులి.. రేవంత్‌రెడ్డి

» మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ లాభాలు తెచ్చిపెట్టే లిమిటెడ్ కంపెనీగా మారిందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఎమ్మెల్యేలు ఎన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్, పర్ణిక రెడ్డి మాట్లాడారు. పార్టీ పేరు చెప్పుకొని కేసీఆర్ కుటుంబ సభ్యులు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. పులి లాంటి రేవంత్‌రెడ్డి .. పిల్లి లాంటి కేసీఆర్ చేసిన అక్రమాలను బయటకు తెస్తున్నారని వ్యాఖ్యానించారు. అందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. ఆయన రాజ్యసభకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారని అభిప్రాయపడ్డారు. సభలో హరీశ్‌రావు మాట్లాడే తీరు బాగలేదని అన్నారు. బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నుంచి చెప్పాపెట్టకుండా పారిపోయారని ఆరోపించారు. పెళ్లిళ్లు, పేరంటాలున్నాయని చెప్పి వారు రెండు రోజుల ముందు నుంచే సభ వాయిదావేయాలని కోరుతున్నారని అన్నారు.

సీఎం చావును కోరుకుంటారా?

» అధికారం కోసం ఇంతలా దిగజారతారా?

» కేసీఆర్‌పై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎప్పటికీ అధికారంలో ఉండాలన్నదే కేసీఆర్ లక్ష్యంగా కనిపిస్తోందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. సీఎం కుర్చీ కోసం కేసీఆర్ ఎంతకైనా తెగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. 'ఎప్పుడు చస్తావ్.. అని సీఎంను ఉద్దేశించి అంటున్నారు. ఆయన చస్తే సీఎం కుర్చీ దక్కుతుందన్నట్టుగా కేసీఆర్ మాట్లాడుతున్నారు. అధికారం కోసం ఇంతగా దిగజారతారని ఊహించలేదు' అని వ్యాఖ్యానించారు. రూ.వేల కోట్ల అప్పులు చేసి కాళేశ్వరం నిర్మించిన కేసీఆర్, అవినీతి ఆరోపణలపై ఎందుకు సమాధానం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తాను మేడిగడ్డ పర్యటనకు వెళ్లబట్టే క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోగలిగినట్లు చెప్పారు. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టులకు మూడేళ్లకే పగుళ్లు వస్తే వాటి భవిష్యత్తు ఏంటని నిలదీశారు. ప్రాజెక్టుల పేరిట దోచుకున్నవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో తెలంగాణ నంబర్-1 అంటూ గత ప్రభుత్వం గొప్పగా చెప్పుకొన్న మాటల్లో ఏమాత్రం నిజం లేదన్నారు.

హామీలను అమలు చేస్తాం: శ్రీధర్‌బాబు




హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తామిచ్చిన హామీలను అమలుచేయకూడదన్న ఉద్దేశంతోనే బీఆర్ఎస్ వాళ్లు వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఖజానాలో డబ్బులు లేని పరిస్థితి తీసుకొచ్చినప్పటికీ కచ్చితంగా హామీలను అమలుచేస్తామని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి ఇంటి గృహిణికి రూ.2,500 ఇస్తామని చెప్పారు.. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు కడియం శ్రీహరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ, చీకటి రోజులున్నాయన్న కడియం వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ స్పీకర్ సమయమిస్తే ఇందిరమ్మ రాజ్యం అంటే ఏంటో చెబుతామని శ్రీధర్ బాబు అన్నారు. దావోస్ సభకు వెళ్లిన సీఎం, మంత్రి రాష్ట్రానికి రూ.40వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రకటించారని కడియం పేర్కొన్నారు. దీనిపై స్పందించిన శ్రీధర్ బాబు.. గతంలో ఇక్కడ పెట్టుబడులు పెట్టని కంపెనీలు, పెట్టిన కంపెనీలు కూడా మళ్లీ ఇప్పుడు పెట్టుబడులకు ముందుకు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది రాష్ట్రానికి రూ.80వేల కోట్ల పెట్టుబడులను ఎలా తీసుకురావాలన్న దానిపై సూచనలివ్వాలని ఆయన ప్రతిపక్షానికి సూచించారు.

కడియం X రాజగోపాల్‌రెడ్డి

» ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య బుధవారం అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. పరస్పరం తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను రెండుసార్లు మోసం చేసి ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అయ్యావంటూ కడియం శ్రీహరిని కోమటిరెడ్డి విమర్శించారు. ప్రతిగా కడియం.. కాంగ్రెస్‌కు పట్టిన చీడపురుగు, ఆ పార్టీని నాశనం చేశావంటూ ఎదురుదాడి చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడే అవకాశం ఇచ్చారు. తెలంగాణ ప్రజలు ఓడించినా బీఆర్ఎస్ నాయకుల బుద్ధి మారలేదని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పట్టుకుని 'కూర్చో' అంటూ కేటీఆర్ అహంకారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు చెంపచెళ్లు మనిపించినా బీఆర్ఎస్ నేతల బుద్ధి మారలేదన్నారు. "కడియం శ్రీహరి సీనియర్ సభ్యుడు, మేధావి. ఆయనంటే నాకు గౌరవం ఉంది.. కానీ మొన్న ఇదే సభలో నా గురించి ఆయన రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చేది లేదు.. వచ్చేది లేదు అంటూ మాట్లాడారు" అని వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవి వస్తుందో లేదో తమ అధిష్ఠానం, ముఖ్యమంత్రి చూసుకుంటారని, కానీ.. కడియం శ్రీహరి ఉద్యమకారుడైన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు రెండుసార్లు మోసం చేశారని ఆరోపించారు. మొదటిసారి తాటికొండ రాజయ్యను డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించారని, రెండోసారి ఎమ్మెల్యే టికెట్ రాకుండా అడ్డుకొని మోసం చేశాడని ఆరోపించారు. తనకు మంత్రి పదవి వస్తుందో రాదో తెలియదుకాని కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉన్నంత కాలం మంత్రి కాలేరని అన్నారు. ఇంతలో కడియం మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీకి పట్టిన చీడపురుగు నువ్వు' అంటూ కోమటిరెడ్డిపై విరుచుకుపడ్డారు. స్పీకర్ కల్పించుకుని... కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏవైనా అభ్యంతకర వ్యాఖ్యలు చేసినట్లు తేలితే రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు.



కేసీఆర్.. ప్రజలు నీ ప్యాంట్ ఊడబెరికారు

మేం అంగీనీ ఊడబెరుకుతాం

సీఎంను ఏం పీకడానికి పోయిండ్రు అంటావా?.. సీఎం, కేంద్ర మంత్రిగా చేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది?

» నల్లగొండ సభలో కేసీఆర్ వాడిన భాష పైన చర్చిద్దామా?

» వీల్‌చైర్‌లో వీధి నాటకాలు: సీఎం రేవంత్



హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్యాంట్‌ను ఇప్పటికే ప్రజలు ఊడబెరికారని, ఇక తాము అంగీ (చొక్కా) కూడా ఊడబెరుకుతామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. చంపుతారా అని కేసీఆర్ అడుగుతున్నారని, చచ్చిన పామును చంపాల్సిన అవసరం తమకు లేదని, ఇప్పటికే ఆ పామును ప్రజలు చేతితో కాకుండా కట్టెతో కొట్టి చంపారని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీని నింపడం లేదని మాట్లాడుతున్నారని, సాగునీటి పారుదల శాఖ మంత్రులుగా పనిచేసిన కేసీఆర్, హరీశ్‌రావుకే పెత్తనం ఇస్తామని, వారినే నింపమనండి, ఎలా నింపుతారో అంటూ సవాల్ విసిరారు. కాళేశ్వరం సందర్శనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఏం పీకడానికి పోయారంటూ నల్లగొండ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై బుధవారం అసెంబ్లీలో రేవంత్ తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ అంశంలో కొత్త ప్రభుత్వమే తప్పు చేసినట్లు, మాదే బాధ్యత అన్నట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని.. "సభలో పదేపదే మా భాష గురించి మాట్లాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి (కేసీఆర్) నల్లగొండ జిల్లాలో వాడిన భాషపై చర్చిద్దామా? ఏం పీకడానికి పోయిండ్రు అని అడుగుతారా? పదేళ్లు సీఎం, కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన వ్యక్తి, ఉద్యమకారుడినని గొప్పలు చెప్పుకొని, జబ్బలు చరుచుకునే వ్యక్తి, ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉండి.., 4 కోట్లమంది ప్రజలు ఓట్లేసి గెలిపించిన ముఖ్యమంత్రిని పట్టుకుని ఏం పీకడానికి పోయినవ్ అని అడుగుతాడా? ఇదేనా తెలంగాణ సంప్రదాయం? ప్రజలు మొన్నటి ఎన్నికల్లో మీ ప్యాంట్ ఊడబెరికితే.. చెప్పుకొనే దిక్కులేక బొక్కబోర్లాపడితే మీకు బొక్కలు ఇరిగినయ్. అయినా మీ బుద్ధి మారలేదు' అని ఘాటుగా స్పందించారు. సానుభూతి కోసం వీల్ చైర్ నాటకాలు, వీధి నాటకాలాడుతున్నారని కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు. గోదావరి జలాలు, కాళేశ్వరంపై చర్చకు సిద్ధమైతే మీ పార్టీ (బీఆర్ఎస్) నాయకుడిని సభకు పిలవాలని, గురువారం సాయంత్రం వరకైనా కాళేశ్వరం, గోదావరి జలాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పారిపోయి ప్రగల్భాలెందుకు?

కాళేశ్వరం, గోదావరి జలాల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ స్పష్టం చేశారు. "నిజాయతీ ఉంటే, అవినీతికి పాల్పడకపోతే, మేడిగడ్డలో రెండో మూడో పిల్లర్లు కుంగిపోతే.. దానిమీద తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించడానికి మాజీ సీఎం కేసీఆర్‌ను సభలోకి రమ్మనండి. పారిపోయి, అక్కడెక్కడికో పోయి ప్రగల్భాలు పలకడమెందుకు? వాస్తవాలపై చర్చిద్దాం రమ్మనండి. ఆయన తప్పించుకుంటాడు. ఈయనొచ్చి (కేటీఆర్) కొత్త మాటలు చెబుతాడు" అని అన్నారు. చర్చకు సిద్ధమైతే బీఆర్ఎస్ పక్ష నేత సభకు రమ్మనాలని.. కాళేశ్వరంలో అవినీతికి పాల్పడకపోతే చర్చకు రావాలని కోరారు. "ప్రాజెక్టులపై శ్వేతపత్రం పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీరు ఏ అంశాలపై చర్చించాలనుకుంటున్నారో, అన్ని విషయాలపై శ్వేతపత్రం సందర్భంగా చర్చిద్దాం. కాళేశ్వరంపై చర్చించడానికైనా ప్రత్యేక సమయం కేటాయిస్తే, తప్పకుండా చర్చిద్దాం. దానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని తేల్చి చెప్పారు. ప్రతిపక్ష నేత బాధ్యతల నుంచి తప్పించుకుని, అవినీతి బయటపడుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టు దోపిడీలో జైలుకు వెళ్లాల్సి వస్తుందని పారిపోయి, ఫామ్ హౌజ్‌లో పడుకున్నారని విమర్శించారు.

సభకు రాకుండా ఇలా మాట్లాడతారా?

"గోదావరి జలాలు, దానిపై నిర్మించిన బ్యారేజీలు.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను చూసివచ్చి చర్చించుకుందామని మీ (స్పీకర్) అనుమతి తీసుకున్నాం. కానీ, ప్రధాన ప్రతిపక్షం రాలేదు. పైగా, కొత్త ప్రభుత్వమే ఏదో తప్పు చేసినట్లు మాట్లాడుతున్నారు. మేడిగడ్డ మేడిపండులా కుంగిపోతే, అక్కడ నీళ్లు నింపడానికి అవకాశముందా?" అని రేవంత్ ప్రశ్నించారు. "కేసీఆర్, హరీశ్ సాగునీటి పారుదల మంత్రులుగా పనిచేశారు కదా.. వారికే పెత్తనం ఇస్తాం. మేడిగడ్డలో నీళ్లను నింపమనండి. అన్నారం, సుందిళ్లలో ఎత్తిపోయించే బాధ్యత తీసుకోండి. మొత్తం బ్యారేజీ కుంగిపోయి, కుప్పకూలిపోతుంటే.. నీళ్లు నింపడానికి ఏమాత్రం అవకాశం లేక, ఖర్చు పెట్టిన 94వేల కోట్లు వృథా అయ్యాయి. మొత్తం ప్రాజెక్టు దెబ్బతిన్న పరిస్థితుల్లో ప్రజల వద్దకు వెళ్లి సమాధానం చెప్పుకోలేక, శాసనసభకు రాకుండా ముఖ్యమంత్రిని పట్టుకుని ప్రతిపక్ష నేత ఇలా మాట్లాడొచ్చా?" అని నిలదీశారు.

కిషన్‌రెడ్డి.. కేసీఆర్ బినామీ!

» బీజేపీ అధ్యక్షుడిగా చేయించింది ఆయనే

» రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం వ్యాఖ్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. కేసీఆర్‌కు బినామీ అని రాష్ట్ర రవాణ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా కిషన్ రెడ్డిని నామినేట్ చేయించింది కేసీఆరే అనేది జగమెరిగిన సత్యమని వ్యాఖ్యానించారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పించి, ఆ కుర్చీలో కిషన్‌రెడ్డిని కేసీఆరే కూర్చోబెట్టించారని అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా పొన్నం మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా మొదలుకొని బీజేపీ కార్యకర్త వరకు ప్రతిఒక్కరూ విమర్శించారని గుర్తు చేశారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతిపై ఏనాడు కూడా చర్యలు తీసుకున్న దాఖలాలులేవని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఉండే అన్ని పార్టీల నేతలపై ఈడీ, ఐటీ దాడులు జరిగాయని, కానీ ఒక్క బీఆర్ఎస్ నేతపై కూడా దాడులు చేయలేదంటే.. వారి మధ్య ఉన్న దోస్తానాకు నిదర్శనమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు ఉన్నదంటూ ప్రజలు అభిప్రాయపడుతున్నారని శాసనసభ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దీనిపై సూటిగా సమాధానాలు ఇవ్వకుండా ఆ పార్టీ నాయకులు తప్పించుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ- బీఆర్ఎస్ కలవబోవని ఏవిధంగా ప్రజలకు నమ్మకం కలిగిస్తారో చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అడిగితే దానికి బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సమాధానం ఇవ్వలేదని చెప్పారు.

కులగణనపై నేడు సభలో తీర్మానం

రాష్ట్రంలో కులగణనకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు అవసరమైన తీర్మానాన్ని గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు.



అసెంబ్లీ ఆవరణలో కింద కూర్చొని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, సబిత తదితరులు

పోలీసు రాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఖూనీ చేస్తోందంటూ నిరసనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొత్త రూల్స్ ఏమిటంటూ హరీశ్, కేటీఆర్ వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యేలను ఆపే హక్కు మీకు లేదని.. ఆర్డర్ కాపీ ఉంటే చూపించాలని, లోపల మైక్ ఇవ్వరు.. బయట కూడా ఆపుతారా? ఇంత అప్రజాస్వామికమా? అసెంబ్లీ ప్రాంగణంలోనే ఎమ్మెల్యేలను అడ్డుకుంటారా? అని కడియం శ్రీహరి, ప్రశాంత్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితర ఎమ్మెల్యేలతో కలిసి వారు నిలదీశారు. "మీడియా పాయింట్ వద్దకు వెళ్లి మాట్లాడొద్దని కొత్తగా ఏదైనా నిబంధన పెట్టారా? బులెటిన్ ఇవ్వలేదు, సభ్యులకు సమాచారం లేదు. పదేళ్లు నువ్వే ఉన్నవ్ కదా.. కాంగ్రెస్ వాళ్లు ఇక్కడ మాట్లాడలేదా? మేం అలాంటి నిబంధన ఏమైనా పెట్టామా?" అంటూ చీఫ్ మార్షల్‌ను ప్రశ్నించారు. సభకు సమాంతరంగా మీడియా పాయింట్‌లో మాట్లాడకూడదు కాబట్టి అడ్డుకుంటున్నామని ఆయన చెప్పడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. ఆర్డర్ కాపీ చూపాలంటూ పట్టుబట్టడంతో.. స్పీకర్‌తో మాట్లాడి వస్తానని లోపలికి వెళ్లిన చీఫ్ మార్షల్ తిరిగి రాలేదు. కొంతసేపు నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్లిపోయారు. కాగా, ఇదేనా ప్రజాపాలన అంటే? అంటూ హరీశ్ విమర్శలు గుప్పించారు. విపక్షాల గొంతు అణిచివేసేందుకు అధికార పక్షం కుట్ర చేస్తోందంటూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు, మార్షల్స్‌తో వాగ్వాదానికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో ఉంచారు. ఎన్ని రోజులైనా మాట్లాడండి అవకాశం ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. తాము మాట్లాడితే తట్టుకోలేక సభలో, బయటా అడ్డుకున్నారని, ఆయన చెప్పేదొకటి చేసేదొకటని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సీనియర్ ఎమ్మెల్యే, దళిత నాయకుడైన కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒక సభ్యుడు మాట్లాడుతుంటే 20 సార్లు మైక్ కట్ చేశారని.. కొత్త సభ్యులు మాట్లాడుతుంటే రెచ్చగొట్టేలా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ భావ దారిద్ర్యంలో ఉందని, సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఆయనకు తెలంగాణకు ఏం సంబంధం అని పల్లా ప్రశ్నించారు. కేసీఆర్ ప్రతిపాదించిన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని, అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చి తమ గొంతు నొక్కుతున్నారని విమర్శించారు.

తెలంగాణ జాతిపితగా కేసీఆర్ చిరస్థాయిగా ఉంటారు!

ఆయన ఆనవాళ్లు చెరిపేస్తామనడం సరికాదు

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం బాధాకరం!

» బాధ్యులపై చర్యలు తీసుకోండి

» ఇందిరమ్మ రాజ్యంలో చీకటి రోజులను మర్చిపోయారా?: కడియం



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చిహ్నంలో రాజకీయ పోకడలున్నాయనే నెపంతో చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటోందని, ఈ రెండింటి ప్రస్తావన రాష్ట్ర గీతమైన 'జయ జయహే తెలంగాణ'లో ఉందని బీఆర్ఎస్ నేత కడియం శ్రీహరి పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామనడం సరికాదని, తెలంగాణ జాతిపితగా కేసీఆర్ చిరస్థాయిగా ఉంటారని పేర్కొన్నారు. హైటెక్ సిటీని చంద్రబాబు.. రింగురోడ్డును వైఎస్ఆర్.. అమరవీరుల స్థూపాన్ని, సచివాలయాన్ని, అంబేడ్కర్ విగ్రహాన్ని, కమాండ్ కంట్రోల్‌ను కేసీఆర్ కట్టించారని.. మరి ఇవన్నీ రేవంత్ రెడ్డి కట్టించారని అనరు కదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం బాధాకరం, విచారకరమని కడియం అన్నారు. బ్యారేజీ కుంగిపోయిన ఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గోరంతను కొండంత చేయొద్దంటూ హితవు పలికారు. కాళేశ్వరంలో మేడిగడ్డ ఒక బ్యారేజీ మాత్రమేనని, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు చాలా ఉన్నాయని గుర్తుచేశారు. అక్కడ కాఫర్ డ్యామ్‌ను నిర్మించి బ్యారేజీని రిపేరు చేయాలని సూచించారు. ఏవైనా చిన్న, చిన్న సమస్యలుంటే మరమ్మతులు చేసుకోవాలని, రాజకీయం చేయండి కానీ.. మేడిగడ్డపై మాత్రం చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయడానికి రూ.1.36లక్షల కోట్లు అవసరమవుతాయని, బడ్జెట్‌లో మాత్రం రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించారని హామీలను ఎలా అమలుచేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీ ఫైలుపై సంతకం చేస్తామని చెప్పిన తారీఖు డిసెంబరు 9 వెళ్లిపోయి రెండు నెలలవుతోందని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత నివ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు అందిస్తామన్నారని, దాని ప్రకారం 119 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 4.16లక్షల ఇళ్లకు రూ.20వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని, బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.7,740 కోట్లనే కేటాయించారని విమర్శించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని.. దాని గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. తాము చేసిన విధంగానే వాళ్లు కూడా అప్పులు చేస్తున్నారని అన్నారు. ఇటీవల సీఎం దావోస్ సభకు వెళ్లి రాష్ట్రానికి రూ.40వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రకటించారని, కానీ ఆ కంపెనీలు గతంలోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయని చెప్పారు. కాంగ్రెస్ వాళ్లు ఇందిరమ్మ రాజ్యమంటూ ప్రచారం చేస్తున్నారని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో చోటుచేసుకున్న ఎమర్జెన్సీ చీకటి రోజులను అప్పుడే మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

థ్యాంక్స్ టూ కేటీఆర్..

బడ్జెట్ ప్రసంగం సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఆర్థిక ప్రగతి గురించి వివరిస్తున్న సమయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్‌లను కడియం పొగిడారు. ఆర్థిక ప్రగతి, అభివృద్ధి కేసీఆర్ వల్లనే సాధ్యమైందంటూ తెలిపారు. రాష్ట్ర ఐటీ రంగంలో 2014కు ముందున్న పరిస్థితి నుంచి బయటపడి లక్షల కోట్లకు ఎదిగామని అది కేటీఆర్‌తోనే సాధ్యమైందని.. అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నానంటూ.. "థ్యాంక్స్ టూ కేటీఆర్" అన్నారు.

కేసీఆర్‌ను దూషించడాన్నే పనిగా పెట్టుకున్నారు

అధికార బాధ్యతలు చేపట్టాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని కడియం శ్రీహరి ఆరోపించారు. సీఎం అయ్యాక కూడా రేవంత్ భాష మారడంలేదని, హుందాతనం మరచి ఇష్టానుసారం మాట్లాడటం తగదన్నారు. కేసీఆర్‌ను ఆయన అసభ్య పదజాలంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చెప్పలేని భాషలో రేవంత్ మాట్లాడుతున్నారని, వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కోరే ప్రయత్నం చేస్తే స్పీకర్ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. తమను తిట్టించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సభ నడిపిస్తున్నట్లు కనబడుతోందన్నారు. తెలంగాణలో కంచెలు లేవంటూ గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్లో మాట్లాడే అవకాశం లేకుండా ఇనుప కంచెలు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు.

తప్పుడు నివేదికలిచ్చిన ఇంజనీర్లను ఉరి తీయాలి

» మండలిలో కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి

» ఢిల్లీ వాణి తప్ప ప్రజావాణి లేదు: కవిత

» శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పనుల్లో పాలకుల మెప్పు కోసం తప్పుడు నివేదికలిచ్చిన ఇంజనీరింగ్ నిపుణులను ఉరి తీయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక అంశాలను పరిశీలించకుండా వారిచ్చిన నివేదికల వల్లే మిషన్ భగీరథ కేంద్రీకృత ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని ఆయన విమర్శించారు. బుధవారం శాసనమండలిలో 2024-25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, తాగునీటి ఫ్లోరినేషన్ ప్రభావం కేవలం 20 కిమీ ప్రవాహం వరకే పరిమితమైందని, కాని మిషన్ భగీరథలో 100 నుంచి 200 కిమీ వరకు తాగునీటి పైప్‌లైన్‌లలో ఫ్లోరినేషన్ చేశారని చెప్పారు. అవగాహన లేకుండా కేవలం రాజకీయ అవసరాల కోసమే మిషన్ భగీరథ పనులకు అనుమతులిచ్చారని ఆరోపించారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను జీవన్‌రెడ్డి ఎండగట్టారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి ఢిల్లీ వాణి తప్ప ప్రజావాణి లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రతిపైసా పేదవర్గాల సంక్షేమం కోసమే ఖర్చు చేసిందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కేసీఆర్ అధికారం చేపట్టిన మొదటి దఫాలో మహిళా మంత్రులే లేరని విమర్శించారు. కాని కాంగ్రెస్ మహిళలకు పెద్ద పీట వేసిందని అన్నారు. కాంగ్రెస్ సభ్యుడు జీ.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించామని చెప్పారు. రాష్ట్రంలో ఢిల్లీ తరహాలో మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని, సాంకేతిక శిక్షణ సంస్థలను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.



రాజీవ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సచివాలయం ఎదురుగా రాజీవ్ విగ్రహం

- శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సచివాలయం ఎదురుగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ విగ్రహ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పార్టీ నేతలు వి. హన్మంతరావు, విజయారెడ్డి, రోహిన్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ విగ్రహ నమూనా చిత్రాలను సీఎం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ పరిసర ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహం లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసిన, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అంటూ కొనియాడారు. దేశ భద్రత, సమగ్రత కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియాగాంధీ కృషిని ఎవరమూ మరువలేమని, రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు ఆమెను ఆహ్వానిస్తామని వెల్లడించారు.

మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు: తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 197 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం ప్రకటించారు. ఇప్పటికే కొనసాగుతున్న 123 మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే ప్రతి మార్కెట్ కమిటీ కార్యవర్గంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో కలిపి 18 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. వీరిలో 12 మంది నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు అధీకృత వ్యాపారులు (లైసెన్స్ ట్రేడర్స్), నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారని తుమ్మల తెలిపారు.

నేడు బంజారా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు దినం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి(ఫిబ్రవరి15)ని పురస్కరించుకుని బంజారా ఉద్యోగులకు ప్రభుత్వం గురువారం ప్రత్యేక సెలవు దినాన్ని ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞాపనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌కు నేడు శంకుస్థాపన

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్మించనున్న రైల్వేస్టేషన్ (హాల్ట్)కు గురువారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ మంత్రి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మనోహరాబాద్- కొత్తపల్లి నూతన రైలు మార్గంలోని కొమురవెల్లిలో కొత్త స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొననున్నారు.

నేడు సభలో 'కాళేశ్వరం'పై కాగ్ నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నిర్వహించిన ఆడిట్ నివేదికను గురువారం శాసనసభ, మండలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య వినిమయ బిల్లుతో పాటు పలు ఇతర అంశాలపై కాగ్ నిర్వహించిన ఆడిట్ నివేదికలను కూడా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సభ ముందుంచనున్నారు.

మార్చి 31న జెన్‌కో ఏఈ, కెమిస్ట్‌ల పరీక్ష

టీఎస్ జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ-ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్/సివిల్)తో పాటు 60 కెమిస్ట్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 31వ తేదీన మూడు షిఫ్టుల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నారు. అభ్యర్థులందరికీ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది. ఉదయం 9 నుంచి 10.40 గంటల దాకా మెకానికల్, కెమిస్ట్‌లకు పరీక్ష జరుగనుండగా.. మధ్యాహ్నం 1 గంట నుంచి 2.40 గంటల దాకా ఎలక్ట్రికల్ అభ్యర్థులకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.40 దాకా సివిల్, ఎలక్ట్రానిక్స్ అభ్యర్థులకు పరీక్ష జరుగనుంది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మార్చి 23వ తేదీ నుంచి www.tsgenco.co.in అనే వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ కోరారు.

ఉపకార వేతనాలివ్వకుంటే 20 నుంచి సర్జరీలు బంద్

- ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డి బోధనాస్పత్రుల్లోని డీఎన్‌బీ విద్యార్థుల హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమ ఉపకార వేతనాలను విడుదల చేయకుంటే ఈ నెల 20వ తేదీ నుంచి ఎలక్టివ్ వైద్య సేవలు(ముందుగా నిర్ణయించిన శస్త్రచికిత్సలు) నిలిపివేస్తామని ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డి బోధనాస్పత్రుల్లోని డీఎన్‌బీ విద్యార్థులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పది నెలలుగా ఉపకార వేతనం అందక అవస్థలు పడుతున్న తమ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని జిల్లా, జనరల్, సివిల్ ఆస్పత్రుల్లో డిప్లమేట్ నేషన్ బోర్డు(డీఎన్‌బీ) కింద 2022 నుంచి పీజీ వైద్య విద్య అందిస్తున్నారు. ఈ ప్రోగ్రామ్ కింద చేరిన పీజీ వైద్య విద్యార్థులకు.. ఎండీ/ఎంఎస్ వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకార వేతనం ఇస్తారు. అయితే, ఖమ్మం, కరీంగనర్, సంగారెడ్డిలోని జిల్లా ఆస్పత్రుల్లోని డీఎన్‌బీ విద్యార్థులకు పది నెలలుగా ఉపకార వేతనం అందడం లేదు. ఈ మూడు ఆస్పత్రులు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో ఉండడంతో విద్యార్థులు తమ సమస్యను టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తో పాటు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి కూడా తీసుకెళ్లారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చి నెల రోజులు దాటినా ఫలితం లేకపోవడంతో విధుల బహిష్కరణకు సిద్ధమయ్యామని విద్యార్థులు చెబుతున్నారు.

పదేళ్లు నేనే సీఎం

(మొదటి పేజీ తరువాయి)

గెలిపించారని నల్లగొండ సభలో కేసీఆర్ అన్నారని, కానీ.. ప్రజలు కంచర గాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని గెలిపించారని, ఏ పోటీకెళ్లినా ఈ రేసు గుర్రానిదే గెలుపని పేర్కొన్నారు. "అసెంబ్లీలో చర్చకు రాలే. నీళ్ల మీద చర్చ అంటే రాలే. నిధుల మీద చర్చ అంటే రాలే. నియామకాలపై మాట్లాడదామంటే రాలే. కానీ నల్లగొండకు పోయి బీరాలు పలికిండు. పొంకనాలు కొడుతున్నారు. ఈ రోజు అసెంబ్లీలో ఓ అటెండర్ నాతో మాట్లాడాడు. సార్ ఎల్బీ స్టేడియంలో ఒక్క మాట మీరు చెబితే వింటా అన్నాడు. కంచర గాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారని చెప్పండి అన్నాడు. ఆ కంచర గాడిదకు మళ్లీ అధికారం అన్నది కలలో మాట అన్న సంగతి మీరు చెప్పాలి సార్ అని కోరాడు. ఆ అటెండర్‌కు ఉన్న ఇంగిత జ్ఞానం సీఎంగా పనిచేసిన చంద్రశేఖరరావుకు లేదు. ఆయన మళ్లీ వస్తాడంటా. నడవడానికే వస్తలేదంటివి, వీల్ ఛైర్‌లో తిరుగుతున్నా అంటున్నావు. ఎట్లొస్తావని నేను అడుగుతున్నా" అని రేవంత్ అన్నారు.

మోకాళ్ల మీద కొట్టి లాకప్‌లో వేస్తారు

కేసీఆర్ మళ్లీ రావాలనుకున్నా.. పోలీస్ నౌకరీ వచ్చిన ఈ పిల్లలు ఊరుకోరని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. శిక్షణ తర్వాత రాష్ట్రమంతా ఈ యువకులే ఉంటారని, తెలంగాణను దోచుకున్న నిన్ను, కుటుంబం కోసం తెలంగాణను బలిచ్చిన కేసీఆర్‌ను.. ఈ పిల్లలు లాఠీలతో మోకాళ్ల చిప్పల మీద కొట్టి లాకప్‌లో వేస్తారని అన్నారు. ఇంతకాలం వాళ్ల చేతిలో పెత్తనం లేదని.. ఇకనుంచి ఎట్లా తిరుగుతవో తిరగాలని సవాల్ విసిరారు. "సచ్చిన పామును సంపనీకి మాకేమైనా పిచ్చా. నీ పనైపోయింది. ఖేల్ ఖతం. దుకాణ్ బంద్. దీంతో చిన్నగా సానుభూతి కథ మొదలుపెట్టిండు. సావు నోట్ల తలపెట్టి తెలంగాణ సాధించిన అని చెబితే చూడలేదు కాబట్టి పిల్లలు నిజమే అనుకున్నారు. ఇవాళ నీ డ్రామాలు చూసిన్రు. ఉత్తప్పుడు బాగనే నడుస్తుండు. మీటింగ్‌కు రాగానే వీల్ ఛైర్‌లో కూసుంటుడు" అని సీఎం వ్యాఖ్యానించారు. "తెలంగాణ ఏర్పడిన వెంటనే



సీఎం హోదాలో మొదటి సారిగా సీఎల్పీ కార్యాలయానికి వచ్చిన రేవంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్న కేసీఆర్.. తెలంగాణ పిల్లలు ఏం పాపం చేశారని 30 లక్షల మంది 3,650 రోజుల పాటు ఉద్యోగాలకు ఎదురు చూసేలా చేశావ్? మేం ఉద్యోగాల దిశగా ఆలోచన చేస్తుంటే కాళ్లల్లో కట్టెపెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నావ్? అడుగుతున్నా. ఇప్పటికైనా మీకు అర్థం కాలేదా? మీ కుటుంబాన్ని తెలంగాణ సమాజం బహిష్కరించింది" అని అన్నారు.

మా అన్న దగ్గరకు పోయినమని హరీశ్‌రావుకు చెప్పండి

ఉద్యోగాలు భర్తీ చేయాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి రాలేదని సీఎం రేవంత్ తప్పుబట్టారు. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల ఆశలు తీరలేదని అన్నారు. అధికారులతో సమీక్షించి ఆటంకాలు తొలగించామని చెప్పారు. "నిరుద్యోగ యువకులారా.. అధైర్యపడొద్దు. ఈ రాష్ట్రం మీదే. మీకోసం పనిచేయడానికి, సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీరంతా మా తమ్ముళ్లు. మీ ఆనందాన్ని మేమూ పంచుకుంటాం. తెలంగాణ కోసం కొట్లాడిన యువత ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉంది" అని సీఎం తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినపుడు ఎంతటి ఆనందం కలిగిందో ఇపుడు ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తుండగా అంతే సంతోషం కలిగిందన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని అప్పుడే తమను శాపనార్థాలు పెడుతున్నారని తప్పుబట్టారు. శాఖల వారీగా సమీక్షించి, కోర్టు కేసులను పరిశీలించి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. "ఉద్యోగ నియామకాల్లో ఒక్కో అడుగు ముందుకేస్తున్నాం. మీ నమ్మకానికి తగ్గట్లు.. తప్పు జరగకుండా, ఎవరికీ నష్టం లేకుండా రాబోయే రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం. గ్రూప్ -1పై ప్రకటన చేశాం. పోటీ పరీక్షలకు సన్నద్ధంకండి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి బాధ్యత నేను తీసుకుంటా. మీ కోసం కృషి చేస్తా" అని రేవంత్ అభయమిచ్చారు. "లక్షలాది నిరుద్యోగులకు ఈ వేదిక నుంచి పిలుపునిస్తున్నా. మేం 60 రోజుల్లో ఒక్కోటి పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. 6,956 స్టాఫ్ నర్సులు, సింగరేణిలో 441 కారుణ్య నియామకాలు చేపట్టాం. కేసీఆర్, హరీశ్ అరిచి గోలపెట్టినా, అంగీ, లాగు చించుకున్నా.. వచ్చే 15 రోజుల్లో ఎవరు అడ్డుపడ్డా ఉద్యోగ నియామకాలు చేపడతానని ఆ రోజే చెప్పా. 10 రోజుల్లోనే సుమారు 13,500 నియామకాలు చేపట్టా. రేపు ఇక్కడే 2 వేల పైగా ఉద్యోగాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఎవరి నియామక పత్రం వారి ఇంటికి పంపిస్తే సరిపోతుంది కదా అని హరీశ్ అంటున్నారు. నీ కడుపు నొప్పి ఏంది? అని అడుగుతున్నా. వీళ్లంతా మా తమ్ముళ్లు, చెల్లెళ్లు. వారి ఆనందంలో భాగమైతే నాకు కంటినిండా నిద్ర పడతది. బుక్కెడు బువ్వ ఒంటపడ్తది" అని సీఎం అన్నారు. "యువత సంతోషంలో భాగమయ్యేందుకే ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేశాం. ఆ హరీశ్ ఎక్కడైనా అడ్డంపడితే మా అన్న దగ్గరికి పోయినం. ఆయన అండగా నిలబడ్డడని చెప్పండి' అని సూచించారు. మీ అన్నగా... మీ రేవంత్ అన్నగా అండగా ఉంటానని అధైర్యపడొద్దని పేర్కొన్నారు.

సీఎల్పీ సీట్లో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి.. బుధవారం మొదటి సారిగా సీఎల్పీ కార్యాలయానికి వెళ్లారు. బుధవారం వసంత పంచమి.. మంచి రోజు కావడంతో.. కార్యాలయానికి రావాలంటూ రేవంత్‌రెడ్డిని సీఎల్పీ కార్యాలయ కార్యదర్శి శ్రీకాంత్ ఆహ్వానించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటుగా సీఎల్పీ కార్యాలయంలోని తన చాంబర్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి తనకు కేటాయించిన ఛైర్‌లో ఆసీనులయ్యారు. సీఎల్పీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌ను ఇటీవలే రెనెవేట్ చేశారు.

చీకటి మిత్రుడు జగన్‌తో కలిసి కేసీఆర్ కుట్ర

కేసీఆర్ పదేళ్లు ఉండి తెలంగాణకు రావాల్సిన నీళ్లు తీసుకురాలేదని. కట్టాల్సిన ప్రాజెక్టులు కట్టలేదని రేవంత్ పేర్కొన్నారు. కృష్ణాలో నీటి వాటాలపై ఆయన పెట్టిన సంతకాలు తెలంగాణ ప్రజల పాలిట మరణ శాసనాలు అయ్యాయని, గుదిబండలుగా మారాయని రేవంత్ విమర్శించారు. అయినా, కేసీఆర్ మళ్లీ నీళ్ల అంశాన్నే ఎత్తుకుంటున్నాడని.. ఏ దారి లేక నీళ్లదారి పట్టిండని.. నల్లగొండలో సభ పెడితే యువకులు గుడ్లు, టమాటాలు విసిరారని.. పోలీసులు ఉండడంతో కేసీఆర్ వీపు చింతపండు కాలేదని అన్నారు. ఢిల్లీకి పోయి కొట్లాడదామంటే మాత్రం ఇంటి నుంచి బయటకు రావడం లేదని ఎద్దేశా చేశారు. ఆయనకు చేతకాకపోతే, పక్కన పడేసి ఉంటే తానే కొట్లాడి నీళ్లు తెచ్చేవాడినన్నారు. తెలంగాణలో ఎన్నికల ముందు రోజు కేసీఆర్ చీకటి మిత్రుడు జగన్ వందలాది మంది పోలీసులను సాగర్ మీదికి పంపించారని.. వారిని వెనక్కు పంపేందుకు ప్రధాని మోదీ సీఆర్‌పీఎఫ్ పంపాడని పేర్కొన్నారు. ఎన్నికల్లో సెంటిమెంట్‌తో నెగ్గాలని కేసీఆర్ చూస్తే తెలంగాణ సమాజం తిప్పికొట్టి బొందపెట్టిందని రేవంత్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో గంజాయి పదం వినపడొద్దు

పంజాబ్‌లో గంజాయి, డ్రగ్స్‌తో యువత నిర్వీర్యమైందని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను కబళించేందుకు గంజాయి, డ్రగ్స్ ముఠాలు తిరుగుతున్నాయని ఎన్ని పట్టుకున్నా, ఎంత ప్రయత్నం చేసినా ఇంకా వాళ్లు ఆ దిశగానే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. "మీకు ఒక్కటే మాట చెబుతున్నా. తులసి వనంలాంటి ఈ రాష్ట్రంలో గంజాయి మొక్కలు ఉండొద్దు. రాష్ట్రాన్ని, యువతను నిర్వీర్యం చేసే బలహీనతలు ఉండొద్దు. డ్రగ్స్, గంజాయి పదం పలకాలంటే కాళ్లలో వణుకు పుట్టాలి. కడుపులో చలి జ్వరం జొరబడాలి. తెలంగాణ యువకులంటే సలసల మరిగే రక్తంతో ఉరకలెత్తేవారు. వారు గంజాయి, డ్రగ్స్‌కు బానిసైతే సమాజం నిర్వీర్యమవుతుంది. నియామక పత్రాలు పొందుతున్న మీరంతా రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా నాశనం చేస్తామని ప్రమాణం చేయండి" అని రేవంత్ కోరారు.

నేడు గురుకుల అభ్యర్థులకు నియామక పత్రాలు

- సీఎం చేతుల మీదుగా అందజేత

హైదరాబాద్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకుల్లాలో పలు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేడు సీఎం రేవంత్ రెడ్డి నియామక ప్రతాలు అందించనున్నారు. ఈమేరకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో దాదాపు 2,090 మందికి నియామక పత్రాలు అందించడానికి అధికారులు ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. కాగా గురుకుల బోర్డు పరిధిలో మొత్తం 9,210 పోస్టులకు గతేడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎన్‌డీఎస్‌ఏను పిలిపిస్తున్నాం

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను.. పరిశీలించి.. నివేదిక ఇవ్వాలని లేఖ రాశాం
- ఆ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటాం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-1లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత, పటిష్టత, ఇతర అంశాలపై అధ్యయనం చేసి.. నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ)కి లేఖ రాసిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు ఇచ్చే నివేదిక ఆధారంగా బ్యారేజీల విషయంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి ఉత్తమ్ విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీని పూర్తిగా తొలగించాలా..? లేక కొంత మేర తొలగించి రిపేర్ చేయాలా..? అనే విషయంపైనా ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ప్రభుత్వం నడుచుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో జియోలాజికల్ ప్రొసీజర్‌ను పాటించారా..? లేదా..? అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీపై విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతుందని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ వైఫల్యానికి కేసీఆర్‌దే బాధ్యత అని.. ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోతే.. నీళ్లు ఎత్తిపోయాలంటూ కేసీఆర్ డిమాండ్ చేయడంలో అర్థం లేదన్నారు.

కేసీఆర్ అంత మేధావులం కాదు..

కేసీఆర్ అన్ని విషయాల్లో అనుభవజ్ఞుడని అయితే.. తాము అలా కాదని.. అందుకే నిపుణుల కమిటీతో విచారణ చేయిస్తున్నామని ఉత్తమ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. హెలికాప్టర్‌లో తిరిగి.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించే చోట్లను కేసీఆర్ స్వయంగా ఖరారు చేశారని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో అంచనాలను అడ్డగోలుగా పెంచారని, రూ.వందల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కేసీఆర్ చేసిన అప్పులపై రూ.18 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. కేసీఆర్.. చట్ట సభకు రాకుండా బయటి సభల్లో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టు అక్రమాలపైనా సమగ్ర విచారణ జరుగుతుందని వెల్లడించారు.

రేవంత్.. నీకు చేతకాకుంటే రాజీనామా చెయ్!



- నేను సీఎం అయి.. సమస్యను వెంటనే పరిష్కరిస్తా
- ఎవరు ఎన్నేళ్లు పదవిలో ఉండాలో ప్రజలే నిర్ణయిస్తారు
- కాళేశ్వరంతో ప్రయోజనం 20 లక్షల ఎకరాలకు: హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'చిన్న లోపాన్ని ఎత్తి చూపుతూ పదేపదే మమ్మల్ని దూషించడం కాదు.. నీకు చేతగాకుంటే రాజీనామా చెయ్.. నిపుణులతో చర్చించి మేడిగడ్డ సమస్యను పరిష్కరించడం చేతకాదని చెప్పి.. ఆ పదవి నుంచి దిగు.. నేను సీఎం అవుతా.. వెంటనే పరిష్కరించి చూపిస్తా..' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు సవాల్ విసిరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు ప్రాజెక్టుల నిర్మాణాల్లోనూ సమస్యలు తలెత్తాయని గుర్తుచేశారు. కాళేశ్వరం పరిధిలో ఎన్నో ప్రాజెక్టులున్నా.. మేడిగడ్డలో ఒకటి రెండు పిల్లర్లు కుంగిపోతే.. దాన్నే చూపించి మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 'మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావులకు మేడిగడ్డ అప్పగిస్తా.. దాన్ని బాగుచేసే బాధ్యత తీసుకుంటారా..?' అని అసెంబ్లీలో సీఎం రేవంత్ విసిరిన సవాల్‌కు స్పందనగా.. రేవంత్ దిగిపోతే తాను సీఎం అయి పరిష్కరిస్తానని హరీశ్ వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ వ్యాఖ్యలకు... ఎవరు ఎన్నేళ్లు సీఎం పదవిలో ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారని, అంతా బాగుంటే మళ్లీ ఆశీర్వదిస్తారని, ఒకవేళ పాలన బాగోలేకుంటే జనమే బండకేసి కొడతారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీళ్లు లేక పంటల సాగుకు ఇబ్బంది ఏర్పడుతుందని, బురద రాజకీయం మాని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ఎంత తక్కువచేసి మాట్లాడినా అది ముమ్మాటికి తెలంగాణకు వరదాయిని అని పేర్కొన్నారు. లోయర్ మానేరు నుంచి సూర్యాపేట దాకా చెరువులు నిండి భూమిలో ఊటలు పెరగడం, కూడవెల్లి వాగు పొంగినా.. హల్దీ వాగు దుంకినా, అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక్, మల్లన్న, కొండపోచమ్మ సాగర్‌లు నిండినా అది కాళేశ్వరం వల్లేనని, దాన్ని చెప్పకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంచారని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని వెల్లడించారు. కాళేశ్వరం విషయంలో జలాశయాల సామర్థ్యం పెంచామని, కొత్త జలాశయాలు ప్రతిపాదించామని, జలాశయాల సామర్థ్యాన్ని పెంచినందున భూసేకరణ, పునరావాసం కోసం అదనంగా ఖర్చు పెరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తట్ట మట్టి ఎత్తకుండానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనా విలువ రూ.17వేల కోట్ల నుంచి రూ.40వేల కోట్లకు ఎందుకు పెరిగిందో చెప్పాలనిడిమాండ్‌చేశారు.


కాళేశ్వరాన్ని బద్నాం చేసేందుకు దుష్ట పన్నాగం

మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగిపోతే దాన్ని పరిష్కరించకుండా.. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టునే బద్నాం చేసేలా కాంగ్రెస్ దుష్ట పన్నాగం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ సర్కారు ఇలా చేస్తోందన్నారు. విచారణకు తాము సిద్ధమని, ఈ ఘటనకు బాధ్యులెవరైనా ఉంటే శిక్షించాలని, టెక్నికల్ సమస్య తెలుసుకొని పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో కడెం వాగు, సింగూరు డ్యామ్, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కూడా కొట్టుకపోయాయని, పుట్టగండి ప్రాజెక్టు ప్రారంభించగానే కొట్టుకుపోయిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో పోలవరం డయాఫ్రంవాల్, రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు కూడా కొట్టుకుపోయిందని, ఇలాంటి ఘటనలకు కారణమైన వారిని శిక్షించి, పునరుద్ధరించి, రైతులకు న్యాయం చేశారని వెల్లడించారు. మొత్తం కాళేశ్వరం పరిధిలోని ప్రాజెక్టుల ద్వారా 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా ప్రయోజనం అందిందని, దానిని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ పనులు పూర్తి చేయక, నీళ్లు ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక అన్నీ పూర్తిచేసి నీళ్ళు అందించామని హరీశ్ తెలిపారు.

ఏయ్.. జాగ్రత్త!

నువు కూర్చోమంటే కూర్చునే పాలేర్లు లేరు.. కేటీఆర్ వ్యాఖ్యలపై పొన్నం ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'ఏయ్.. జాగ్రత్త.. ఏం.. కూర్చో అని మాట్లాడుతున్నావ్. నువ్వు భయపెడితే భయపడడానికి.. కూర్చో అనగానే కూర్చోవడానికి ఇక్కడ పాలేర్లు ఎవరూ లేరు' అంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా బీఆర్ఎస్ సభ్యుడు కడియం మాట్లాడుతూ.. ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి ప్రస్తావించారు. కాళేశ్వరం గురించి మాట్లాడుతూ.. కరీంనగర్‌కు కూడా నీళ్లొచ్చాయన్నారు. ఆయన మాటలకు స్పందించిన పొన్నం.. కాలువలు ఇవుడేమీ రాలేదని.. గతంలోనే వచ్చాయని, నీళ్లు కూడా గత కాంగ్రెస్ హయాంలో పారాయని గుర్తు చేశారు. ఆ సమయంలో మంత్రిని 'కూర్చో' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం.. భయపెడితే భయపడ్డానికి ఇక్కడ పాలేర్లు ఎవరూ లేరంటూ ఘాటుగా సమాధానమిచ్చారు. గతంలో మంత్రిగా వ్యవహరించిన వ్యక్తి సభలో మంత్రిగా ఉన్న తనను బెదిరించడం ఏంటంటూ మండిపడ్డారు. అదే సమయంలో పాడి కౌశిక్‌రెడ్డి కలుగజేసుకొని మాట్లాడుతుండగా.. ఓట్లేయకపోతే భార్యాపిల్లల శవయాత్ర చూడాల్సి వస్తుందని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసిన వ్యక్తి కూడా ఇక్కడ మాట్లాడుతున్నారని సెటైర్ వేశారు. ఎన్నికల ప్రచారంలో చిన్న పాపను కూడా రాజకీయాల్లోకి తీసుకువచ్చి.. ప్రచారం చేయించారని, ఆ పాప మానసిక పరిస్థితి ఎలా ఉంటుందన్నారు. ఇటు కౌశిక్‌రెడ్డి వద్దకు హరీశ్‌రావు వెళ్లి సర్దిచెప్పారు. ప్రసంగం ముగించిన తర్వాత కూర్చుంటూ.. 'అధ్యక్షా.. వాళ్లు కూర్చోమన్నారని కూర్చోవడం లేదు' అని గుర్తుచేసి మరీ తన సీటులో ఆసీనులయ్యారు. మరోవైపు, మంత్రి పొన్నంను కేటీఆర్ 'కూర్చో' అంటూ చేసిన వ్యాఖ్యలపై కలుగజేసుకున్న స్పీకర్.. ఒక మంత్రి మాట్లాడుతున్నపుడు కలుగజేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపర్చడం సమంజసం కాదని చెప్పారు.



చర్చలో బీఆర్ఎస్ సభ్యుడు కడియం మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ చీకటి రోజులున్నాయని, ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం అయ్యాయన్నారు. దానిపై స్పందించిన మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఎల్లంపల్లిని తాను చిన్నవాడిగా ఉన్నప్పుడే మొదలు పెట్టారని చెప్పారు. 2014నాటికే 80% పూర్తయిన గౌరెల్లి ప్రాజెక్టును కేసీఆర్ కుర్చీ వేసుకుని కూర్చొని మరీ నిర్మిస్తామని చెప్పినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అదే సమయంలో కేటీఆర్ కలుగజేసుకోగా.. పొన్నం స్పందిస్తూ.. 'పదేళ్లుగా సిరిసిల్ల ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి.. అప్పర్ మానేరు 9వ ప్యాకేజీని పూర్తిచేయని యువరాజు ఇప్పుడు మాట్లాడితే ఎలా? గౌరెల్లి కంటే ముందే హరీశ్ ప్రాంతంలోని ప్రాజెక్టులు ఎలా పూర్తయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే వరి ఉత్పత్తిలో కరీంనగర్ జిల్లా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను మించింది. తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కొత్త సభ్యులను తప్పుదోవ పట్టించే విధంగా చర్చ చేస్తున్నారు.. నేను కొత్తగా వచ్చిన సభ్యుడిని, సహకారం అందించాలి' అని వ్యాఖ్యానించారు.

కడియం వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

నీటి పారుదల శాఖపై పక్కాగా శ్వేతపత్రం

ముసాయిదా ప్రతుల్లో మార్పులు చేస్తున్న ప్రభుత్వం

బడ్జెట్‌పై చర్చ తర్వాత సభలో శ్వేతపత్రం?

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): లోపాలకు ఎంతమాత్రం తావివ్వకుండా పకడ్బందీగా నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనేపథ్యంలో సంబంధిత శ్వేతపత్రం ముసాయిదా ప్రతుల్లో ప్రతిరోజూ మార్పులు చేస్తోంది. బుధవారం కూడా నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శ్వేతపత్రంలో పలు మార్పులు, చేర్పులు చేయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలన్నీ వెలుగుచూసేలా శ్వేతపత్రం ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 2014 నుంచి 2023దాకా చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ ప్రధానంగా శ్వేతపత్రంలో పేర్కొననున్నారు. ప్రాజెక్టుల వారీగా వ్యయం, కొత్త ఆయకట్టు వంటి అంశాలే ప్రముఖంగా శ్వేతపత్రంలో ఉండనున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటుచేసుకున్న వైఫల్యాలు ఇందులో పొందుపరచనున్నారు. దేశవ్యాప్తంగా బ్యారేజీల సామర్థ్యం, ఆయా బ్యారేజీల కింద సాగు విస్తీర్ణంపాటు మేడిగడ్డ వైఫల్యానికి కారణమైన నీటి నిల్వ సామర్థ్యం ప్రధానంగా ప్రస్తావించనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక సారాంశం కూడా శ్వేతపత్రంలో ఉండనుంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఉంటే కలిగే ప్రయోజనాలు, రీఇంజనీరింగ్‌తో తెరమీదికి తెచ్చి చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కలిగిన నష్టం శ్వేతపత్రంలో ఉండనుంది. గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్మాణం ఏ ప్రయోజనాల కోసం చేపట్టారో ప్రభుత్వం స్పష్టం చేయనుంది. కాగా శ్వేతపత్రం ఏ రోజు విడుదల చేయాలనే దానిపై స్పష్టత రాలేదు. బుధవారం శాసనసభలో శ్వేతపత్రం పెట్టనున్నట్లు మేడిగడ్డ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. అయితే ఈ రోజు బడ్జెట్‌పై చర్చకే సభ పరిమితమైంది. ఏ రోజు శ్వేతపత్రం పెట్టాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మరికొన్ని రోజులు సభ సాగే అవకాశం ఉండటంతో బడ్జెట్‌పై చర్చ అనంతరమే శ్వేతపత్రం సభలో పెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

జన్వాడలో తీవ్ర ఉద్రిక్తత

- రోడ్డు వివాదంలో ఘర్షణ.. పలువురికి తీవ్ర గాయాలు
- దళితులకు మద్దతుగా ప్రవీణ్‌కుమార్ నిరసన.. అరెస్టు
- ఈ నెల 21 వరకు 144 సెక్షన్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : రోడ్డు వివాదం ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. పరస్పర దాడులతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరికొకరు తలలు పగిలేలా కొట్టుకున్న ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. విర్యాగూడ గేటు నుంచి జన్వాడ గ్రామం వరకు ప్రభుత్వ నిధులతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే, గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో క్రైస్తవుల ప్రార్థన మందిరానికి అనుకుని రోడ్డు వేయొద్దని కొంతమంది యువకులు గ్రామస్థులతో గొడవకు దిగారు. దాంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బుధవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేయడంతో ఓ దళిత కార్యకర్త హై టెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి ప్రవీణ్‌ను విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశాడు. మరోవైపు, జన్వాడలో ఫిబ్రవరి 21 వరకు 144 సెక్షన్ విధిస్తునట్లు సీపీ అవినాష్ మహంతి తెలిపారు.

మైలాన్ ఫార్మా ఆల్ప్రాజోలమ్ ఉత్పత్తి లైసెన్సు రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మైలాన్ ఫార్మా 'ఆల్ప్రాజోలమ్' ఉత్పత్తి లైసెన్సును రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ రద్దు చేసింది. ఔషధాలకు కాకుండా ఆల్ప్రాజోలమ్‌ను ఇతర అవసరాలకు తరలిస్తుండడంతో ఈ చర్యలు తీసుకుంది. సైకియాట్రిక్ సమస్యలకు కోసం ట్యాబ్లెట్లు, ఇంజక్షన్ల రూపంలో ఆల్ప్రాజోలమ్‌ను వైద్యులు రోగులకు సిఫారసు చేస్తారు. ఇదికాక, ఆల్ప్రాజోలమ్‌ను కల్లు తయారీలో మత్తు కోసం కొందరు వినియోగిస్తుంటారు. అయితే, 21 కిలోల ఆల్ప్రాజోలమ్‌ను ఇతర అవసరాలకు తరలిస్తుండగా మైలాన్ సంస్థ ఆవరణలోనే ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. దీంతో రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ కఠిన చర్యలు తీసుకుంది.

భారతీయ విద్యార్థుల కోసం గ్రేట్ స్కాలర్‌షిప్స్-24

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యార్థుల కోసం యూకే ప్రభుత్వ గ్రేట్ బ్రిటన్ క్యాంపెయిన్‌తో కలిసి 'గ్రేట్ స్కాలర్‌షిప్ 2024'ను అందిస్తున్నట్లు బ్రిటిష్ కౌన్సిల్ వెల్లడించింది. ఈ స్కాలర్‌షిప్స్‌తో విద్యార్థులు యూకేలో పలు విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ ఏడాది భారత విద్యార్థులకు 25 యూకే యూనివర్సిటీలు 26 పోస్ట్‌గ్రాడ్యుయేట్ గ్రేట్ స్కాలర్‌షిప్‌లను ఫైనాన్స్, మార్కెటింగ్, బిజినెస్, సైకాలజీ, హ్యూమానిటీస్ తదితర విభాగాల్లో అందిస్తున్నాయి. ఈ స్కాలర్‌షిప్స్‌లో భాగంగా 2024-25 విద్యాసంవత్సరానికి 10 వేల పౌండ్లను ట్యూషన్ ఫీజుగా అందించనున్నారు. స్కాలర్‌షిప్స్ సమాచారం కోసం https:// www.britishcouncil.in/studyuk/scholarships/greatscholarships చూడవచ్చు.

ఇంకా ఉమ్మడి రాజధాని ఏమిటి?: కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా ఏపీకి రాజధాని లేక పోవడానికి ఏపీ సీఎం జగన్ పిచ్చి తుగ్లక్ వ్యవహారమే కారణమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఏపీ ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ 2019లోనే ఆ ప్రభుత్వం తెలంగాణకు అప్పగించేసిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వ కార్యాలయాలే లేనప్పుడు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ మరో పదేళ్లు కొనసాగాలంటూ వైసీసీ నేత వైవీ సుబ్బారెడ్డి అనడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇరు ప్రాంతాల ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే సుబ్బారెడ్డి ఈ ప్రకటన చేశారని విమర్శించారు.

గవర్నర్ తిరస్కరణ ఆదేశాలను కొట్టేయాలి

- ఎమ్మెల్సీల భర్తీపై పిటిషనర్ల వాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గం సిఫార్సులకు వ్యతిరేకంగా తమ నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీచేసిన ఆదేశాలను కొట్టేయాలని పిటిషనర్లు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ భర్తీపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం కూడా విచారణ కొనసాగించింది. గవర్నర్ తన పరిధికి మించిన నిర్ణయం తీసుకున్నారని పిటిషనర్లు తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం నచ్చకపోతే తిప్పి పంపాలేగానీ తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని పేర్కొన్నారు. తమకు రాజకీయాలతో సంబంధం ఉందని గవర్నర్ తమ నామినేషన్లను తిరస్కరించారని, మరి గవర్నర్‌కు రాజకీయ నేపథ్యం లేదా అని ప్రశ్నించారు. రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధాలున్న కోదండరాం, అమీర్‌అలీ నిమినేషన్‌లను ప్రస్తుతం ఎలా ఆమోదించారని అడిగారు. గురువారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

రామానుజాచార్యుల పరంపరలో కరి నారాయణాచార్య కృషి

- సంగీత, నృత్య పరిశోధకురాలు కరి యామిని కృష్ణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14: రామానుజాచార్యుల జీవిత ఔన్నత్యాన్ని కరి నారాయణాచార్య భాగవతార్ రాసిన యతిరాజ కీర్తనలు చాటుతున్నాయని సంగీత, నృత్య పరిశోధకురాలు కరి యామిని కృష్ణ అన్నారు. టీటీడీ-ఎస్వీ సంగీత, నృత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళా వైభవం పేరిట తిరుపతిలో జరుగుతున్న దక్షిణాది సంగీత, నృత్యోత్సవంలో ఆమె 'కరి నారాయణాచార్య భాగవతార్ యతిరాజ కీర్తనలు-భగవద్ రామానుజాచార్యుల జీవిత విశేషాలు' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. సింహాచలం సుప్రభాతం రచయిత అయిన కరి నారాయణాచార్యుల భాగవతార్ ఆళ్వారులు, రామానుజాచార్యుల పరంపరలో కృషిని సాగించారని తెలిపారు. త్రిదండి పెద్దజీయర్, చిన్నజీయర్ స్వాముల సమక్షంలో యతిరాజ కీర్తనలు పాడి కరి నారాయణాచార్యులు ప్రశంసలను పొందారని తెలిపారు. హరికథ భాగవతార్‌గా అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చారని వివరించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో ఆచార్య ఆర్ఎస్ శైలేశ్వరి పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్న కరి యామిని కృష్ణ, ప్రస్తుతం శ్రీకాకుళంలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో సంగీత అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు.

'సాగర్' నిర్వహణ ఒక రాష్ట్ర పరిధిలోనే ఉండాలి

- ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తాం
- కుడి కాల్వ విద్యుత్ కేంద్రంలో లీకేజీని పట్టించుకోరా?
- ఏపీ అధికారులపై ఎన్‌డీఎస్ఏ చైర్మన్ ఆగ్రహం

నాగార్జున సాగర్, ఫిబ్రవరి 14: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ ఒక రాష్ట్ర పరిధిలో ఉంటేనే బాగుంటుందని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ రమేష్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా రెండో రోజు బుధవారం ఎన్‌డీఎస్ఏ బృందం సభ్యులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, కుడికాల్వ జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ నిర్వహణ బాగుండటంతో ఆరు దశాబ్దాలు దాటినా నేటికీ సాగర్ ప్రాజెక్టు పటిష్ఠతలో ఏమాత్రం తేడా రాలేదన్నారు. ప్రాజెక్టు నిర్వహణ ప్రస్తుతం ఇరు రాష్ట్రాల పరిధిలో ఉందని, అంతా ఒక్కరి చేతిలో ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. రెండు నెలల క్రితం ప్రారంభం కావల్సిన ప్రాజెక్టు నిర్వహణ పనులు ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలతో నేటికీ ప్రారంభం కాలేదని, ఇలాగైతే ప్రాజెక్టు నిర్వహణ కష్టమవుతుందన్నారు. మరో నాలుగు నెలల్లో వానాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఒక్కసారిగా ఎగువనుంచి 10లక్షల క్యూసెక్కుల వరద వస్తే క్రస్ట్ గేట్లు మొరాయిస్తే పరిస్థితి ఏమిటని అధికారులను ప్రశ్నించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కుడికాల్వ జలవిద్యుత్ కేంద్రంలో నీటి లీకేజీలను పట్టించుకోవడం లేదని ఏపీ నీటి పారుదలశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో రివర్సబుల్ పంపింగ్ ద్వారా నీటిని జలాశయంలోకి పంపే క్రమంలో నీటి లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని ఏపీ నీటి పారుదల శాఖ అధికారులు ఎన్‌డీఎస్ఏ సభ్యులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్రానికి నివేదికలు అందజేస్తామని ఎన్‌డీఎస్ఏ సభ్యులు తెలిపారు. మూడోరోజు పర్యటనలో భాగంగా గురువారం కుడి, ఎడమ కాల్వల హెడ్ రెగ్యులేటర్లను పరిశీలించిన అనంతరం మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించి ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను, గుర్తించిన లోపాలపై నివేదికలను కేంద్రానికి అందజేస్తామని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సభ్యులు, అధికారులు

రేణుక, అనిల్‌కుమార్ రాజ్యసభకు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అనిల్‌కుమార్ యాదవ్‌ను అభ్యర్థులుగా ఖరారు చేసింది. ఈ క్రమంలో అధిష్ఠానం తన చేతిలో ఉన్న ఏఐసీసీ కోటా సీటును కూడా త్యాగం చేసింది. ఈ నిర్ణయంతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు.. నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉన్న కమ్మ సామాజిక వర్గ ఓటర్లను ఆకట్టుకునే అవకాశాలున్నాయి. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు అవకాశం కల్పించిన అధిష్ఠానం.. ఇప్పుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు ఎంపిక చేసింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.! దీన్ని బట్టి బీసీ సామాజిక వర్గంతోపాటు.. యువతకు ప్రాధాన్యమిస్తున్నామనే సంకేతాన్ని అధిష్ఠానం పంపింది.

ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు

అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉన్న రేణుకాచౌదరి.. పార్టీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. టీడీపీ నుంచి మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) కార్పొరేటర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేణుకాచౌదరి.. ఆ తర్వాత అదే పార్టీ తరఫున 1986లో రాజ్యసభకు ఎంపికయ్యారు. దేవగౌడ ప్రభుత్వంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిగా సేవలందించారు. ఆ తర్వాత టీడీపీని వీడి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె.. వరుసగా 1999, 2004 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. మన్మోహన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. 2009లో ఖమ్మం నుంచి ఓటమిపాలైన రేణుకాచౌదరి.. 2012లో రాజ్యసభకు ఎంపికై.. 2018 వరకు కొనసాగారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం సీటును ఆశిస్తున్న రేణుకకు అనూహ్యంగా రాజ్యసభ స్థానం దక్కింది. రాజ్యసభ అభ్యర్థిగా రేణుక ఎంపికైన నేపథ్యంలో.. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆమె నివాసానికి వెళ్లి, అభినందించారు.





తనదైన ముద్ర వేసిన అనిల్

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పని చేసిన అనిల్‌కుమార్ యాదవ్.. వివిధ అంశాలపై మెరుపు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి, తనదైన ముద్ర వేశారు. రాష్ట్రంలో అధికారం లేక.. హైదరాబాద్ నగరంలో ఉనికిలేని పరిస్థితుల్లో పార్టీ తరఫున ఉద్యమాలకు పెద్ద దిక్కుగా నిలిచారు. 2018 ఎన్నికల్లో పార్టీ తరఫున ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి, ఓటమిపాలయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో అనిల్ కుమార్‌యాదవ్.. ఆయన తండ్రి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్‌లకు మొదటి నుంచీ సాన్నిహిత్యం ఉంది. రాజ్యసభ అభ్యర్థిగా తన పేరును ప్రకటించిన తర్వాత ఆయన.. నేరుగా సీఎల్పీ కార్యాలయానికి వెళ్లి.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనకు రాజ్యసభ అవకాశం వస్తుందని అస్సలు ఊహించలేదన్నారు. కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు దదక్కుతుందనడానికి తానే ఉదాహరణ అన్నారు. తనను వరించిన పదవి యూత్‌కాంగ్రెస్‌కు గుర్తింపు అన్నారు. కాగా.. యాదవ సామాజిక వర్గానికి రాజ్యసభ అవకాశం ఇచ్చినందుకు పార్టీ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర

- ఖరారు చేసిన కేసీఆర్, నేడు నామిషన్ దాఖలు
- ఇచ్చిన మాట ప్రకారం రెండోసారి అవకాశం



హైదరాబాద్/ ఖమ్మం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా ఖమ్మం నగరానికి చెందిన వద్దిరాజు రవిచంద్ర (60) పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్‌కు ఉన్న బలం ప్రకారం ఆ పార్టీకి ఒక రాజ్యసభ స్థానం దక్కనుంది. దాంతో పార్టీ పెద్దలతో, ముఖ్యులతో చర్చించి కేసీఆర్ వద్దిరాజు పేరును ఖరారు చేశారు. అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మున్నూరుకాపు(బీసీ) సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు రవిచంద్ర 2019లో బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్ లోక్‌సభకు ఎన్నిక కావటంతో ఇంకా రెండేళ్ల గడువున్న ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించగా వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం ఇచ్చారు. ఆ సమయంలోనే మళ్లీ రాజ్యసభ సభ్యుడిగా తిరిగి అవకాశం ఇస్తానని వద్దిరాజుకు హామీ ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 2తో ఆయన పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఇంతకు ముందే ఆయనకిచ్చిన మాటప్రకారం కేసీఆర్ వద్దిరాజుకు టికెట్ ఖరారు చేశారు. తనకు మరోసారి రాజ్యసభ స్థానం కల్పించినందుకుగాను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో బుధవారం వద్దిరాజు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

భార్య, అత్తింటివారే ఆయువు తీశారు

వరంగల్‌లో యువకుడి దారుణ హత్య



శ్రీనివాస్ (ఫైల్)

కరీమాబాద్, ఫిబ్రవరి 14: భార్య, అత్తింటి వారి చేతిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కళ్లలో కారం కొట్టి, బండ రాయితో మోదడంతో దుట్ట శ్రీనివాస్(32) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసు కథనం ప్రకారం.. వరంగల్‌లోని రంగంపేట ప్రాంతానికి చెందిన దుట్ట శ్రీనివాస్(32)కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. నగరంలోని రంగశాయిపేటకు చెందిన రమ్యతో అతనికి 2015లో వివాహమైంది. మనస్పర్థల వల్ల ఏడాదికే శ్రీనివాస్, రమ్య పరస్పర కేసులు పెట్టుకున్నారు. దీంతో రమ్య ఎనిమిదేళ్లుగా తల్లిదండ్రులు రమేష్, విజయ, సోదరుడు అఖిల్‌తో కలిసి వారింట్లోనే ఉంటుంది. అయితే రమ్య తనకు దూరం కావడానికి అత్తింటి వారే కారణమని శ్రీనివాస్ భావించేవాడు. భార్యతోపాటు అత్తింటి వారిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టేవాడు. శ్రీనివాస్ వేధింపులు అధికం కావడంతో రమ్యను ఆమె తల్లిదండ్రులు కొంతకాలం క్రితం హైదరాబాద్ పంపించారు. అయితే, రంగశాయిపేటలో ప్రస్తుతం జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల కోసం రమ్య ఇంటికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ మంగళవారం రాత్రి రమ్య ఇంటి దగ్గరికి వెళ్లాడు. శ్రీనివాస్‌ను గమనించిన రమ్య కుటుంబసభ్యులు తమ ఇంటికి ఎందుకొచ్చావంటూ నిలదీయడంతో వాగ్వాదం మొదలైంది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన రమ్య, రమేష్, విజయ, అఖిల్ కలిసి శ్రీనివాస్ కళ్లలో కారం చల్లి అక్కడున్న బండరాయితో తలపై బలంగా మోదారు. దీంతో శ్రీనివాస్ కుప్పకూలగా ఓ తాడును అతని మెడకు బిగించి ప్రాణం తీశారు. నిందితులు నలుగురు పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం.

సామాజిక సేవలో ఎన్టీఆర్ ట్రస్టు విశేష కృషి

- విద్య, వైద్య రంగాల్లో సేవలు.. నేడు 27వ వసంతంలోకి

NTR TRUST
WE WORK THE TALK!

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు 27 వసంతాలు పూర్తిచేసుకుంది. సమాజాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. 1997లో ఏర్పాటయిన ఈ ట్రస్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య వైద్య రంగాల్లో పేదలకు అండగా నిలుస్తోంది. 1998 నుంచీ ప్రతీ సంవత్సరం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జనవరి 18న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోంది. రెండు రాష్ట్రాల్లో రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో మూడు కేంద్రాల్లో ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వేలాది మందికి ఆసరాగా నిలిచింది. 2005లో గండిపేటలో ప్రారంభించిన ఎన్టీఆర్ హైస్కూలు ఏటా వందలాది మంది పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తోంది. ట్రస్టు ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం 2019లో ఎక్సెల్ సివిల్స్ అకాడమీని ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలు నిర్వహించారు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో ట్రస్టు బాధితులకు బాసటగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా తన వంతు సాయంగా స్పందిస్తోంది. 2009లో వరదల సందర్భంగా కర్నూలులో 5 లక్షల మంది బాధితులకు సాయం అందించింది. 2013లో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని ప్రత్యేక విమానాల్లో వారి సొంత ప్రాంతాలకు చేర్చింది. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ నినాదం స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేసి 27 వసంతాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ట్రస్టు సీఈవో కె.రాజేందర్‌కుమార్, సీవోవో అడుసుమిల్లి గోపి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు తదితరులు బ్రోచర్ ఆవిష్కరించనున్నారు.

పెళ్లి బస్సును ఢీకొట్టిన లారీ



గాయపడిన మహిళను బయటకు తీస్తున్న స్థానికులు

- పెళ్లి కుమారుడి తాత మృతి, 15 మందికి గాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 14: మెదక్ జిల్లా నిజాంపేటలో బుధవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెళ్లి బృందంతో వెళ్తున్న బస్సును లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పెళ్లి కుమారుడి తాత మృతి చెందగా.. మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట జిల్లా పాలమాకుల గ్రామానికి చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ వివాహం మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరుగనుండగా అదే గ్రామానికి చెందిన పెళ్లి కుమారుడి దగ్గరి బంధువులు ఓ ప్రైవేట్ బస్సులో బుధవారం బయలుదేరారు. మెదక్ జిల్లా నిజాంపేట శివారులో ఎదురుగా వచ్చిన లారీ బస్సును బలంగా ఢీకొట్టగా ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. పెళ్లి కుమారుడి తాత చేర్యాల లింగయ్య(74) మరణించాడు. అతని భార్య జయమ్మ, కూతురు లలితకు బలమైన గాయాలవగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మిగతా క్షతగాత్రులంతా సిద్దిపేటలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు, లారీ డ్రైవర్ల తలలకు బలమైన గాయాలయ్యాయి. మరో గంటలో పెళ్లికి వెళ్తామనగా ఈ ప్రమాదం చోటు చేసుకోవడం పెళ్లింట విషాదం నింపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 15 ఫిబ్రవరి 2024



హైదరాబాద్ ఐఐఐటీలో
డిగ్రీ, డ్యూయెల్ డిగ్రీ

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- బీటెక్, డ్యూయెల్ డిగ్రీ (బీటెక్+ఎంఎస్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రత్యేక అడ్మిషన్ మోడ్‌ల(ఎస్‌పీఈసీ, యూజీఈఈ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీటెక్

ఈ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్స్(ఎస్‌పీఈసీ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సీబీఎస్ఈ-ఉడాన్ స్కీంలో అర్హత పొందిన బాలికలు; జవహర్ నవోదయ విద్యాలయాల్లో పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఎస్‌పీఈసీ మోడ్ ప్రకారం అభ్యర్థులు సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ రాయాల్సి ఉంటుంది. ఇది సబ్జెక్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్. ఇందులో మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సీబీఎస్ఈ, స్టేట్ బోర్డుల సిలబస్ ప్రకారం ఇంటర్; పదకొండు, పన్నెండు తరగతుల స్థాయుల్లో ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట. ఈ టెస్ట్‌లో అర్హత సాధించినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

బీటెక్+ఎంఎస్

ఈ ప్రోగ్రామ్‌లో బీటెక్, ఎంఎస్(రీసెర్చ్) కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ఈసీఈలో 25 సీట్లు, సీఎస్ఈలో 35 సీట్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో 45 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకొన్న అభ్యర్థులు ఎంఎస్‌లో కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, కంప్యూటింగ్ అండ్ హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కో స్పెషలైజేషన్‌కు 15 సీట్లు ప్రత్యేకించారు. అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(యూజీఈఈ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: 2024 జూన్ నాటికి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: అభ్యర్థులు సంస్థ నిర్వహించే యూజీఈఈ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటిది సబ్జెక్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్. దీనికి పరీక్ష సమయం గంట. ఇందులో సీబీఎస్ఈ, స్టేట్ బోర్డుల సిలబస్ ప్రకారం మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ఇంటర్, పన్నెండోతరగతి స్థాయుల్లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. రెండోది రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్. దీనికి పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అభ్యర్థి క్రిటికల్ అండ్ క్రియేటివ్ థింకింగ్ సామర్థ్యాన్ని పరీక్షించేలా ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఇస్తారు. యూజీఈఈలో అర్హత పొందినవారిని షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **బీటెక్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** రూ.600
- **డ్యూయెల్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** పురుషులకు రూ.2,500; మహిళలకు రూ.1250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు.
- **కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, యూజీఈఈల తేదీ:** మే 4
- **బీటెక్‌లో చేరే అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** మే 24, 25
- **డ్యూయెల్ డిగ్రీలో చేరే అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 11 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** iiit.ac.in

జాబ్ కార్నర్

సివిల్ సర్వీసెస్ / ఐఎఫ్‌ఎస్ ఎగ్జామ్ 2024

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామ్ 2024 నోటిఫికేషన్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. సీఎస్ఈ ద్వారా 1056, ఐఎఫ్ఎస్ సర్వీస్‌లో 150 పోస్టులు భర్తీ చేస్తారు.

అర్హతలు: ఏదైనా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: అభ్యర్థుల వయసు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

దరఖాస్తు ఫీజు: ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5

ప్రిలిమినరీ పరీక్ష: మే 26

మెయిన్స్ పరీక్ష: అక్టోబరు 19 నుంచి

వెబ్‌సైట్: https://upsconline.nic.in/upsc/OTRP/index.php

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్



నల్లగొండ, మిర్యాలగూడలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సీఎస్, బయాలజీ
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్.
3. ప్రీ ప్రైమరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్, యోగా ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్స్ కోచ్, మ్యూజిక్ టీచర్, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కోచెస్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 17

సమయం: ఉదయం 9 గంటల నుంచి

వేదిక: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, నల్లగొండ

వెబ్‌సైట్: https://nalgonda.kvs.ac.in/

ఐఐపీలో ఎంఎస్, పీజీ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్) 2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ డిజైన్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో అయిదు నెలలు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 98 క్రెడిట్లు నిర్దేశించారు.

పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు ఉన్నాయి. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ఇంట్రడక్షన్ టు ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్, ఎకనామిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇండస్ట్రియల్/ఫీల్డ్ విజిట్లు, ప్రాక్టికల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 1672 క్రెడిట్స్ నిర్దేశించారు. కోర్సు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

అర్హత: ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ డిప్లొమాలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ/లైఫ్ సైన్సెస్/మెటీరియల్ సైన్స్/బయో టెక్నాలజీ/జువాలజీ/బోటనీ/అగ్రికల్చరల్ సైన్సెస్/హార్టికల్చరల్ సైన్సెస్/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫుడ్ సైన్స్ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్/ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంట్ సైన్స్/పాలిమర్ కెమిస్ట్రీ/ఫిషరీ సైన్స్/నానో సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్/బీఫార్మసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్ పార్ట్ టైమ్ డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ఐఐపీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: ఐఐపీ సెట్ 2024లో సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, ఐఐపీ సెట్ 2024 స్కోర్‌కు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.500
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 8
- ★ **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- ★ **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- ★ **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** జూన్ 21
- ★ **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- ★ **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 5
- ★ **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- ★ **వెబ్‌సైట్:** www.iip-in.com

టీఎస్‌పీఎస్సీ/పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ పరిషత్



స్వాతంత్ర్యానంతరం మౌంట్ బాటన్ 1948 జూన్ 21 వరకు గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. తరవాత సి.రాజగోపాలచారి 1950 జనవరి 24 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. పాకిస్థాన్‌కు మహమ్మదాలి జిన్నాను గవర్నర్ జనరల్‌గా నియమించారు.

నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం: స్వాతంత్ర్యానంతరం నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంతో మౌంట్ బాటన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

1. జవహర్‌లాల్ నెహ్రూ - ప్రధాని, విదేశీ వ్యవహారాలు
2. సర్దార్ వల్లభభాయ్ పటేల్ - ఉప ప్రధాని, హోంశాఖ
3. బాబూ రాజేంద్రప్రసాద్ - వ్యవసాయం, ఆహారం
4. మౌలానా అబుల్ కలామ్ అజాద్ - విద్యాశాఖ
5. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - న్యాయశాఖ
6. సర్దార్ బలదేవ్‌సింగ్ - రక్షణశాఖ
7. షణ్ముగం శెట్టి - ఆర్థికశాఖ
8. జాన్ ముత్తాయ్ - రైల్వేలు, ఉపరితల రవాణా
9. బాబూ జగజ్జీవన్‌రామ్ - కార్మికశాఖ
10. రఫి అహ్మద్ కిద్వాయ్ - కమ్యూనికేషన్లు, పౌర విమానయానం
11. సిహెచ్.బాబా - వాణిజ్యం
12. ఎన్.వి.గాడ్గిల్ - గనులు, విద్యుత్
13. రాజ్‌కుమారి అమృత్‌కౌర్ - ఆరోగ్యం, వైద్యశాఖ
14. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ - పరిశ్రమలు

- భారత జాతి భవిష్యత్తు కోసం రాజ్యాంగం కావాలని, అందుకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కావాలని మొదటిసారి సుప్రసిద్ధ రాడికల్ మానవతావాది ఎం.ఎన్.రాయ్ అభిప్రాయపడ్డారు. అయితే అంతకుముందే రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని డిమాండ్లు ఉన్నాయి. 1918లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశం 'స్వయం నిర్ణయాధికారం' అనే భావనతో ఒక తీర్మానాన్ని ప్రకటించింది. ఇదే విషయాన్ని గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రస్తావిస్తూ 1922 జనవరి 5న 'భారతదేశానికి స్వాతంత్ర్యమనేది బ్రిటిష్‌వారు ఇచ్చే భిక్ష కాదని, భారతీయులు రాజకీయ భిక్షాటకులు కాదని, ప్రజలు తమను తాము అభివ్యక్తీకరించుకోడానికి గల స్వేచ్ఛ మాత్రమేనని' రాశారు. 1928 మే 19న మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగ రచనకు అఖిలపక్ష కమిటీ ఏర్పాటైంది. ఇది భారతీయులకే సొంత రాజ్యాంగ రచన కోసం జరిగిన నిర్మాణాత్మక కృషిగా పేర్కొంటారు. ఈ నెహ్రూ నివేదికలో భారతీయుల హక్కులు, ప్రభుత్వ పాలన, భిన్నవర్గాల ప్రయోజనాలను చర్చించారు.

- 1935 చట్టాన్ని ఏకపక్షంగా అమలుపరిచే ప్రయత్నం చేయడంతో 1936 ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సమావేశంలో దానిని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రత్యేక రాజ్యాంగ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. 1936లో జవహర్‌లాల్ నెహ్రూ 'హెరాల్డ్' పత్రికలో భారతీయులు తమను తాము పాలించుకోడానికి అవసరమైన చట్టాన్ని తయారుచేసుకొనే స్వేచ్ఛ కల్పించాలని రాశారు. ఈ అంశాన్ని 1935 నాటి హరిపుర కాంగ్రెస్ సమావేశం ఒక తీర్మానం రూపంలో ఆమోదించింది. భారతీయులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేస్తే కుల, మత, వర్గాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మహాత్మాగాంధీ 1939 నవంబరు 12న 'హరిజన' పత్రికలో రాశారు. ఈ డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1942 క్రిప్స్ ప్రతిపాదనల ద్వారా తొలిసారిగా రాజ్యాంగ పరిషత్ అవసరాన్ని గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఇంగ్లాండ్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రధాని అట్లీ, భారతీయులపై బల ప్రయోగం ద్వారా అధికారాన్ని చెలాయించలేమని నిర్ణయానికి వచ్చారు. 1945 సెప్టెంబరులో భారతీయులకు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు 1945 సెప్టెంబరు 19న నాటి వైస్రాయ్ వేవెల్, ఢిల్లీ రేడియో కేంద్రం ద్వారా ప్రసంగిస్తూ 'అతి త్వరలో రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరుగుతాయి. వాటికి ఎన్నికైన ప్రతినిధులు రాజ్యాంగ సభ సభ్యులను ఎన్నుకుంటారు' అని పేర్కొన్నారు. 1946 నాటికి మంత్రిత్రయ రాయబారాన్ని అనుసరించి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

రాజ్యాంగ సభ నిర్మాణం: 1946 జూన్, జూలై నెలల్లో సభకు ఎన్నికలు జరిగాయి. నాటి గవర్నర్ జనరల్ ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక మిలియన్ జనాభాకు ఒక సభ్యుని చొప్పున 389 మంది సభ్యులకు ప్రాతినిధ్యం, మూడు భిన్నమైన వర్గాల నుంచి ప్రతినిధుల ఎంపిక జరిగింది. ఈ ఎన్నికలు నైసర్గిక ప్రాతినిధ్య పద్ధతి ఆధారంగా జరిగాయి.

1. బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి పరోక్షంగా ఎన్నుకున్నవారు 292
2. స్వదేశీ సంస్థానాల నుంచి నియమించినవారు 93
3. చీఫ్ కమిషనర్ ప్రాంతాల్లో ఎన్నుకున్నవారు
4. మొత్తం 389 మంది.

నోట్: చీఫ్ కమిషనర్ ప్రాంతాలు నాలుగు అవి- 1) అజ్మీర్-మేర్వార్ 2) బెలూచిస్థాన్ 3) కూర్గ్ 4) ఢిల్లీ. - ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 208, ముస్లింలీగ్‌కు 73, ఇతరులు 15 మొత్తం 296. స్వదేశీ సంస్థానాలు 93తో కలిపి మొత్తం 389.

- ముస్లింలీగ్ పాకిస్థాన్ డిమాండ్‌తో రాజ్యాంగ పరిషత్ నుంచి వైదొలిగింది. దేశ విభజన తరవాత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కి పడిపోయింది. ఇందులో బ్రిటిష్ పాలిత ప్రాంతాల ప్రతినిధులు 229, స్వదేశీ సంస్థానాల ప్రాతినిధ్యం 70 కలిపి మొత్తం 299.
- గాంధీ, జిన్నా రాజ్యాంగ సభకు ఎన్నిక కాలేదు.
- ముస్లింలకు, సిక్కులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు 15 మంది ప్రముఖులను నామినేట్ చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహిళలు: విజయలక్ష్మీ పండిట్, సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, హంసా మెహతా, రాజ్‌కుమారి అమృత్‌కౌర్.
- ఆంధ్ర ప్రాంతం నుంచి ఎన్నికైనవారు: టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవరెడ్డి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కల్లూరి సుబ్బారావు, కళా వెంకట్రావ్, ఆచార్య ఎన్.జి. రంగా, రామకృష్ణ రంగారావు, ఎం.సత్యనారాయణ.



వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్

మీకు తెలుసా?


కొందరు ఎడం చేతికి ఎక్కువగా వాడుతారు. అలాంటి ఎడం చేతివాటం వారికి సంబంధించిన కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు

- గ్రీకు సామ్రాజ్యంలో ఎడం చేతి వాటం వారిని కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని నమ్మేవారు. అందువల్ల వారికి సమాజంలో ప్రత్యేక స్థానం ఉండేది.
- ఎడం చేతి వాటం వారిలో ప్రముఖ స్విమ్మర్ మైఖల్ ఫిలిప్స్, ప్రముఖ గాయనీగాయకులు డెవిడ్ బోయ్, కర్ట్ కొబియాన్, జస్టిన్ బీబర్, అమీ వైన్‌హౌస్ మొదలైన వారు ఉన్నారు.
- ఎడం చేత్తో బేస్‌బాల్ వాడేవారిని సౌత్‌పా అని పిలుస్తారు.
- ఎడం చేతిని ఎక్కువగా ఉపయోగించేవారి కోసం ప్రత్యేకమైన కత్తెరలు, పెన్నులు మొదలైనవి అందుబాటులో ఉన్నాయి.
- కొన్ని కుక్కలు, పిల్లులు ఎడం కాలిని ఎక్కువగా వాడతాయి. వీటిపై కొన్ని అధ్యయనాలు కూడా జరిగాయి.
- ఎడం చేతితో రాసేవారి చేతి రాత మిగిలిన వారి కన్నా భిన్నంగా ఉంటుంది.



సింహాలు ఎన్ని ఉన్నాయి?


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలను గుర్తించండి



డైలీ సుడోకు - 230

		8				6		2
	5	6		1				
			7		8			5
							2	1
2			4		5			3
3	8							
9			1		7			
				3		1	4	
6		1				9		

సుడోకు - 229 సమాధానం

8	1	5	4	9	2	7	3	6
2	6	4	7	3	5	1	9	8
9	7	3	6	1	8	5	4	2
4	8	6	3	5	1	9	2	7
1	3	9	8	2	7	4	6	5
5	2	7	9	4	6	3	8	1
3	5	2	1	8	4	6	7	9
6	4	1	2	7	9	8	5	3
7	9	8	5	6	3	2	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.